సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 133
శనివారం 3-8-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సాక్షి బిజినెస్
శనివారం
3-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
886	293
80,981	24,718

విదేశీ సూచీలు (తొలి సెషన్ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,702	▽	498
డోజోన్స్	39,476	▽	872
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,175	▽	109
డాక్స్	17,661	▽	422
షాంఘై	2,905	▽	27
నికాయ్	35,910	▽	2,217

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్లు)	68,990
బంగారం (22 క్యారట్లు)	65,700
వెండి (కిలో)	91,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.36	108.95
€	యూరో	ఎస్‌బీఐ	89.54	91.45
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.53	55.34
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.56	55.49
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.45	65.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.45	23.01
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.62
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.72	12.45

గోల్డ్ బాండ్స్.. లక్కీ చాన్స్!

ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు.. బడ్జెట్లో మోదీ సర్కారు బంగారంపై గురి పెట్టింది. అనూహ్యంగా దిగుమతి సుంకాన్ని సగానికిపైగా తగ్గించడంతో కొత్తగా సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ)లో పెట్టుబడి పెట్టేవారికి ధర భారీగా దిగొచ్చింది. మరోపక్క, పాత బాండ్ల చెల్లింపులపై (రిడెంప్షన్లు) భారాన్ని కూడా ప్రభుత్వం తగ్గించుకుంటోంది. తాజా నిర్ణయంతో గోల్డ్ బాండ్ స్కీమ్ మరింత ఆకర్షణీయంగా మారుతుందంటున్నారు విశ్లేషకులు!

- దిగుమతి సుంకం కోతతో ఊరిస్తున్న పుత్తడి
- కొత్త గోల్డ్ బాండ్లలో పెట్టుబడులు ఆకర్షణీయం
- రిడెంప్షన్లపై ప్రభుత్వానికి భారీ ఊరట...

బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని ఈ ఏడాది బడ్జెట్లో 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో పసిడి ధరలు ఒక్కసారిగా రూ. 5,000 మేర పడిపోయాయి. దీంతో గత కొద్ది రోజులుగా బంగారం షాపులు కళకళలాడిపోతున్నాయి. మళ్లీ ధర పెరిగిపోతుందేమోనన్న ఆత్రుతతో పసిడి ప్రియులు ఇన్వెస్ట్‌మెంట్ కోసం కూడా పుత్తడి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతుండటంతో డిమాండ్ పుంజుకుందని బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నారు. ధర భారీగా తగ్గడం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా విడుదల చేసే గోల్డ్ బాండ్లకు కూడా గిరాకీ ఉంటుందని భావిస్తున్నారు. దేశంలో భౌతిక రూపంలో బంగారం డిమాండ్‌ను తగ్గించడంతో పాటు ప్రజల పొదుపు మొత్తాలను పసిడిలోకి కాకుండా ఆర్థికపరమైన సాధనాల్లోకి మళ్లించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2015లో గోల్డ్ బాండ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటిదాకా వీటి ద్వారా ప్రభుత్వం రూ. 72,274 కోట్ల నిధులను సమీకరించింది.


అప్పట్లో గ్రాము రూ.3,100...

2015 నుంచి 2017 వరకు మూడేళ్లలో జారీ చేసిన గోల్డ్ బాండ్లకు గ్రాము రేటు రూ.3,100 నుంచి రూ.3,500 స్థాయిలో ఉంది. తాజా బడ్జెట్‌కు ముందు గ్రాము మేలిమి బంగారం ధర రూ.7,200 పలికింది. గోల్డ్ బాండ్ గడువు వ్యవధి (మెచ్యూరిటీ) 8 ఏళ్లు. అంటే, గతంలో జారీ చేసిన బాండ్ల గడువు తీరుతుండటంతో ఇప్పుడు ప్రభుత్వం తిరిగి చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. రేటు రెట్టింపునకు పైగా పెరిగిపోవడంతో ప్రభుత్వ ఖజానాపై భారం కూడా భారీగా ఉంటుంది. దిగుమతి సుంకం తగ్గింపుతో ఒక్కో గ్రాముపై రేటు భారీగా దిగొచ్చింది. అంతర్జాతీయంగా పసిడి ధరల ట్రెండ్ ప్రస్తుత స్థాయిలోనే కొనసాగితే, బాండ్ రిడెంప్షన్లపై సర్కారు చెల్లింపులు తగ్గుతాయి.

130 శాతం రాబడి...

గోల్డ్ బాండ్ల గడువు తీరిన తర్వాత, రిడెంప్షన్ తేదీకి ముందు 24 క్యారెట్ల బంగారం 3 రోజుల సగటు ధర ప్రకారం రూపాయిల్లో చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ బాండ్ స్కీమ్ కింద ఎనిమిదేళ్ల క్రితం 2016 ఆగస్టులో జారీ చేసిన సిరీస్–1 బాండ్ల గడువు ఈ నెలలోనే ముగుస్తుంది. అప్పట్లో ఒక్కో గ్రాముకు రూ.3,119 చొప్పున ఇన్వెస్టర్లు చెల్లించారు. దీనికి వార్షికంగా 2.75 శాతం వడ్డీ కూడా జమవుతుంది (ప్రస్తుతం వడ్డీ 2.5 శాతంగా ఉంది). తాజా రేటు ప్రకారం రూ. 6,900–7,000 స్థాయిలో రిడెంప్షన్ ధర ఉండొచ్చని అంచనా. దీని ప్రకారం చూస్తే, వడ్డీ కూడా కలిపితే ఇన్వెస్టర్లకు 130 శాతం లాభాలు వస్తున్నట్లు లెక్క. అయితే, ప్రభుత్వ గ్యారంటీ ఉండటం, వార్షికంగా 12–13 శాతం రాబడులు పక్కాగా లభిస్తుండటంతో గోల్డ్ బాండ్లకు వన్నె తగ్గదని నిపుణులు అంటున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



సెప్టెంబర్‌లో మరో విడత!

బడ్జెట్లో సుంకం కోత నిర్ణయం నేపథ్యంలో తాజా గోల్డ్ బాండ్ల జారీని ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చింది. చివరిగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌జీబీలను జారీ చేశారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఏటా నాలుగు సార్లు చొప్పున ఎస్‌జీబీలను కేంద్రం అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి విడత బాండ్లను సెప్టెంబర్‌లో జారీ చేయొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నారు. గ్రాము ధర ప్రస్తుత ట్రెండ్ ప్రకారం రూ. 7,000కు అటుఇటుగా నిర్ణయించే అవకాశం ఉండటంతో ఇన్వెస్టర్ల నుంచి భారీగా డిమాండ్ ఉంటుందని రిద్ధిసిద్ధి బులియన్స్ ఎండీ పృథ్వీరాజ్ కొఠారి అభిప్రాయపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు విడతల్లో బాండ్ల జారీ ఉంటుందని అంచనా. తద్వారా ప్రభుత్వం రూ.18,500 కోట్లను సమీకరించే అవకాశం ఉంది. అమెరికాలో వడ్డీరేట్ల కోత సంకేతాలు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా బంగారం ధరలు మరింత ఎగబాకే అవకాశాలు ఉన్నాయి.

ఐటీ రిటర్నులు @ 7.28 కోట్లు

- గతేడాది కంటే 7.5% అధికం
- 72% కొత్త విధానంలోనే



న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2023–24) సంబంధించి 7.28 కోట్ల ఆదాయపన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలయ్యాయి. రిటర్నుల దాఖలుకు జూలై 31తో గడువు ముగియగా, ఇందుకు సంబంధించి వివరాలను ఆదాయపన్ను శాఖ విడుదల చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గతేడాది జూలై 31 నాటికి 6.77 కోట్ల రిటర్నులు నమోదు కాగా, వాటితో పోల్చితే 7.5% మేర ఎక్కువ మంది తమ ఐటీ రిటర్నులు సమర్పించారు. 5.27 కోట్ల మంది కొత్త విధానంలో రిటర్నులు సమర్పించారు. 2.01 కోట్ల మంది పాత విధానాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ ప్రకారం 72% మంది కొత్త విధానంలోకి మళ్లారు. నిర్ణీత రుసుం చెల్లించి ఈ ఏడాది డిసెంబర్ చివరి వరకు ఆలస్యపు రిటర్నులను దాఖలు చేసుకోవచ్చు.



మార్కెట్‌కు మాంద్యం భయం

అమెరికా మార్కెట్ల భారీ పతన ప్రభావం • ఒక శాతానికి పైగా నష్టపోయిన సూచీలు • 25 వేల స్థాయిని కోల్పోయిన నిఫ్టీ

ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం ఒకశాతం మేర నష్టపోయాయి. సెన్సెక్స్ 886 పాయింట్లు క్షీణించి 81 వేల దిగువన 80,981 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 293 పాయింట్లు పతనమై 25వేల స్థాయిని కోల్పోయి 24,718 వద్ద నిలిచింది. ఇటీవల వెల్లడైన దేశీయ కార్పొరేట్ క్యూ1 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడం, దలాల్ స్ట్రీట్ వరుస రికార్డు ర్యాలీతో అధిక వాల్యుయేషన్ల ఆందోళన పరిణామాలు ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణ వైపు పురిగొల్పాయి. ఒక దశలో సెన్సెక్స్ 999 పాయింట్లు క్షీణించి 80,869 వద్ద, నిఫ్టీ 324 పాయింట్లు కుప్పకూలి 24,686 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ, కమోడిటీ, టెక్, క్యాపిటల్ గూడ్స్ షేర్ల భారీ పతనంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.58% 1.19 శాతం నష్టపోయాయి.

సూచీల భారీ పతనంతో ఇన్వెస్టర్లకు ఒక్క రోజులో రూ.4.46 కోట్ల నష్టం వాటిల్లింది. బీఎస్ఈలోని మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.457 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల భారీ పతనం

అమెరికాలో జూలై తయారీ రంగ పీఎంఐ, ఉద్యోగ ఉద్యోగ కల్పన గణాంకాలు నిరాశపరచడంతో ఆర్థిక మాంద్య భయాలు తలెత్తాయి. అలాగే ఫెడరల్ రిజర్వ్ సెప్టెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలను బలహీనపరిచింది. అమెరికా దిగ్గజ టెక్ కంపెనీలైన టెస్లా, ఆల్ఫాబెట్, ఎన్‌విడీయా, మైక్రోసాఫ్ట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు అంచనాలకు అందుకోలేకపోవడం ఆగ్నికి ఆజ్యం పోశాయి. నాస్‌డాక్ 3% క్షీణించి 16,683 వద్ద ట్రేడవుతోంది. టెక్ కంపెనీల షేర్లకు ప్రాతినిధ్యం వహించే ఈ సూచీ జూలై 10న జీవితకాల గరిష్టం (18,671) నుంచి ఏకంగా 10%పైగా కుప్పకూలింది. డోజోన్స్ ఇండెక్స్ 2.5% నష్టపోయి 39,430 వద్ద కదలాడుతోంది. అమెరికా మార్కెట్ల నష్టాల ప్రభావంతో ఆసియా, యూరప్ మార్కెట్లూ డీలా పడ్డాయి. బ్యాంక్ ఆఫ్ ఆఫ్ జపాన్ వడ్డీరేట్ల పెంపు అంచనాలతో జపాన్ సూచీ నికాయ్ 6% క్షీణించింది. తైవాన్ ఇండెక్స్ 5%, కోప్సీ సూచీ 4%, హాంగ్‌కాంగ్ సూచీ 2% కుప్పకూలాయి. ఆర్థిక వ్యవస్థ మందగమన భయాలతో చైనా షాంఘై సూచీ ఒక శాతం నష్టపోయింది. ఇక మధ్య ప్రాచ్యంలో విస్తరిస్తున్న యుద్ధ భయాలతో యూరప్ మార్కెట్లూ 2.50% నుంచి రెండుశాతం పైగా నష్టపోయాయి.



శీతల్ దేవితో మియా బై తనిష్క్

ముంబై: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ మియా బై తనిష్క్ 'దేఖ్నా హై తో ఖేల్ దేఖో' పేరుతో ప్రకటన చిత్రాన్ని విడుదల చేసింది. ఇందులో ప్రపంచ నెంబర్‌వన్ మహిళా పారా అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత శీతల్ దేవి అసామాన్య నైపుణ్యాలు, ఆత్మస్థైర్యం, ఆటపట్ల అభిరుచిని కళ్లకు కట్టేలా చిత్రీకరించారు. శీతల్ దేవితో ఈ ప్రచార చిత్రాన్ని రూపొందించడాన్ని గర్వంగా భావిస్తున్న మియా బై తనిష్క్ బిజినెస్ హెడ్ శ్యామలా రామన్ తెలిపారు.

ఇన్ఫీ జీఎస్‌టీ నోటీస్ వెనక్కి!

- ఉపసంహరించుకున్న కర్ణాటక అధికారులు
- డీజీజీఐకి వివరణ ఇవ్వాల్సిందిగా సూచన



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు జారీ చేసిన జీఎస్‌టీ ఎగవేత నోటీసుపై అధికారులు వెనక్కి తగ్గారు. రూ.32,403 కోట్ల జీఎస్‌టీ ఎగవేత విషయంలో కంపెనీకి జారీ చేసిన ప్రీ-షోకాజ్ నోటీసులను కర్నాటక రాష్ట్ర జీఎస్‌టీ అధికారులు ఉపసంహరించుకున్నారు. అయితే, దీనిపై జీఎస్‌టీ, సెంట్రల్ ఎక్సైజ్ సుంకం, సర్వీస్ ట్యాక్స్ ఎగవేతలకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేసే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ)కి వివరణ ఇవ్వాలని కంపెనీకి సూచించారు. బీఎస్ఈకి వెల్లడించిన సమాచారంలో ఇన్ఫోసిస్ ఈ విషయాన్ని తెలిపింది. 2017 నుంచి ఐదేళ్లపాటు విదేశీ బ్రాంచ్‌ల నుంచి అందుకున్న సర్వీసులకు గాను రూ. 32,403 కోట్ల జీఎస్‌టీ చెల్లించాలంటూ పన్ను అధికారులు ఇన్ఫీకి డిమాండ్ నోటీసులు ఇవ్వడం తెలిసిందే. అయితే, ఇది కేవలం ప్రీ-షోకాజ్ నోటీసు మాత్రమేనని, అధికార యంత్రాంగం పేర్కొన్న వ్యయాలకు జీఎస్‌టీ వర్తించదని ఇన్ఫోసిస్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ ఉదంతంపై ఐటీ పరిశ్రమల సమాఖ్య నాస్కామ్ కూడా స్పందించింది. పన్ను అధికారులు ఐటీ పరిశ్రమ నిర్వహణ విధానాలను సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పేర్కొంది. కాగా, అంతర్జాతీయంగా భారీ వ్యాపార కార్యకలాపాలు గల కంపెనీలకు ఇలాంటి పన్ను నోటీసులను ఇచ్చే ముందు సరైన దర్యాప్తు, స్పష్టమైన రుజువులను సమర్పించాల్సి ఉంటుందని ఎస్‌కేఐ క్యాపిటల్ ఎండీ, సీఈఓ నరీందర్ వాధ్వా వ్యాఖ్యానించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
అమెరికా ఎకానమీకి భారత్ ఎంతెంతో దూరం
దివాలా అస్త్రం నుంచి బయటపడ్డ బైజూస్

సాక్షి స్పోర్ట్స్



సింగిల్స్ ఫైనల్లో అల్‌కరాజ్

స్పెయిన్ యువ టెన్నిస్ ప్లేయర్ కార్లోస్ అల్‌కరాజ్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన పిన్న వయస్కుడిగా ఘనతకెక్కాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ 6–1, 6–1తో ఫెలిక్స్ ఆగర్ (కెనడా)పై విజయం సాధించాడు. ఇప్పటికే నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన 21 ఏళ్ల అల్‌కరాజ్.. చిన్న వయసులో ఒలింపిక్ పతకం నెగ్గిన తొలి టెన్నిస్ ప్లేయర్‌గా నిలిచేందుకు అడుగుదూరంలో ఉన్నాడు. ఒక గంట 15 నిమిషాల్లో ముగిసిన సెమీస్‌లో పూర్తి ఆధిపత్యం కనబర్చిన అల్‌కరాజ్.. వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. రోలాండ్ గారోస్‌లో ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ పట్టిన అల్‌కరాజ్.. 14 విన్నర్లు సంధించడంతో పాటు.. 13 నెట్ పాయింట్స్ సాధించాడు. శనివారం జరగనున్న మహిళల సింగిల్స్ ఫైనల్లో జెంగ్ క్విన్‌వెన్ (చైనా)తో డోనా వెకిక్ (క్రొయేషియా) తలపడనుంది.

కేటీ... 13 పతకాలతో మేటి

- అమెరికా స్విమ్మర్ కేటీ లెడెకీ అరుదైన ఘనత
- అత్యధిక ఒలింపిక్ పతకాలు నెగ్గిన మహిళా స్విమ్మర్‌గా రికార్డు



పారిస్: అమెరికా మహిళా స్విమ్మర్ కేటీ లెడెకీ విశ్వక్రీడల్లో మరోసారి మెరిసింది. 4×200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కేటీ లెడెకీ, క్లెయిర్ వీస్‌స్టెన్, పెయిజ్ మాడెన్, ఎరిన్ గిమెల్‌లతో కూడిన అమెరికా బృందం రజత పతకం (7ని:40.86 సెకన్లు) సాధించింది. తాజా ఒలింపిక్స్‌లో ఇప్పటికే మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో స్వర్ణం, మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో కాంస్యం గెలిచిన లెడెకీకిది మూడో పతకం కాగా... 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆమె బరిలోకి దిగాల్సి ఉంది. తాజా పతకంతో లెడెకీ రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. ఒలింపిక్స్ చరిత్రలో అత్యధికంగా 13 పతకాలు గెలిచిన మహిళా స్విమ్మర్‌గా చరిత్ర లిఖించింది. 12 పతకాలతో జెన్నీ థాంప్సన్ (అమెరికా) పేరిట ఉన్న రికార్డును లెడెకీ సవరించింది. వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న లెడెకీ ఇప్పటి వరకు విశ్వక్రీడల్లో 8 స్వర్ణాలు, 4 రజతాలు, ఒక కాంస్యం సాధించింది. ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో అమెరికా మాజీ స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్ అత్యధికంగా 28 పతకాలు సాధించి ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. 13 పతకాలతో లెడెకీ మహిళల విభాగంలో అగ్రస్థానంలో, ఓవరాల్‌గా రెండో స్థానంలో ఉంది. 'విశ్వక్రీడల్లో ఒత్తిడి సహజమే. అయితే నా వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడమే లక్ష్యంగా పెట్టుకుంటా. ఆ క్రమంలో రికార్డులు నమోదైతే అది మరింత ఆనందం. స్వదేశంలో జరిగే 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లోనూ పాల్గొంటా' అని లెడెకీ పేర్కొంది.

తులికా తొలి రౌండ్‌లోనే...



పారిస్ ఒలింపిక్స్ బరిలోకి దిగిన భారత ఏకైక జూడో ప్లేయర్ తులికా మాన్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మహిళల ప్లస్ 78 కేజీల విభాగంలో తులికా 0–10తో ఓర్టిజ్ (క్యూబా) చేతిలో ఓడింది. ఇప్పటి వరకు నాలుగు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఓర్టిజ్ ముందు తులికా మాన్ నిలవలేకపోయింది. 28 సెకన్లలోనే భారత జూడోకాను చెక్‌హోల్డ్‌తో ఉక్కిరిబిక్కిరి చేసిన ఓర్టిజ్ విజయం సాధించింది. అయితే తదుపరి రౌండ్‌లో ఓర్టిజ్ పరాజయం పాలవడంతో... తులికా మాన్‌కు రెపిచాజ్ ద్వారా కాంస్య పతక పోరులో బరిలోకి దిగే అవకాశం కూడా లేకుండా పోయింది.

బల్‌రాజ్‌కు 23వ స్థానం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత రోవర్ బల్‌రాజ్ పన్వర్ 23వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల సింగిల్ స్కల్స్ ఈవెంట్ రౌండ్ 'డి' ఫైనల్లో శుక్రవారం బల్‌రాజ్ 7 నిమిషాల 2.37 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. అంతకుముందు రెపిచాజ్ రౌండ్‌లో రెండో స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరిన బల్‌రాజ్... అక్కడ ఐదో స్థానానికి పరిమితమవడంతో ఫైనల్‌కు దూరమయ్యాడు. ఫైనల్ 'ఎ'లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.



శ్రీలంక 230... భారత్ 230



'టై'గా ముగిసిన తొలి వన్డే

- రాణించిన రోహిత్, అక్షర్ పటేల్
- తిప్పేసిన అసలంక, హసరంగ
- రేపు రెండో వన్డే

కొలంబో: శ్రీలంక చేసిన స్కోరు 230/8. ఇదేమంత పెద్ద లక్ష్యమేం కాదు... సులువైందే కానీ కష్టం, అసాధ్యం కానేకాదు. కానీ పిచ్ స్పిన్‌కు దాసోహమైంది. ఇది ఆతిథ్య బౌలర్లకు కలిసొచ్చింది. టి20 సిరీస్‌లో తేలిపోయిన లంకేయులు... తొలి వన్డేలో మాత్రం పట్టు సడలించకుండా పోరాడారు. ఫలితం 'టై' అయినప్పటికీ రోహిత్, కోహ్లిలు ఉన్న పటిష్ట జట్టును శ్రీలంక సమష్టిగా నిలువరించింది. దీంతో భారత్ 11 బంతులున్నా లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. మొదట శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దునిత్ వెలలగే (65 బంతుల్లో 67 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), పతుమ్ నిసాంక (75 బంతుల్లో 56; 9 ఫోర్లు) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 47.5 ఓవర్లలో 230 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ (47 బంతుల్లో 58; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) ఒక్కడే అదరగొట్టాడు. అక్షర్ పటేల్ (57 బంతుల్లో 33; 2 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (43 బంతుల్లో 31; 2 ఫోర్లు) మెరుగ్గా ఆడారు.

ఆదుకున్న వెలలగే

ఆరంభంలోనే ఓపెనర్ అవిష్క ఫెర్నాండో (1)ను సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. తర్వాత మరో ఓపెనర్ నిసాంక, కుశాల్ మెండిస్ (14) కుదురుగా ఆడటంతో రెండో వికెట్‌కు 39 పరుగులు జతయ్యాయి. తర్వాత స్వల్ప వ్యవధిలో రెండు కీలక వికెట్లను కోల్పోయింది. కుశాల్, సమరవిక్రమ (8) వికెట్లను పారేసుకోవడంతో 60 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. తర్వాత కెప్టెన్ అసలంక (14), నిసాంక వికెట్లను కాపాడుకునేందుకు విఫల ప్రయత్నం చేశారు. 91 పరుగుల వద్ద అసలంక, 67 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాక నిసాంక కూడా అవుటవడంతో లంక జట్టు 101 పరుగుల వద్ద సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో లియనాగే (26 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్), దునిత్ వెలలగే వికెట్ల పతనానికి కాసేపు బ్రేక్ వేయడంతో ఆరో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం జతయ్యింది. మరింత బలపడకముందే ఈ జోడీని అక్షర్ విడగొట్టాడు. హసరంగ (24; 1 ఫోర్, 2 సిక్సర్లు), ధనంజయ (17)లతో కలిసి దునిత్ జట్టు స్కోరును 200 పైచిలుకు తీసుకెళ్లాడు.

రాణించిన రోహిత్

సులువైన లక్ష్యానికి సరైన శుభారంభాన్ని ఓపెనర్లు రోహిత్, శుబ్‌మన్ గిల్ (16) ఇచ్చారు. కెప్టెన్ రోహిత్ తొలి ఓవర్ నుంచే ఎదురుదాడికి దిగాడు. 5.3 ఓవర్లలోనే జట్టు స్కోరు 50 పరుగులు దాటింది. పదో ఓవర్ పూర్తయ్యేసరికి భారత్ 71/0 స్కోరు చేసింది. తర్వాత 11వ ఓవర్ నుంచి లంక బౌలర్ల ప్రతాపం మొదలైంది. పరుగుల రాక గగనమైంది. ఈ ఐదు ఓవర్లలో కేవలం 15 పరుగులే చేసిన భారత్ ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. తదనంతరం సుందర్ (5) అవుటయ్యాడు. 12 పరుగుల వ్యవధిలోనే ఈ మూడు వికెట్లు కూలడంతో భారత్ 87/3 స్కోరు చేసింది. ఈ దశలో కోహ్లి (24; 2 ఫోర్లు), అయ్యర్ (23; 4 ఫోర్లు) నింపాదిగా ఆడి జట్టు స్కోరును వంద దాటించారు. నాలుగో వికెట్‌కు 43 పరుగులు జోడించాక కోహ్లిని హసరంగా ఎల్బీగా పంపగా, కాసేపటికే, బుల్లెట్‌లాంటి బంతితో ఫెర్నాండో అయ్యర్‌ను బౌల్డ్ చేయడంతో 132/5 స్కోరు వద్ద భారత్ కష్టాల్లో పడింది. తర్వాత రాహుల్, అక్షర్ మెరుగ్గా ఆడినా, దూబే (25; 1 ఫోర్, 2 సిక్సర్లు) సిక్సర్లు, ఫోర్‌తో గెలుపు మెట్టుపై నిలబెట్టినా... కెప్టెన్ అసలంక వేసిన 48వ ఓవర్లో దూబే, అర్ష్‌దీప్ అవుటవడంతో మ్యాచ్ టైగా ముగిసింది.

2 భారత్, శ్రీలంక జట్ల మధ్య 'టై' అయిన మ్యాచ్‌లు. ఈ రెండు జట్ల మధ్య 2012లో హోబర్ట్ వేదికగా జరిగిన ముక్కోణపు టోర్నీ మ్యాచ్ తొలిసారి 'టై'గా ముగిసింది. ఇప్పటి వరకు ఈ రెండు జట్లు 169 వన్డేల్లో తలపడ్డాయి. 99 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గగా... 57 మ్యాచ్‌ల్లో లంక గెలిచింది. 11 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి.

సూపర్ ఓవర్ ఉండదా?

ఐసీసీ నిబంధనల ప్రకారం ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో సూపర్ ఓవర్‌కు అవకాశం లేదు. రెండు కంటే ఎక్కువ జట్లు అనగా, ఆసియా కప్, ముక్కోణపు సిరీస్, ఐసీసీ ఈవెంట్లలో మాత్రం ఫలితం కోసం 'సూపర్ ఓవర్'ను అనుమతిస్తారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (ఎల్బీడబ్ల్యూ) (బి) సుందర్ 56; అవిష్క (సి) అర్ష్‌దీప్ (బి) సిరాజ్ 1; కుశాల్ మెండిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దూబే 14; సమరవిక్రమ (సి) గిల్ (బి) అక్షర్ 8; అసలంక (సి) రోహిత్ (బి) కుల్దీప్ 14; జనిత్ (సి) రోహిత్ (బి) అక్షర్ 20; వెలలగే (నాటౌట్) 67; హసరంగ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 24; ధనంజయ (సి) సుందర్ (బి) అర్ష్‌దీప్ 17; షిరాజ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 230. వికెట్ల పతనం:** 1–7, 2–46, 3–60, 4–91, 5–101, 6–142, 7–178, 8–224. **బౌలింగ్:** సిరాజ్ 8–2–36–1, అర్ష్‌దీప్ 8–0–47–2, అక్షర్ 10–0–33–2, దూబే 4–0–19–1, కుల్దీప్ 10–0–33–1, సుందర్ 9–1–46–1, గిల్ 1–0–14–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 58; గిల్ (సి) కుశాల్ మెండిస్ (బి) వెలలగే 16; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) హసరంగ 24; సుందర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ధనంజయ 5; అయ్యర్ (బి) అసిత ఫెర్నాండో 23; రాహుల్ (సి) వెలలగే (బి) హసరంగ 31; అక్షర్ (సి) కుశాల్ మెండిస్ (బి) అసలంక 33; దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 25; కుల్దీప్ (బి) హసరంగ 2; సిరాజ్ (నాటౌట్) 5; అర్ష్‌దీప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 230. వికెట్ల పతనం:** 1–75, 2–80, 3–87, 4–130, 5–132, 6–189, 7–197, 8–211, 9–230, 10–230. **బౌలింగ్:** అసిత ఫెర్నాండో 6–1–34–1, షిరాజ్ 4–0–25–0, వెలలగే 9–1–39–2, ధనంజయ 10–0–40–1, హసరంగ 10–0–58–3, అసలంక 8.5–0–30–3.


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 133

శనివారం 3-8-2024


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మరో చరిత్రకు మను 'సై'

11లో

ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించేందుకు షూటర్ మనూ భాకర్ ఒక్క పతకం దూరంలో ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో మనూ ఇప్పటికే 2 కాంస్య పతకాలు నెగ్గింది. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఈవెంట్‌లోనూ మనూ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జరిగే ఫైనల్లో మనూ టాప్–3లో నిలిస్తే మూడో పతకం ఖాయం.



'బాండ్ల'పై విచారణ చేయించలేం

ఎలక్టోరల్ బాండ్ల పథకంపై సిట్‌తో విచారణ చేయించాలంటూ దర్యాప్తునకు ఆదేశించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



రావూస్ కేసు సీబీఐకి బదిలీ

ఢిల్లీలో రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో నీట మునిగి అభ్యర్థులు మృతి చెందిన కేసును ఢిల్లీ హైకోర్టు సీబీఐకి అప్పగించింది.

వివరాలు 6లో ▸



వారధిగా వ్యవహరించండి

కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య గవర్నర్లు వారధిగా పనిచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ గవర్నర్ల సదస్సులో అన్నారు.

వివరాలు 6లో ▸



అంతరిక్ష కేంద్రంలోకి భారతీయులు

నాసా సారథ్యంలో భారతీయ వ్యోమగాములు త్వరలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టబోతున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్


తొలి నెలల్లోనే వాణిజ్య కార్యకలాపాలు ధమాల్



వాణిజ్య కార్యకలాపాలకు కొలమానంగా నిలిచే జీఎస్టీ ఆదాయం కూటమి అధికారంలోకి వచ్చిన తొలినెలల్లోనే పాతాళం బాట పట్టింది. కొన్నేళ్లుగా జీఎస్టీ ఆదాయంలో మెరుగైన వృద్ధిరేటు సాధిస్తున్న ఏపీ జూలైలో నెగిటివ్ వృద్ధి రేటు నమోదు చేసింది.

వివరాలు 2లో ▸

ఏపీ హైకోర్టులో తొమ్మిది జడ్జీల పదవులు ఖాళీ



ఏపీ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులకు గాను ఇంకా 9 స్థానాలు భర్తీ కావాల్సి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తదితరుల ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

వివరాలు 2లో ▸

14 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్



ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఇప్పటికే ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) కౌన్సెలింగ్ తాత్కాలిక షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) విడుదల చేసింది.

వివరాలు 2లో ▸

ఉమ్మడి విశాఖ 'స్థానిక' ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స



ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఎంపిక చేశారు. క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతలతో జగన్ సమావేశమయ్యారు.

వివరాలు 2లో ▸



ఫోన్ పే కూడా ఉంది సార్ !



హిందూపురం నియోజకవర్గంలోని సంతేబిదనూర్ పెన్నాలో అక్రమంగా తవ్వుతున్న ఇసుక

తవ్వుకో తమ్ముడూ!

రాష్ట్రవ్యాప్తంగా ఇసుక రీచ్‌లు, యార్డులను చెరబట్టిన టీడీపీ నేతలు

- స్టాక్ యార్డులు దోచేశారు.. ఇప్పుడు రీచ్‌లపై పడ్డారు
- అధికారంలోకి వచ్చిన వెంటనే నిల్వ ఉన్న 40 లక్షల టన్నుల ఇసుకను తమ్ముళ్లు బొక్కేశారు
- ఇసుక పాలసీ రాలేదు.. అయినా రీచ్‌లు తవ్వేస్తున్నారు..
- తిరుపతి స్వర్ణముఖి నదిలో భారీ యంత్రాలతో తవ్వకాలు
- బాపట్ల జిల్లా పెసర్లంక, గాజుల్లంక రీచ్‌లలోనూ అదే తంతు
- నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి హైదరాబాద్ తరలుతున్న ఇసుక
- అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ పెద్ద ఎత్తున ఇసుక దందా
- అయినా కన్నెత్తి చూడని అధికారులు

9లో

ఇసుక ఉచితంగా ఇస్తే కార్మికులకు పని దొరుకుతుంది... ఆదాయం వస్తుంది... రాష్ట్ర సంపద పెరుగుతుంది... దానితో అభివృద్ధి చేస్తా... పూర్ టూ రిచ్ నా విజన్... అంటూ చంద్రబాబు ఊదరగొట్టారు. కానీ, అధికారంలోకి వచ్చాక తమ్ముళ్లను రిచ్‌గా మార్చడంపై ఆయన దృష్టిపెట్టారు. ఇసుకను వారికి వరంగా మార్చారు. ఇసుకపాలసీ తేకుండానే వచ్చీరాగానే స్టాక్ యార్డుల్లో 40 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు బొక్కేశారు. మిగిలిన 40 లక్షల టన్నులను ఇష్టమొచ్చిన రేటుకు అమ్ముకుంటున్నారు. ఇపుడు ఏకంగా రీచ్‌లపై పడ్డారు. జేసీబీలు పెట్టిమరీ పట్టపగలే అడ్డగోలుగా తవ్వకాలు సాగిస్తూ నచ్చిన ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తమ్ముళ్లు రిచ్ కావడానికిలా బాబుగారు ఇసుక రీచ్‌లను అప్పనంగా అప్పగించేశారు. రాష్ట్రంలోని పలు రీచ్‌లు, స్టాక్‌యార్డులను సాక్షి పరిశీలించింది.

టార్గెట్ జగన్..

కాంగ్రెస్ లక్ష్యం అదే.. జగన్‌ను దెబ్బ తీసేందుకు నన్ను వాడుకుంది: యూట్యూబ్ ఇంటర్వ్యూలో సబితా ఇంద్రారెడ్డి

- ఆయన్ను టార్గెట్ చేసేందుకు నామీద సీబీఐ కేసులు పెట్టారు
- హోంమంత్రి పదవి ఇచ్చి నాకేమీ ప్రయోజనం చేకూర్చలేదు
- జగన్‌పై అక్రమ కేసుల వెనుక లోగుట్టు మరోసారి బట్టబయలు
- కాంగ్రెస్ అధిష్టానం కుట్రలను గతంలోనే వెల్లడించిన ఆజాద్, మొయిలీ
- సోనియా ఆదేశాలతోనే నాడు పిటిషన్ దాఖలు చేశానన్న శంకర్‌రావు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గతంలో కక్షపూరితంగా అక్రమ కేసులు నమోదు చేసినట్లు మరోసారి స్పష్టమైంది. ఉమ్మడి రాష్ట్రంలో గనులు, హోం శాఖలను నిర్వహించిన నాటి కాంగ్రెస్ నేత, ప్రస్తుతం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న పి.సబితా ఇంద్రారెడ్డి తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాటి కుట్రలు స్పష్టంగా బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తనను ఉమ్మడి రాష్ట్రంలో హోంమంత్రిని చేసిందన్న వ్యాఖ్యలపై సబిత తీవ్రంగా ప్రతిస్పందించారు. హోంమంత్రి పదవి ఇచ్చి కాంగ్రెస్ పార్టీ తనకేమీ ప్రయోజనం చేకూర్చలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దెబ్బ తీసేందుకు ఆ పార్టీ తనను వాడుకుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని టార్గెట్ చేయడానికి తన మీద ఐదు సీబీఐ కేసులు పెట్టారని తెలిపారు. 'నేను రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో ఉన్నాను కాబట్టి నామీద కేసులు పెడితే జనం నమ్ముతారని భావించారు. నన్ను ముందు పెట్టి జగన్‌ను

మిగతా 7వ పేజీలో ▸

పరిశోధనలతో సమాజానికి మేలు

'సాక్షి'తో యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్

యువత పరిశోధనా రంగంలోకి రావాలి

- ఎంత ఎక్కువ మంది వస్తే దేశానికి అంత లబ్ధి
- ఉద్యోగం కోసం కాకుండా రీసెర్చ్‌పై ఆసక్తితో రావాలి
- పరిశోధనల్లో నాణ్యత పెరగాలంటే విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి సరిగ్గా ఉండాలి
- బోధనా సిబ్బంది విషయంలో ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి
- కాంట్రాక్టు సిబ్బంది నుంచి ఉత్తమ పరిశోధనలు ఆశించలేం!
- మేము ప్రభుత్వాలు, గవర్నర్లకు లేఖలు రాస్తూనే ఉన్నాం

12లో



పరిశోధనలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ స్పష్టం చేశారు. యువత పరిశోధన రంగంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెప్పారు. ఎంత ఎక్కువ మంది పరిశోధనా రంగంలోకి వస్తే అంత ఎక్కువ దేశానికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన జగదీశ్‌కుమార్ 'సాక్షి'తో మాట్లాడారు.



శ్రీవారి హుండీ ఆదాయం రూ.125 కోట్లు

జూలైలో 1.04 కోట్ల లడ్డూల విక్రయం
టీటీడీ ఈవో జే.శ్యామలరావు వెల్లడి

తిరుమల: జూలైలో శ్రీవారిని 22.13 లక్షల మంది దర్శించుకుని హుండీలో రూ.125.35 కోట్లు వేశారని టీటీడీ ఈవో జే.శ్యామలరావు చెప్పారు. అలాగే, జూలైలో 1.04 కోట్ల లడ్డూలను విక్రయించామని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. గతంలో వారానికి 1.05 లక్షలు ఇచ్చే


మిగతా 5వ పేజీలో ▸

8,352 చ.కి.మీ.లలో సీఆర్డీఏ పరిధి

ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు మరో ఐదేళ్లు కౌలు పొడిగింపు
సీఆర్డీఏ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) 8,352 చదరపు కిలో మీటర్ల పరిధిలోనే ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. 2015లో ఇచ్చిన జీవో 207 ప్రకారం.. అప్పట్లో గుర్తించిన విస్తీర్ణం మేరకు సీఆర్డీఏ పరిధిని కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ 36వ సమావేశాన్ని నిర్వహించారు. ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు ఇచ్చే కౌలును మరో ఐదేళ్లు పొడిగించాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, నాలుగు లైన్లుగా కరకట్ట రోడ్డు విస్తరణపై వేగంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో 130 సంస్థలకు కేటాయించిన భూములు, వాటి ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. సంపద సృష్టి కేంద్రంగా

మిగతా 8వ పేజీలో ▸



సమగ్ర అధ్యయనం తర్వాతే కొత్త మద్యం విధానం

ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు

8లో

అధికారికి బెదిరింపులు..



మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనాతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

ఐఏఎస్సా.. అయితే..?

7లో

- ఏం తమాషానా.. మా దుకాణాలనే తనిఖీ చేస్తారా?
- అధికారంలో ఉన్నాం.. మాజోలికొస్తే ఊరుకోం.. వెంటనే వెళ్లిపోండి..
- రేషన్ షాపుల తనిఖీకి వెళ్లిన సబ్ కలెక్టర్‌కు తెలుగుదేశం నేతల హెచ్చరిక
- పోలీసుల్ని కూడా అసభ్య పదజాలంతో దూషించిన నాయకులు

అసిస్టెంట్ల తొలగింపులు..



తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అక్రమంగా తొలగిస్తున్నారు

- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన.. 2 నెలల్లో 2,360 మంది తొలగింపు
- రాజకీయ బెదిరింపులతో నలుగురి ఆత్మహత్య
- పంచాయతీరాజ్ కమిషనరేట్ ముందు ధర్నా
- తొలగించిన వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

5లో

న్యాయం కోసం విజ్ఞాపనలు..



కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి పాడేరు ఐటీడీఏ వద్దకు వచ్చిన గ్రామ వలంటీర్లు


గ్రామ వలంటీర్లను కొనసాగించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామ వలంటీర్లను కొనసాగించి, నెలకు రూ.10 వేలు వేతనం అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వలంటీర్ల సంఘం అధ్యక్షుడు కొమ్మ రాంబాబు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు జిల్లాలో చాలామంది వలంటీర్లు రాజీనామా చేశారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. వలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమ్ము సురేష్‌బాబు, రాజీనామా చేసిన వలంటీర్లు పాల్గొన్నారు.

- సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

14 నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్





గతేడాది అఖిల భారత కోటాలో ఎంబీబీఎస్ కటాఫ్‌లు ఇలా..

విద్యా సంస్థ	జనరల్	ఈడబ్ల్యూఎస్	ఓబీసీ	ఎస్సీ	ఎస్టీ
ఎయిమ్స్ ఢిల్లీ	56	258	255	989	1,624
ఎయిమ్స్ మంగళగిరి	1,606	3,033	3,506	21,762	42,236

తొలుత ఆల్ ఇండియా కోటా
- తర్వాత రాష్ట్ర కౌన్సెలింగ్ ప్రారంభం
- రాష్ట్రంలో 6,209 ఎంబీబీఎస్ సీట్లు
- గతేడాది ఎయిమ్స్ ఢిల్లీలో జనరల్ కేటగిరీలో 56వ ర్యాంకు వరకు సీట్లు
- ఎయిమ్స్ – మంగళగిరిలో 1,606 ర్యాంకుతో క్లోజ్

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఇప్పటికే ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) కౌన్సెలింగ్ తాత్కాలిక షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) విడుదల చేసింది. మరోవైపు రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్ నిర్వహణకు డాక్టర్‌వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో నీట్ యూజీ–2024లో అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అవసరమైన ధ్రువపత్రాలతో సన్నద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

తొలుత అఖిల భారత కోటా..

నీట్ యూజీ కౌన్సెలింగ్‌లో భాగంగా తొలుత అఖిల భారత కోటా (ఏఐక్యూ) కింద ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని 15 శాతం, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఎయిమ్స్, జిప్‌మెర్ వంటి జాతీయ సంస్థల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ ఉంటుంది. కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్‌కు చెందిన ఎంసీసీ ఏఐక్యూ కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది. ఇందులో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్ర విద్యార్థులయినా ఏఐక్యూలో సీట్లు పొందొచ్చు.

రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ఇలా..

తొలి విడత అఖిల భారత కోటా కౌన్సెలింగ్ ముగిశాక రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది. రాష్ట్రంలో 16 ప్రభుత్వ, 16 ప్రైవేట్, రెండు మైనారిటీ వైద్య కళాశాలలతోపాటు శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఉంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 శాతం ఏఐక్యూలో, మిగిలిన 85 శాతం సీట్లను రాష్ట్ర స్థాయిలో భర్తీ చేస్తారు. రాష్ట్రంలో అన్ని రకాల కళాశాలల్లో 6,209 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ, పద్మావతి వైద్య కళాశాలల్లోని 460 ఎంబీబీఎస్ సీట్లను ఏఐక్యూలో భర్తీ చేస్తారు. కన్వీనర్, బీ, సీ కేటగిరీలకు వేర్వేరుగా కౌన్సెలింగ్ చేపడతారు. రాష్ట్ర కోటాకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నీట్ ఆల్ ఇండియా ర్యాంకు ఆధారంగా మెరిట్ జాబితా విడుదల చేస్తారు. ఆ మెరిట్ జాబితా ఆధారంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేపడతారు.

అంతా ఆన్‌లైన్‌లోనే

ఇక ఏఐక్యూ, రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్ అంతా కూడా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తారు. కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవడం, రాష్ట్ర స్థాయి ర్యాంక్‌ల కేటాయింపు, కావాల్సిన కళాశాలల ఆప్షన్‌ల నమోదు, సీట్లు కేటాయింపు ఇలా కౌన్సెలింగ్ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. కౌన్సెలింగ్‌కు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్ http:// drysruhs.edu.in/ index.html లో ప్రకటిస్తుంది.

నీట్ యూజీ కౌన్సెలింగ్‌కు కావాల్సిన ధ్రువపత్రాలు
- నీట్ యూజీ- 2024 ర్యాంక్ కార్డ్
- పుట్టిన తేదీ ధ్రువీకరణ (పదో తరగతి మార్కుల మెమో)
- 6 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు
- ఇంటర్మీడియెట్ స్టడీ, ఉత్తీర్ణత సర్టిఫికెట్లు
- ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (ఇంటర్/10+2)
- కుల ధ్రువీకరణ
- ఆధార్ కార్డు
- దివ్యాంగ ధ్రువీకరణ పత్రం
- విద్యార్థి తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు

అర్హులు 43,788 మంది

నీట్ అర్హత సాధించిన రాష్ట్ర విద్యార్థుల జాబితా విడుదల

డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్) నుంచి అందిన నీట్ యూజీ–2024 అర్హత సాధించిన విద్యార్థుల వివరాలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. 43,788 మంది విద్యార్థులు అర్హత సాధించినట్టు పేర్కొంది. 715 స్కోర్ సాధించి జాతీయ స్థాయిలో 44వ ర్యాంక్‌తో కె.సందీప్ చౌదరి తొలి స్థానంలో నిలవగా.. అదే స్కోర్‌తో గట్టు భానుతేజ సాయి(50), పి.పవన్‌కుమార్ రెడ్డి (81), వి.ముఖేష్ చౌదరి(150) తర్వాతి స్థానాల్లో నిలిచారు. మొత్తంగా రాష్ట్రం నుంచి 61 మంది 700, ఆపైన స్కోర్ సాధించారు. 2,349 మంది 600, ఆపైన స్కోర్ చేశారు. ఈ జాబితాను మెరిట్ లిస్ట్‌గా పరిగణించవద్దని తల్లిదండ్రులు, విద్యార్థులకు విశ్వవిద్యాలయం స్పష్టం చేసింది.

గతేడాది రాష్ట్రంలో కన్వీనర్ కోటాలో కేటగిరీలు, ర్యాంకులవారీగా ఎంబీబీఎస్ సీట్లు

కేటగిరీ	నీట్ ర్యాంక్	స్కోర్
బీసీ-ఎ	1,52,602	459
బీసీ-బి	1,12,158	496
బీసీ-సి	1,66,925	447
బీసీ-డి	1,11,696	497
బీసీ-ఈ	1,53,509	458
ఈడబ్ల్యూఎస్	77,920	533
ఓసీ	69,941	543
ఎస్సీ	1,61,655	451
ఎస్టీ	2,11,061	413

మైనార్టీ కళాశాలలు	చివరి ర్యాంక్	స్కోర్
ఫాతిమా వైద్య కళాశాల, కడప	1,36,896	473
నిమ్రా, విజయవాడ	1,84,353	433

అధైర్య పడొద్దు.. నేనున్నా..





వైఎస్ జగన్‌తో సెల్ఫీలు దిగుతున్న అభిమానులు

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు, నేతలను కలుసుకున్నారు. అందరినీ పలకరించి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. నేనున్నానంటూ భరోసానిచ్చారు. పలువురు అభిమానుల కోరిక మేరకు వారితో సెల్ఫీలు దిగారు.

పింగళి సేవలను స్మరించుకుందాం

వైఎస్ జగన్ ఘన నివాళులు

సాక్షి,అమరావతి: భారత త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఘనంగా నివాళులర్పించారు. 'భారతీయులందరూ గర్వంగా తలెత్తుకుని సెల్యూట్ చేస్తున్న త్రివర్ణ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు మన తెలుగువాడు పింగళి వెంకయ్య. శుక్రవారం ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను' అంటూ ఆయన 'ఎక్స్' లో పోస్ట్ చేశారు.

ఉమ్మడి విశాఖ 'స్థానిక' ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స

- పార్టీ నేతలతో చర్చించి ఖరారు చేసిన వైఎస్ జగన్
- కలసికట్టుగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం



తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఎంపిక చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసిన నాయకులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో అభ్యర్థిత్వంపై వారితో చర్చించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి బొత్సను అభ్యర్థిగా ఖరారు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి భారీ మెజార్టీ ఉన్న నేపథ్యంలో సాధారణంగా టీడీపీ తన అభ్యర్థిని పోటీ పెట్టకూడదని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అయితే చంద్రబాబు ఏరోజూ నైతిక విలువలు పాటించే వ్యక్తి కాదన్నారు. రకరకాల ప్రలోభాలు, బెదిరింపులతో అడ్డదారిలో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కుయుక్తులు, కుట్రలు చంద్రబాబు నైజమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతున్నందున పార్టీలో అందరు నాయకుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం నాయకులతో విడిగా చర్చించి ఒక్కొక్కరి నుంచి అభిప్రాయాలను వైఎస్ జగన్ తెలుసుకున్నారు. అందరి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. అధికార పార్టీ బెదిరింపులను ధీటుగా ఎదుర్కొనేలా అందరూ కలిసి ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.

విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పోటీ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఉత్తరాంధ్ర ప్రాంత నేతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం బొత్సను ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిర్ణయించినట్లు చెప్పారు. అధికార టీడీపీ ప్రలోభాలకు తెర తీసిందని, గతంలో కూడా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి బీసీ ఎమ్మెల్సీ ఓటమికి కారణమైందని పేర్కొన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని బొత్స విజయం సాధించేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

తొలి నెలల్లోనే వాణిజ్య కార్యకలాపాలు ఢమాల్

జూలైలో ఏడుశాతం తగ్గిన జీఎస్టీ ఆదాయం
- గతేడాది జూలైలో జీఎస్టీ ఆదాయం రూ.3,593 కోట్లు
- ఈ ఏడాది రూ.3,346 కోట్లే
- ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జీఎస్టీ ఆదాయంలో 9 శాతం వృద్ధి
- గత కొన్ని నెలలుగా రాష్ట్ర జీఎస్టీ ఆదాయంలో రెండంకెల వృద్ధి



2024లో రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు

నెల	జీఎస్టీ ఆదాయం (రూ.కోట్లలో)	వృద్ధిరేటు (శాతం)
మార్చి	4,082	16
ఏప్రిల్	4,850	12
మే	3,890	15
జూన్	అధికారికంగా డేటా విడుదల చేయలేదు	
జూలై	3,346	-7

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: ప్రజల కొనుగోలు శక్తి, రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలకు కొలమానంగా నిలిచే జీఎస్టీ ఆదాయం తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తొలినెలల్లోనే పాతాళం బాట పట్టింది. కొన్నేళ్లుగా జీఎస్టీ ఆదాయంలో పొరుగు రాష్ట్రాల కంటే మెరుగైన వృద్ధిరేటును సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్ జూలై నెలలో నెగిటివ్ వృద్ధిరేటును నమోదు చేసింది. గతేడాది జూలై నెల జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే దేశంలోని అన్ని పెద్ద రాష్ట్రాల్లో పెరుగుదల నమోదుకాగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తగ్గుదల నమోదైంది. తాజాగా కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం జూలై నెలలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.3,346 కోట్లు. గతేడాది ఇదే నెలలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం రూ.3,593 కోట్లు. గత ఏడాది జూలైతో పోలిస్తే ఈ ఏడాది జూలైలో జీఎస్టీ ఆదాయం ఏడుశాతం క్షీణించింది. రూ.247 కోట్ల ఆదాయం తగ్గింది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జీఎస్టీ ఆదాయం తొమ్మిది శాతం వృద్ధితో రూ.1.34 లక్షల కోట్ల (దిగుమతి వస్తువులు లేకుండా)కు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌జీఎస్టీలోను కోత నమోదైంది. గతేడాది జూలైతో పోలిస్తే ఈ జూలైలో ప్రీ సెటిల్‌మెంట్ ఎస్‌జీఎస్టీ వసూళ్లు 10 శాతం, పోస్ట్ సెటిల్‌మెంట్ వసూళ్లు ఐదుశాతం తగ్గాయి. అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి రెండు నెలలుగా ఆర్థికవ్యవస్థను పరుగులు పెట్టించేలా ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోకుండా కేవలం పెన్షన్లు పెంచడం తప్ప పరిపాలనను గాలికొదిలేయడంతో రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు ఆగిపోయాయని, ఈ ప్రభావం జీఎస్టీ ఆదాయంపై పడిందని అధికారులు వెల్లడించారు. ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టి ఇసుకను అందుబాటులో ఉంచకపోవడంతో భవననిర్మాణ కార్యకలాపాలు ఆగిపోవడం జీఎస్టీ ఆదాయం తగ్గడానికి ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. భవననిర్మాణ పనులు జరిగితే సిమెంట్, ఇనుము, రంగులు, ఎలక్ట్రికల్, కలప.. ఇలా అనేక వస్తువుల కొనుగోళ్లు జరుగుతాయి. కానీ ఇసుక కొరత కారణంగా వ్యాపారాలు జరగడంలేదని పలువురు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతినెలా అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజల చేతుల్లోకి నగదు రావడంతో కొనుగోళ్లు సాగి వ్యాపారాలు కళకళలాడేవి. ఇప్పుడు ఆషాఢమాసం అని ఆఫర్లు పెట్టినా.. కొనుగోళ్లు లేవని రిటైల్ దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

గత ఏడాది రికార్డు

గతేడాది రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ 10 శాతానికి పైగా వృద్ధిరేటు నమోదు చేసింది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఆ శాఖ ఆదాయం రూ.50 వేలకోట్ల మార్కు దాటింది. 2023–24లో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఆదాయం రూ.50,422.60 కోట్లకు చేరితే అందులో నికర జీఎస్టీ ఆదాయం 14 శాతం వృద్ధితో రూ.32,029.62 కోట్లు (ఐజీఎస్టీ చెల్లింపులు పోగా). గత ప్రభుత్వం వాణిజ్యపన్నుల శాఖలో రిటర్నులు దగ్గర నుంచి పన్ను చెల్లింపుల వరకు అధికారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా పూర్తిగా ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తేవడంతో పాటు సంస్కరణలు ప్రవేశపెట్టింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అధికారుల ప్రమేయం లేకుండా వాహనాల తనిఖీకి ఆటోమేటెడ్ చెక్ ఆఫ్ వెహికల్ ట్రాఫిక్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. స్క్రూటీన్లో అధికారుల ప్రమేయం లేకుండా ర్యాండమ్ విధానంలో ఎంపిక చేసేలా రిటర్న్ స్క్రూటీన్ ఆటోమేటెడ్ టూల్ వంటి ఎన్నో వ్యాపార అనుకూల చర్యలను చేపట్టడంతో ఆదాయంలో గణనీయమైన వృద్ధి నమోదయింది.

ప్రభుత్వాసుపత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్‌కు టెండర్లు

కసరత్తు ప్రారంభించిన వైద్యశాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వాసుపత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్ పనుల కోసం టెండర్లు పిలవడానికి వైద్యశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీల కాంట్రాక్ట్ పరిమితి ఈ ఏడాది మే తో ముగిసింది. ఈ క్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ లక్ష్మి శా సెకెండరీ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా టెండర్లు పిలవడానికి అవసరమైన ప్రతిపాదనలపై చర్చించినట్లు సమాచారం. మే నెలతో గడువు ముగియడంతో ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలను మరో మూడు నెలలు పొడిగించారు. అది కూడా ఈ నెలతో ముగుస్తున్న నేపథ్యంలో ఏజెన్సీలను ఎంపిక చేసేవరకూ మరోమారు సేవలు పొడిగించే అవకాశం ఉందని తెలిసింది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పెండింగ్ బకాయిలను విడుదల చేయడంతో పాటు, పథకం అమలులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్(ఆశా) ప్రతినిధులు సీఈవో లక్ష్మీశాను కోరారు. పెండింగ్ బకాయిలను చెల్లించకపోతే ఈ నెల 15 నుంచి సేవలు నిలిపివేస్తామని ఇటీవల ఆశా ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం వీరితో సీఈవో సమావేశం నిర్వహించారు.

ఎర్రమట్టి దిబ్బ తవ్వకాలపై అధికారుల్లో కదలిక

- 'సాక్షి' కథనాలతో ఉలిక్కిపడ్డ సర్కార్
- భీమిలి బిల్డింగ్ హౌస్ సొసైటీ అక్రమ తవ్వకాలపై షోకాజ్ నోటీసులు జారీ



ఎర్రమట్టి దిబ్బల్లో అక్రమ తవ్వకాలు(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా పర్యావరణ విధ్వంసాన్ని సృష్టిస్తున్న వైనంపై గనుల శాఖలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఎర్రమట్టి దిబ్బల్లో ఈనెల రెండో వారంలో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలను వెలుగులోకి తెస్తూ 'సాక్షి'లో జూలై 17న 'మట్టి దిబ్బలు మటాష్!' శీర్షికతో ప్రచురితమైన కథనంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. హుటాహుటిన జిల్లా యంత్రాంగాన్ని పంపి, మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేసింది. తెర వెనుక సూత్రధారులను వదిలేసి, నిడిగట్టు సచివాలయం ఇన్‌చార్జ్ ప్లానింగ్ సెక్రటరీని సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకోవాలని చూసింది. దీనిపై మరోసారి జూలై 18న 'చిరుద్యోగిని సస్పెండ్ చేసి.. అక్రమాలపై 'మట్టి' కప్పి..' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో ఇక గనుల శాఖ ఊపిరి పీల్చుకోలేకపోయింది. ఎట్టకేలకు రంగంలోకి దిగింది. ఎర్రమట్టి దిబ్బలను తవ్విన ప్రదేశం తీరప్రాంత క్రమబద్ధీకరణ మండలి సీఆర్‌జెడ్ జోన్–1 సునిశితమైన పరిధిలోకి వస్తుందని గనుల శాఖ ప్రాథమికంగా అంచనావేస్తూ.. దర్యాప్తు ప్రారంభించింది. ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా నేరెళ్ల వలస గ్రామం సర్వే నం.:118/5ఏ (పాత సర్వే నెం :49/1)లో ది భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ బిల్డింగు సొసైటీ (బిల్డింగ్ హౌస్ సొసైటీ)లోని 278.95 ఎకరాల్లో అక్రమంగా తవ్వకాలు నిర్వహించినట్లు గనుల శాఖ అధికారులు నిర్ధారించారు. అక్రమ లేఔట్ పనుల్లో భాగంగా రోడ్ల నిర్మాణం కోసం ఎర్రమట్టి దిబ్బల్లో 39,454 క్యూబిక్ మీటర్ల కంకరతో కూడిన ఎర్రమట్టి ఉపయోగించారని మైనింగ్ అధికారులు తేల్చారు. ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్–1966ను ఉల్లంఘించారని నిర్ధారించిన అధికారులు సొసైటీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ అక్రమ తవ్వకాల వ్యవహారంపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేదంటే చట్టపరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ నోటీసుల్లో స్పష్టం చేశారు. ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 148 అడుగుల బఫర్ జోన్ ఏర్పాటు చేసింది. దీనిపై అప్పట్లో ప్రతిపక్ష నేతలు హడావుడి చేశారు.

పింగళి స్ఫూర్తిని భారత జాతి మరువదు

మంత్రి కొలుసు పార్థసారధి



సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో దేశానికి ఒక జెండా ఉండాలని భావించి జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య స్ఫూర్తిని భారత జాతి ఎప్పటికీ మరువదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

పోరాటయోధుడు పింగళి: మంత్రి సవిత



భారతీయుల స్వేచ్ఛా వాయువుల కోసం చివరి వరకూ పోరాడిన జాతీయ పతాక సృష్టికర్త పింగళి వెంకయ్య రాష్ట్రానికి చెందిన మచిలీపట్నం వాస్తవ్యులు కావడం మనకెంతో గర్వకారణమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని మంత్రి కార్యాలయం నుంచి శుక్రవారంఒక ప్రకటన విడుదల చేశారు. పింగళి వెంకయ్య నేను సైతమంటూ 19 ఏళ్ల నుంచే దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగమై గాంధీతో కలిసి ఎన్నో పోరాటాల్లో పాల్గొన్న యోధుడని పేర్కొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' ఉద్యమానికి మద్దతివ్వండి: ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయనకు ప్రధాని మోదీ నివాళులర్పించారు. జాతికి త్రివర్ణ పతాకాన్ని అందించడంలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆగస్ట్ 9 నుంచి 15వ తేదీ వరకు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి https://harghartiranga.com/ లో తమ సెల్ఫీలను పంచుకుని హర్ ఘర్ తిరంగా ఉద్యమానికి మద్దతివ్వాలని ప్రజలను కోరుతూ ఆయన శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

క్లుప్తంగా...

రానున్న వంద రోజుల కార్యాచరణపై దృష్టి : సీఎస్



సాక్షి, అమరావతి: ఈనెల 5, 6 తేదీల్లో రాష్ట్ర సచివాలయంలో జరుగనున్న కలెక్టర్ల సమావేశానికి సంబంధించిన అంశాలపై ఆయా శాఖల కార్యదర్శులతో శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై శాఖల వారీగా సమీక్షించారు. రానున్న 100 రోజుల కార్యాచరణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు కలెక్టర్లకు దిశానిర్దేశం చేసేలా ప్రజెంటేషన్ ఉండాలన్నారు.

ఏపీ హైకోర్టులో 9 న్యాయమూర్తుల పదవులు ఖాళీ

కేంద్ర మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులకు గాను ఇంకా 9 స్థానాలు భర్తీ కావాల్సి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశంలోని 25 హైకోర్టుల్లో 1,114 మంది న్యాయమూర్తులకు గాను 755 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారని ఇంకా 359 న్యాయమూర్తుల స్థానాలు భర్తీ కావాల్సి ఉందని చెప్పారు. ఏపీలోని జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 74 జ్యుడిషియల్ అధికారుల స్థానాలు ఖాళీగా ఉన్నాయని కేంద్రమంత్రి వెల్లడించారు. వీటితో పాటు గత ఐదేళ్లలో ఏపీ హైకోర్టులో 31 మంది న్యాయమూర్తులను భర్తీ చేశామని తెలిపారు.

ఏపీలో 1,05, 805 మంది డాక్టర్లు నమోదు

ఏపీలో 1,05,805 మంది డాక్టర్లు నమోదుఈ ఏడాది జూలైకి ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో 1,05,805 మంది అల్లోపతి డాక్టర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని 731 మెడికల్ కాలేజీల్లో 1,12,112 ఎంబీబీఎస్ సీట్లు, 72,627 పీజీ సీట్లు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ శుక్రవారం లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఖలీలుర్ రెహమాన్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆర్థిక శాఖలో అధికారులకు బాధ్యతలు కేటాయింపు

ప్రిన్సిపల్ ఆర్థిక కార్యదర్శిగా పియూష్ కుమార్



సాక్షి, అమరావతి: ఆర్థిక శాఖలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులకు బాధ్యతలను, సబ్జెక్టులను కేటాయిస్తూ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ప్రిన్సిపల్ ఆర్థిక కార్యదర్శిగా పియూష్ కుమార్ బాధ్యతలు నిర్వహిస్తారు. అంటే మొత్తం ఆ ర్థిక వ్యవహారాలకు అధిపతిగా పియూష్ కుమార్ ఉంటారు. ఆర్థిక కార్యకలాపాలు సమన్వయం, పర్యవేక్షణ బాధ్యతలు కూడా ఆయనకే ఇచ్చారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల కారణంగా రాష్ట్ర ఆర్థిక రంగంపై ప్రభావం, నిబంధనల సడలింపు, మంత్రివర్గ సమావేశాలు, శాసన వ్యవహారాలు, వ్యయ నిర్వహణ, అప్పులు, వేస్ అండ్ మీన్స్ వ్యవహారాలను పియూష్ కుమార్ పర్యవేక్షిస్తారు. ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవహారాల బాధ్యతలనూ ఆయనకే అప్పగించారు. రెవెన్యూ, జలవనరులు, ప్రణాళిక, ఆర్థిక, ఐటీ, ప్రభుత్వ రంగం, సాధారణ పరిపాలన వ్యయాలను పియూష్ కుమార్ నిర్వహిస్తారు. ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం.జానకికి సొంత పన్నులు, కేంద్ర పన్నుల వాటా నుంచి బదిలీ, రాష్ట్ర విభజన అంశాల బాధ్యతలను అప్పగించారు. వీటితో పాటు పర్యాటక, హోం, న్యాయ, మహిళా శిశు సంక్షేమం, గృహ నిర్మాణం, సంక్షేమం, వైద్య ఆరోగ్య విద్య, గ్రామ, వార్డు సచివాలయాలు, వ్యవసాయం , ఉప ప్రణాళికల వ్యయం నిర్వహణ తదితర బాధ్యతలు అప్పగించారు. అదనపు కార్యదర్శి జె.నివాస్‌కు బడ్జెట్ నిర్వహణ, నగదు, రుణ నిర్వహణ, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ, డీబీటీ తదితర బాధ్యతలు అప్పగించారు.

గ్రేడ్-5 కార్యదర్శులకు పొజిషన్ ఐడీల కేటాయింపు

సాక్షి, అమరావతి: గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-5 కార్యదర్శుల్లో కొత్తగా గ్రామ పంచాయతీ డీడీవో బాధ్యతలు అప్పగించిన వారందరికీ పొజిషన్ ఐడీలు కేటాయించారు. వివరాలను సంబంధిత ఎంపీడీవో లాగిన్‌లో నమోదు ప్రక్రియ పూర్తికి చర్యలు చేపట్టాలని సూచిస్తూ పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం శుక్రవారం అన్ని జిల్లాల డీపీవోలకు ఆదేశాలిచ్చింది. ఆయా వివరాలను ట్రెజరీ కార్యాలయాల డేటాతో అనుసంధానం జరిగేలా 6వ తేదీ నుంచి 9 వరకు జిల్లాల డీపీవోలు ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ విభాగపు డైరెక్టర్ కార్యాలయంలోనూ అందజేయాలని ఆదేశాల్లో పేర్కొంది.



కార్యకారణ స్వరూపుడైన ఆ పరబ్రహ్మ తత్వాన్ని తెలుసుకొనడంతోనే ఈ జీవాత్మ హృదయంలోని చిక్కుముడులు వీడిపోతాయి. సంశయాలన్నీ తొలగిపోతాయి.

– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 3 ఆగస్టు 2024

పారదర్శకతే సరైన మార్గం

యాదృచ్ఛికమే కావొచ్చుగానీ... జాతీయ స్థాయి పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు వరసపెట్టి లీక్ అవుతున్న తరుణంలోనే ట్రెయినీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ ఎంపిక వ్యవహారం బద్దలై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిగా పనిచేసి నాలుగేళ్ల క్రితం రిటైరైన ప్రీతి సుదాన్‌కు సంస్థ సారథ్యం అప్పగించారు. ఆమె యూపీఎస్సీని చక్కదిద్దుతారన్న నమ్మకం అందరిలోవుంది.సాధారణంగా ప్రశ్నపత్రాల లీక్ ఉదంతాలు చోటుచేసుకున్నప్పుడల్లా యూపీఎస్సీని అందరూ ఉదాహరణగా చూపేవారు. దాన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికేవారు. అలాగని యూపీఎస్సీపై అడపా దడపా ఆరోపణలు లేకపోలేదు. ముఖ్యంగా అంగవైకల్యం ఉన్నట్టు చూపటం, తప్పుడు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దాఖలుచేయటం వంటి మార్గాల్లో అనర్హులు సివిల్ సర్వీసులకు ఎంపికవుతున్నారన్న ఆరోపణలు అధికం. ఫలితాల ప్రకటనలో ఎడతెగని జాప్యం సరేసరి. అయితే వీటికి సంతృప్తికరమైన సంజాయిషీలు రాలేదు. పరీక్ష నిర్వహణ మాటెలావున్నా ధ్రువీకరణ పత్రాల తనిఖీకి ఆ సంస్థ పకడ్బందీ విధానాలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏదో క్రమంలో పొరపాట్లు చోటుచేసుకునే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. వెనువెంటనే ఆరా తీసి సరిదిద్దుకుంటే అవి పునరావృతమయ్యే అవకాశాలు ఉండవు. విమర్శలు, ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ తక్షణం స్పందించే లక్షణం ఉండాలంటే జవాబుదారీతనం, పారదర్శకత తప్పనిసరి. అవి లోపించాయన్నదే యూపీఎస్సీపై ప్రధాన ఫిర్యాదు. ఒకపక్క అభ్యర్థులకు నైతిక విలువల గురించి ప్రశ్నపత్రం ఇస్తూ అలాంటి విలువలు సంస్థలో కిందినుంచి పైవరకూ ఉండటంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని గుర్తించకపోతే అంతిమంగా నష్టం కలిగేది సంస్థకే. పూజ గురించిన వివాదాలు సామాజిక మాధ్యమాల్లో బయటికొచ్చాక ఇప్పటికే సర్వీసులో చేరిన కొందరిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. కాళ్లకు సంబంధించి అంగ వైకల్యం ఉన్నట్టు చూపి ఉద్యోగం పొందారంటూ ఒక అధికారి వీడియో బయటికొచ్చింది. అందులో ఆయన నిక్షేపంగా ఉండటమేగాక సైక్లింగ్, రన్నింగ్ చేస్తున్నట్టు కనబడుతోంది. ఆయన నిజంగానే అలాంటి తప్పుడు పత్రంతో చేరారా లేక ఆ అధికారిపై బురద జల్లారా అనేది తెలియదు. తక్షణం స్పందించే విధానం రూపొందించుకుంటే తప్పుడు ఆరోపణలు చేసినవారిపై చర్య తీసుకునే వీలుంటుంది. లేదా సంబంధిత అధికారినుంచి సంజాయిషీ కోరే అవకాశం ఉంటుంది. రెండూ లేకపోతే ఎవరికి తోచినవిధంగా వారు అనుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

యూపీఎస్సీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మనోజ్ సోనీ రాజీనామా ఉదంతంలో కూడా సక్రమంగా వ్యవహరించలేదు. నిరుడు మే 16న చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సోనీ అయిదేళ్ల కాల వ్యవధికి చాలా చాలా ముందే ఎందుకు తప్పుకున్నారు? చూసేవారికి స్పష్టంగా పూజ ఎంపిక వ్యవహారం తక్షణ కారణంగా కనబడుతుంది. కానీ ఆ సంస్థ అదేం కాదంటోంది. 'వ్యక్తిగత కారణాలే' అని సంజాయిషీ ఇస్తోంది. అటు కేంద్రం సైతం ఏమీ మాట్లాడదు. దీనివల్ల ప్రజల్లో అనుమానాలు తలెత్తితే... మొత్తంగా అది సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయదా? అభ్యర్థులు తాము బాగా రాసినా అక్కడేదో జరిగిందన్న అపోహలుపడే పరిస్థితి తలెత్తదా? అసలు ఇలాంటివి జరుగుతున్నాయన్న నమ్మకాలు బలపడితే అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకూ, ఆ తర్వాత ఇంటర్వ్యూలకూ హాజరు కాగలరా? నూతన సారథి ఈ అంశాలపై ఆలోచన చేయాలి. పూజ ఉదంతంలో కోల్పోయిన విశ్వసనీయతను పెంపొందించుకోవటానికి ఏమేం చర్యలు అవసరమన్న పరిశీలన చేయాలి. అభ్యర్థుల మదింపు విషయంలో అనుసరించే విధానాల గురించి... ముఖ్యంగా వారి జవాబుపత్రాల దిద్దుబాటుకూ, ఆ తర్వాత జరిగే ఇంటర్వ్యూలో అభ్యర్థులిచ్చే జవాబుల ద్వారా వారి శక్తియుక్తులనూ, సామర్థ్యాన్ని నిర్ధారించే పద్ధతులకూ ఎలాంటి ప్రమాణాలు పాటిస్తారో తెలపాలి.

చదువుల్లో, సమస్యలను విశ్లేషించే సామర్థ్యంలో మెరికల్లా ఉండటం, సమాజంలో అపరిష్కృతంగా మిగిలిపోతున్న అంశాల విషయంలో ఏదో ఒకటి చేయాలన్న తపన, తాపత్రయం ఉండటం, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించటం సివిల్ సర్వీసుల అభ్యర్థులకు అవసరమని చాలా మంది చెబుతారు. నిజానికి ఈ సర్వీసుల్లో పనిచేసేవారి జీతభత్యాలకు అనేక రెట్లు అధికంగా సాఫ్ట్‌వేర్ రంగంలో లేదా వ్యాపారాల్లో మునిగితేలేవారు సంపాదిస్తారు. అందుకే ఎంతో అంకిత భావం ఉండేవారు మాత్రమే ఇటువైపు వస్తారు. కానీ అలాంటివారికి యూపీఎస్సీ ధోరణి నిరాశ కలిగించదా? నీతిగా, నిజాయితీగా పాలించటం చేతకాని పాలకుల ఏలుబడిలో పనిచేయాల్సి వచ్చినప్పుడు సర్వీసులో కొత్తగా చేరిన యువ అధికారులు ఎంతో నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. అసలు యూపీఎస్సీయే నిర్లక్ష్యం లోనికో, నిర్లిప్తత లోనికో జారుకుంటే ఎవరిని నిందించాలి? పూజా ఖేడ్కర్‌కు సంబంధించి ఇంకా దోష నిర్ధారణ జరగలేదు. ప్రస్తుతం ఆమె కేవలం నిందితురాలు మాత్రమే. పునః శిక్షణకు రావాలన్న సూచనను బేఖాతరు చేయటంతో ఇప్పటికే యూపీఎస్సీ ఆమె ఎంపికను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. మరోపక్క పోలీసులూ, యూపీఎస్సీ నియమించిన కమిటీ ఆమె సమర్పించిన ధ్రువీకరణ పత్రాలపై ఆరా తీస్తున్నారు. ఆమె ముందస్తు బెయిల్ దరఖాస్తును న్యాయస్థానం తిరస్కరించింది. ఈ పరిణామంతో ఆమె దుబాయ్‌కి పరారీ అయ్యారన్న కథనాలు కూడా మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ఉదంతంలోనైనా జరిగిందేమిటో వివరిస్తే, ఇది పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలేమిటో చెబితే యూపీఎస్సీపై విశ్వసనీయత పెరుగుతుంది. దాని ప్రతిష్ఠ నిలబడుతుంది.

బడ్జెట్‌లో సామాజిక న్యాయం ఉందా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలు, అక్షరాలు అపురూపంగా ఉన్నాయి. కానీ దళిత, బహుజన, మైనారిటీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పక తప్పదు. ప్రధానంగా బడ్జెట్‌కు ఉండే రాజ్యాంగ స్పృహ తగ్గింది. దళితులకు భూమి, ఉపాధి, సాంకేతిక జ్ఞానం, నైపుణ్యం అందించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. భారతదేశ ఆర్థిక ఉత్పత్తిలో దళిత బహుజనులను భాగస్వామ్యం చేసినప్పుడే దేశ సంపద పెరుగుతుందని అంబేడ్కర్ అన్నారు. వారికి బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు వారి జీవనాభివృద్ధిని నిర్లక్ష్యం చేసేలాగానే ఉన్నాయి. మురుగువాడల నిర్మూలనకు, నూత్న పారిశ్రామిక వాడల నిర్మాణానికి పథకాలు లేవు. వ్యవసాయం, విద్య, ఉపాధి లాంటివాటి విషయంలోనూ బడ్జెట్ ఏ దూరదృష్టినీ కనబరచలేదు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలు, అక్షరాలు అపురూపంగా ఉన్నాయి. కానీ దళిత, బహుజన, మైనారిటీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పక తప్పదు. పన్ను చెల్లింపు దారులకు బడ్జెట్ అనుకూలంగా ఉంది. ప్రధానంగా బడ్జెట్‌కు ఉండే రాజ్యాంగ స్పృహ తగ్గింది. భారతదేశ ఆర్థిక ఉత్పత్తిలో దళిత బహు జనులను భాగస్వామ్యం చేసినప్పుడే దేశ సంపద పెరుగుతుందని అంబేడ్కర్ అన్నారు. దళితులు శ్రామిక శక్తులు. వారికి భూమి, ఉపాధి, సాంకేతిక జ్ఞానం, నైపుణ్యం అందించినప్పుడే భారతదేశ సంపద పెరుగుతుంది.

భారతదేశం ముఖ్యంగా గ్రామీణ వ్యవసాయిక దేశం. ఈ బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి 2.66 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. నిజానికి గ్రామాల్లో ఊరు వేరుగా ఉంది, దళితవాడ వేరుగా ఉంది. దళిత వాడకు విద్యుత్ సౌకర్యం లేదు. మంచినీటి సదుపాయం లేదు. మురుగు నీటి వ్యవస్థ లేదు. రోడ్లు లేవు. దళితులు 3, 4 కుటుంబాలు ఒక్క సెంటులో జీవిస్తున్నారు. భారత గ్రామాలను చూసిన విదేశీ పరిశోధకులు ఇది స్పృశ్య భారతమా? అస్పృశ్య భారతమా? అని అడుగుతున్నారు. గ్రామాల్లో ఉన్న వృత్తికారులు పట్టణాలకు వెళ్ళి మురుగువాడల్లో జీవిస్తున్నారు. నివాసానికి ఇళ్ళులేక మురుగు కాలువల మీద చెక్కబల్లలు వేసుకొని వాటిమీద బతుకుతున్నారు. ఈ మురుగువాడల నిర్మూలనకు, నూత్న పారిశ్రామిక వాడల నిర్మాణానికి పథకాలు లేవు. గ్రామీణాభివృద్ధి పథకం కింద 25 వేల గ్రామీణ జనావాసాలు ఉన్న దగ్గర శాశ్వత రహదారులు నిర్మిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అనేక దళితవాడలు, గిరిజన వాడలకు ఇంత జనాభా ఉండదు. అందుకే ఇది పన్ను కట్టేవారి బడ్జెట్‌గానే మన ముందుకు వచ్చింది. నిజానికి గిరిజన గ్రామాలు ఇంకా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సంక్షోభంలోనే ఉన్నాయి. గర్భవతిగా ఉన్న వారిని డోలీల్లో మోసుకొచ్చే పరిస్థితుల్లోనే ఉన్నారు. వారికి కేటాయించిన అతి స్వల్ప నిధి వారి జీవనాభివృద్ధిని నిర్లక్ష్యం చేసేలాగానే ఉంది.

ఇకపోతే వ్యవసాయ రంగానికి ఇచ్చిన కేటాయింపుల్లో దూరదృష్టి లేదనీ, రైతులకు మేలు జరిగే అంశాలు లేవనీ రైతు సంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. 'కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చట్టబద్ధతపై ఎలాంటి ప్రకటన చేయలేదని కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ స్పందిస్తూ, వ్యవసాయ రంగానికి కేటాయింపు పెరగాల్సిందన్నారు. రైతులకు సంబంధించినంత వరకు ఇది ఫ్లాప్ బడ్జెట్ అని మరొక రైతు నేత హర్మీత్ సింగ్ కడియన్ వ్యాఖ్యానించారు. పంజాబ్ రైతులకు మొండిచేయి చూపిందనీ, వ్యవసాయ వైవిధ్యత ప్యాకేజీగానీ, ఆగ్రో–ఇండస్ట్రియల్ ప్యాకేజీగానీ ప్రకటించలేదని అన్నారు. మరో విషయం. బడ్జెట్‌లో భారతదేశంలో నిరంతరంగా వస్తున్న తుఫాన్లు, వరదలు, అతి ఉష్ణోగ్రతలు, అతి శీతలాలను పరిష్కరించే విధానాలకు, కార్యక్రమాలకు నిధులు కేటాయించలేదు.



ఇకపోతే భారత దేశానికి ఊపిరిలాంటి విద్యా రంగానికి భారీగా కోత పెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1.29 లక్షల కోట్లు కేటాయించగా, ఈసారి రూ.1.20 లక్షల కోట్లే ఇచ్చి, తొమ్మిది వేల కోట్లు తగ్గించారు. భారతదేశంలో నిరక్షరాస్యత పెరగడానికి కారణం వయోజన విద్యకు అక్షరాలు రాయాల్సిన స్త్రీలు టీవీలకు బుర్రల్ని అప్పజెప్పడం! కేంద్ర విశ్వ విద్యాలయ స్థాయిలో కూడా ల్యాబులు, లైబ్రరీలు లేవు. పరిశోధకులకు సరైన స్కాలర్‌షిప్‌లు లేవు. భారతదేశంలో ఉన్నత విద్య సరిగా లేక విద్యార్థులు విదేశాలకు వలస పోతున్నారు. నిజానికి విద్యారంగాన్ని దెబ్బతీసే అనేక కోతలు జరిగాయి. ఉన్నత విద్య నియంత్రణ మండలి యూజీసీకి 60 శాతానికి పైగా నిధులు తగ్గించారు. దేశంలో ప్రతిష్ఠాత్మక ఐఐఎంలకు వరుసగా రెండో ఏడాది కూడా కేటాయింపులు తగ్గించారు.

ఇకపోతే మరోపక్క నిరుద్యోగం విపరీతంగా పెరుగుతోంది. ఈ బడ్జెట్‌లో ఉద్యోగ వసతికి ప్రాధాన్యం బాగా తగ్గించారు. భారత దేశాన్ని యువ భారతం అని పిలుస్తున్నారు. యువత దేశ భవిష్యత్‌కు సజీవ శక్తి లాంటిది. కానీ ఈ బడ్జెట్ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను నిరాకరిస్తోంది. ఇవాళ నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక మత్తు మందులకు, గంజాయికి అలవాటుపడుతున్నారు, నేరాలకు పాల్పడుతున్నారు. వారికి ప్రభుత్వ ఉద్యోగ వసతి కలిగించినట్లయితే వారు నేరస్థులుగా, అర్ధ నేరస్థులుగా జీవించరు. వారిలో వ్యక్తిత్వ నిర్మాణ దక్షత పెరుగుతుంది. ఒక యువకుని వ్యక్తిత్వ నిర్మాణానికి లౌకికవాద భావజాలం, లౌకికవాద దృష్టి, సామాజిక స్ఫూర్తి అన్నీ అవసరం. స్కిల్ నైపుణ్యం ఒక్కటే చాలదు, జీవన నైపుణ్యం కావాలి.

ఇకపోతే ఆంధ్రప్రదేశ్ ముఖ్య పట్టణం అమరావతికి ఇచ్చిన 15 వేల కోట్లను గ్రాంట్‌గా కాక రుణంగా ఇవ్వడాన్ని ప్రతిపక్షాలు తప్పు పడుతున్నాయి. అసలు రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. ఆ రోజున ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి, ఈ రోజున ఇచ్చే నిధులన్నీ అప్పుగా ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం ఆశ్చర్యంగా ఉంది. మమతా బెనర్జీ(పశ్చిమ బెంగాల్), స్టాలిన్ (తమిళనాడు), రేవంత్ రెడ్డి (తెలంగాణ), విజయన్ (కేరళ), సిద్ధరామయ్య (కర్ణాటక) లాంటి ముఖ్యమంత్రులందరూ రాష్ట్ర ప్రభుత్వాల అస్తిత్వాన్నీ, ఆర్థిక ప్రజాస్వామ్యాన్నీ దెబ్బతీసేదిగా ఈ బడ్జెట్ ఉందని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం బడ్జెట్‌లో సామాజిక న్యాయం లేదనీ, భారతదేశ ఆర్థిక ప్రగతికి విఘాతం కలిగించే శక్తులకు ఈ బడ్జెట్‌ను అప్పగించే ప్రయత్నం జరుగుతోందనీ అన్నారు.

ఇకపోతే ఉపాధి హామీ రంగానికి ఈ బడ్జెట్‌లో కోతలు విధించి బుద్ధిపూర్వకంగా శ్రామికుల ఆదాయ మార్గాన్ని దెబ్బతీశారని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు. నిజానికి అంబేడ్కర్ బడ్జెట్ నిర్మాణంలో తప్పకుండా భూమి పంపకం ఉండాలనీ, కుల నిర్మూలనా భావం ఉండాలనీ అన్నారు. కులాన్ని నిర్మూలించే భావ చైతన్యం కోసం, ఆచరణాత్మక కార్యక్రమం కోసం బడ్జెట్‌లో తగిన కేటాయింపులు ఉన్నప్పుడే, దేశంలో సామరస్యత, శాంతి ప్రజ్వరిల్లుతాయనీ చెప్పారు. దేశానికి మత సామరస్యం, లౌకికవాద భావన, సామ్యవాద సిద్ధాంత స్ఫూర్తి చాలా అవసరం అని నొక్కి చెప్పారు. దళితులు, ఆదివాసీల సమస్యలను వారి ఎంపీలే మాట్లాడితే అందులో సానుభూతి కాకుండా స్వీయ అనుభవపు గొంతుక వినబడుతుంది. ఒక జగ్జీవన్‌రామ్, ఒక దామోదరం సంజీవయ్య, ఒక ప్రగడ కోటయ్య లాంటివాళ్ల గొంతులు లోక్‌సభలో, రాజ్యసభలో వినిపించేవి. ఇప్పుడు రెండు సభల్లోనూ ఆధిపత్య కులాల ప్రతినిధులే మాట్లాడుతున్నారు. చివరకు రాహుల్ గాంధీని 'నీది ఏ కులం?' అనే దాక పరిస్థితి వెళ్ళింది. వాళ్ళ తాత ఫిరోజ్ గాంధీ ఒక పార్సీ, ఇందిరా గాంధీ కశ్మీరీ బ్రాహ్మణుడైన నెహ్రూ కుమార్తె. అది వర్ణాంతర వివాహం. వాళ్ళ తండ్రి రాజీవ్ గాంధీ, సోనియా గాంధీలది దేశాంతర వివాహం. మూడు తరాలు వర్ణాంతరం చేసుకుంటే వారికి కులం ఉండదు. రాబోయే కాలం కులాంతర సమాజం. అది అందరం తప్పకుండా అర్థం చేసుకోవలసిన విషయం.

ఇప్పుడు దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీవాద, లౌకికవాద మేధావులంతా పార్టీలకు అతీతంగా అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ఆలోచించాలి. సామ్యవాద, లౌకికవాద భారతాన్ని నిర్మించడం కోసం నడుం కట్టాలి. అప్పుడే భారతదేశంలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వికాసం కలుగుతుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒలింపిక్స్‌తో ప్రేరణ



ఇదొక ఆలోచన. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో పిల్లలకు కనీసం ఒక గంటసేపైనా పారిస్ ఒలింపిక్స్ చూపించడం తప్పనిసరి చేయాలి. పిల్లలు చాలా నేర్చుకోవడమే కాకుండా ప్రేరణ పొందుతారు. అన్ని విధాలుగా మంచిది!

– వీరేన్ రస్కిన్హా, హాకీ జట్టు మాజీ కెప్టెన్

యుద్ధం ఆపొచ్చుగా!



2020 నుంచి బైడెన్ రష్యాకు దౌత్యపరమైన తలుపులు మూసేశారు. కానీ రష్యా నుంచి చేసుకున్న అతిపెద్ద ఖైదీల మార్పిడిని ప్రచ్ఛన్న యుద్ధం తర్వాతి అతిపెద్ద దౌత్య విజయంగా అభివర్ణిస్తున్నారు. మరి అదే దౌత్యాన్ని ఉక్రెయిన్ యుద్ధం ముగియడానికి ఎందుకు పొడిగించకూడదు?

– బ్రహ్మా చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

ప్రతిభ చూపకూడదా?



ఒక తెల్ల మహిళను (టెన్నిస్‌లో) గెలిచినప్పుడు సెరెనా విలియమ్స్‌ను మగవాడని నిందించారు. ఒక తెల్ల మహిళను (రన్నింగ్‌లో) గెలిచినప్పుడు కాస్టర్ సెమెన్యాను మగవాడని నిందించారు. ఒక తెల్ల మహిళను (బాక్సింగ్‌లో) గెలిచినప్పుడు ఇమేన్ ఖెలీఫ్‌ను మగవాడని నిందిస్తున్నారు. దీన్నుంచి కావాల్సింది తీసుకోండి!

– ఇసా పెరేజ్, వ్యాఖ్యాత

ఆసియా ఐరాస



క్వాడ్ అనేది ఆసియన్ నాటో కాలేదు. కానీ క్వాడ్ పరిధిలోకి వస్తున్న వాతావరణ మార్పు, ఆరోగ్యం లాంటి విస్తృత అంశాలను బట్టి అది ఆసియన్ ఐక్యరాజ్యసమితి కాగలదేమో!

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

ఆటలో అరటిపండు



చిన్మతః పురుషుడు నిజ జీవితంలో ఒక మహిళ ముఖాన్ని బద్దలుకొడితే అతడు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. కానీ అదే పురుషుడు ఒలింపిక్స్‌లో మహిళ ముఖాన్ని బద్దలుకొడితే మాత్రం పతకానికి అర్హుడా?

– శేఫాలీ వైద్య, జర్నలిస్ట్

వైజ్ఞానిక వేగుచుక్కలు

తొలితరం డాక్టర్, ఫెమినిస్ట్ కూడా!

1864 జనవరి ఒకటో తేదీన బొంబాయిలో ఒక వడ్రంగి కుటుంబంలో జన్మించిన రుక్మాబాయి 11 ఏళ్ల వయసులోనే 19 ఏళ్ల దాదాజీ బికాజీని వివాహం చేసుకున్నారు. మారు తండ్రి... సామాజిక కార్యకర్త, వైద్యుడు అయిన శేఖరం అర్జున్ ప్రోత్సాహంతో ఇంట్లోనే చదువు సాగించారు. సమాజసేవా కార్యక్రమాల వైపూ ఆకర్షితులయ్యారు. ఇల్లరికం వస్తానని మాటతప్పి సోమరిగా తిరుగుతున్న భర్త నుండి విడాకులు పొందడానికి పెద్ద యుద్ధమే చేసి విజయం సాధించారు.



రుక్మాబాయి

'బికాజీ వర్సెస్ రుక్మాబాయి 1885 కేసు'గా ఈ కేసు ఇండియాలోనూ, బ్రిటన్‌లోనూ ప్రసిద్ధి పొందింది. ఒకానొక సందర్భంలో కోర్టు ఆమెకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో విక్టోరియా మహారాణి దృష్టికి తన కేసును తీసుకువెళ్లారు రుక్మాబాయి. మహారాణి ఈ వివాహాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈమె కేసుపై రేగిన చర్చోపచర్చల కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం 1891లో 'ఏజ్ ఆఫ్ కాన్సెంట్ చట్టా'న్ని చేశారు. దాంతో అధికారికంగా బాల్యవివాహాలు మనదేశంలో రద్దయ్యాయి.

ఈ వ్యవహారం నడుస్తుండగానే రుక్మాబాయి మరింతగా చదువుకోవాలని భావిస్తే... డాక్టర్ ఎడిత్ పెచాయ్ ఆర్థిక వనరులను పోగు చేశారు. సంప్రదాయానికి వ్యతిరేకంగా పోరాడిన రుక్మాబాయి ధైర్యాన్ని మెచ్చుకుంటూ మహారాజా శివాజీరావు హోల్కర్ రూ. 500 విరాళంగా పంపారు. ఫలితంగా రుక్మాబాయి 1889లో ఇంగ్లండ్ వెళ్లి 1894లో 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ ఉమెన్'లో పట్టా, 'రాయల్ ఫ్రీ హాస్పిటల్‌లో శిక్షణ పూర్తిచేసుకుని భారతదేశం తిరిగి వచ్చారు. 1895లో భారతదేశం తిరిగి వచ్చిన రుక్మాబాయి సూరత్‌లోని మహిళల ఆసుపత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా చేరారు. తరువాత 1918లో రాజ్‌కోట్‌లోని 'ఉమెన్స్ స్టేట్ హాస్పిటల్'లో పనిచేయడానికి వెళ్లారు. 1929లో పదవీ విరమణ చేసేదాకా అక్కడే పనిచేశారు. పదవీ విరమణ తర్వాత బొంబాయిలో స్థిరపడిన రుక్మాబాయి 'నిషేధించాల్సిన పరదా' అనే ఒక కరపత్రం ద్వారా పెద్ద ఎత్తున పరదా పద్ధతికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు.

రుక్మాబాయి 91 సంవత్సరాల వయసులో ఊపిరితిత్తుల క్యాన్సర్ కారణంగా 1955 సెప్టెంబర్ 25న కన్నుమూశారు. అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన రుక్మాబాయి విజయగాథ ఎంతో మందికి స్ఫూర్తి కలిగిస్తూనే ఉంది. 2008లో వచ్చిన సుధీర్ చంద్ర పుస్తకం 'ఎన్‌స్లేవ్డ్ డాటర్స్: కలోనియలిజం, లా అండ్ ఉమెన్స్ రైట్స్', అలాగే 2016లో వచ్చిన మరాఠీ సినిమా 'డాక్టర్ రుక్మాబాయి' పెద్ద ఎత్తున విజయం సాధించి, సంచలనాలను నమోదు చేశాయి.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ | ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

కొత్త సీసాలో పాత సారా... పేర్లు మార్చారంతే!


అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

భారతీయ న్యాయ సంహిత అనీ, నాగరిక సురక్షా సంహిత అనీ, సాక్ష్య అధినియమం అనీ మన కేంద్రప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలకు పేర్లు పెట్టారు. అలాగే 'భారత్' అనే పేరుతోనే మన దేశాన్ని వ్యవహరించాలనీ తీర్మానించారు. మొత్తం మీద వీలున్నంత ఎక్కువగా 'భారతీయ' పదాన్ని అనేక అంశాలకు తగిలిస్తే కానీ తమ భారతీయ జనతాపార్టీకి మరింత గుర్తింపు వస్తుందనుకుందా ఏమిటి అని విమర్శకులు అంటున్నారు. నిజానికి రాజ్యాంగంలో ఇప్పటికే మన దేశాన్ని 'ఇండియా దట్ ఈజ్ భారత్' అని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా భారత్ అనే పిలవాలని అనడంలో అర్థం ఏముంది? అలాగే ఇప్పుడు తీసుకువచ్చిన కొత్త నేర చట్టాల మూలాలూ, అందులోని చాలా అంశాలూ పాత చట్టాల్లోనివే.

ఇవీ మన కొత్త చట్టాలు-2



మన పాలకులు ఇప్పటివరకు అమలులో ఉన్న మూడు నేర చట్టాలను పాత బ్రిటిష్ కాలపు తుప్పుపట్టిన చెత్త చట్టాలని తప్పు పడుతున్నారు. ఆ మూడు క్రిమినల్ చట్టాల గురించి ఎవరికీ పెద్ద ప్రేమ ఉండనవసరం లేదన్నమాట నిజమే. అయితే 1973లో మన భారతీయ కోడ్‌ను ఆమోదించినది మన పార్లమెంటే కదా. అయినా 'చెత్త, పాత, తుప్పుపట్టిన' అని దాన్ని నిందించడం న్యాయమా?

1860 నాటి 'ఇండియన్ పీనల్ కోడ్' తిట్టుకోదగిన పరమ పాత (సనాతన) చట్టంలోని నేర నియమాలను 90కి పైగా కేవలం వాటి నంబర్లు మార్చి కొత్త చట్టంలో చేర్చి సంస్కరణ అనడం ఎంతవరకు సమంజసం? ఇది అవసరమా? దీన్ని మోసం అంటే తప్పా? ఇక సాక్ష్య చట్టం కూడా 95 శాతం పాతదే. అక్షరం కూడా తు.చ. మార్చకుండా పేరు మార్చినంత మాత్రాన ఈ చట్టాలను వినూత్న చట్టాలనే అంటారా?

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ స్వయంగా 470 ఎంపీ సీట్లు గెలుచుకోబోతోందని భావించి మొత్తం రాజ్యాంగాన్నే పూర్తిగా మార్చేస్తామని కూడా చెప్పుకున్నారు. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీకి చాలా తక్కువ స్థానాలు మాత్రమే లభించాయి. చంద్రబాబు నాయుడు తెలుగుదేశం, నితీశ్ కుమార్ జేడీ (యూ) పార్టీ వంటివి లేకపోతే ఎన్డీఏ ఓడిపోయి ఉండేది. వారి మద్దతుతో బలహీనమైన బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వచ్చింది. దానికే పూర్తి మెజారిటీ ఉంటే ఎటువంటి పరిణామాలు జరిగేవో మరి.

ప్రతిపక్షాలను ఎటూ ప్రభుత్వం పట్టించుకోవడం లేదనుకోండి. కనీసం ఎన్డీఏలోని బీజేపీ మిత్రపక్షాలతోనైనా చర్చించకుండా ఈ కొత్త నేర చట్టాలను యథాతథంగా అమలుచేయడం న్యాయమా? ఆ నేర చట్టాలు అమలు చేయడానికి జులై 1వ తేదీ 00.00 సమయాన్ని ముహూర్తంగా నిర్ణయించడం సమంజసమేనా? సంకీర్ణంలోని టీడీపీ, జేడీ (యూ) లైనా ఈ చట్టాలపై 'చర్చించడం అవసరం' అని అనలేదే? మిగిలిన ప్రతిపక్షాలూ గట్టిగా ప్రశ్నించలేదు, కేవలం లాంఛనంగా మాత్రం వ్యతిరేకించాయి. తీవ్ర ప్రతిఘటన లేనే లేదు. కనీసం గెలిచిన కొత్త ఎంపీలైనా ఒక్కరంటే ఒక్కరు కూడా ఆలోచించక పోవడం విచిత్రం.

ఇలా ఎవరికి వారు ఈ చట్టాలపై తీవ్ర నిరసనను ప్రకటించకుండా వదిలేస్తే ముందు ముందు ప్రజలు ఇబ్బందుల పాలు అవుతారనడంలో సందేహం లేదు. ఈ చట్టాల రూల్స్, కస్టడీ, లాకప్ నియమాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే ఏ క్షణంలో ఏ పౌరుణ్ణయినా పోలీసులు తమ కస్టడీలోకి తీసుకోవచ్చు.

కొన్నిటిని కోడ్‌లు అనీ, మరొక చట్టాన్ని ఆక్ట్ అని ఎందుకు అంటారో చూద్దాం. పీనల్ కోడ్ పేరుతో అనేకానేక నేరాల చట్టాలు ఓ సంపుటిగా ఉన్నపుడు దాన్ని 'కోడ్' లేదా స్మృతి అని అంటారు. అలాగే ప్రొసీజర్ అనే వివిధ చట్టాల సంపుటాన్ని కూడా కోడ్ అంటాం. సాక్ష్యానికి సంబంధించిన అనేక నియమాలను ఒకే చట్టం (ఆక్ట్)గా విభజించినారు. అవి 1. ఐపీసీలో నేరాలకు నిర్వచనాలు, శిక్షలు, మినహాయింపులకు సంబంధించిన నియమాలను పీనల్ కోడ్ 2. ప్రక్రియకు సంబంధించిన అనేక నియమాలు (ప్రొసీజర్ కోడ్). 3. సాక్ష్యాల నియమాలు వివరించే చట్టం. ప్రధానమైన ఈ మూడింటినీ కలిపి 'క్రిమినల్ లా' అంటారు. నేరాల గురించిన 'పీనల్ కోడ్–1860' మనకు 164 సంవత్సరాల నుంచి 'ఐపీసీ'గా తెలుసు. దీనితోపాటు 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973', 'ఎవిడెన్స్ ఆక్ట్ 1872'లను కలిపి క్రిమినల్ చట్టాలు అంటున్నాం. ఏతావాతా చెప్పొచ్చేది ఏమిటంటే... పాత చట్టాలను మరింత ప్రమాదకరంగా మార్చి పోలీసులకు విశేష అధికారాలు కల్పించారని. ఒక్క మాటలో ఇవి 'కొత్త సీసాలో పాత సారా!'

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

సత్యపాలనలో విచక్షణ

శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన ఒక సందేశాత్మక కథ ఇది. కౌశికుడనే బ్రాహ్మణుడు ఒక నదీ సంగమ పుణ్య క్షేత్రంలో నివసిస్తూ, సత్యమే పలకాలనే వ్రతం పట్టి, సత్యవాదిగా ప్రసిద్ధుడయ్యాడు. నిరంతరం తపస్సు చేస్తూ ఉండేవాడు. ఒకనాడు కొందరు జనులు దొంగలు వెంటపడుతుంటే భయంతో ఇతని ఆశ్రమ ప్రాంతంలో ఉన్న పొదలలో దాక్కున్నారు. దొంగలు వచ్చి, కౌశికుని ఆ జనం ఎటు వైపు వెళ్లారని అడిగారు. తనకు అసత్య దోషం రాకూడదని అతడు, వాళ్ళు ఉన్న పొదల వైపు చూపించి చెప్పాడు. ఆ దొంగలు వారిని చంపి ధనాన్ని దోచుకున్నారు. కౌశికుడు తాను చేసిన దోషానికి నరకాన్ని పొందాడని కృష్ణుడు చెప్పాడు.



భారత యుద్ధంలో, కర్ణుని ఆ రోజు చంపలేదని తెలిసి ధర్మరాజు, అర్జునుని పరాక్రమాన్ని అవమానిస్తాడు. గాండీవాన్ని కృష్ణునికిచ్చి, అర్జునుని రథం నడపమంటాడు. అప్పుడు అర్జునుడు కోపంతో తన గాండీవాన్ని ఇతరులకిమ్మని ఎవరైనా అంటే వారిని చంపుతానని చిన్నతనంలోనే ప్రతిజ్ఞ చేశానని, చెప్పి ధర్మరాజుని చంపబోతాడు.

కృష్ణుడు వారించి, చేయవలసిన పనిలో ధర్మ సూక్ష్మాన్ని గ్రహించమని, చిన్నప్పుడు లోకం తీరు తెలియనప్పుడు చేసిన ప్రతిజ్ఞను, విషయం తెలిసిన పెద్దలు ఎవరూ పట్టించుకోరని, ప్రతిజ్ఞా పాలనలో వివేకం అవసరమని చెబుతాడు.

అర్జునుడిది వ్యర్థ ప్రతిజ్ఞ కాకుండా ఉండటానికి ధర్మరాజుని నిందించి, తర్వాత నమస్కరించి ఆశీస్సులు పొందమని కృష్ణుడు చెపుతాడు.

ఆ సందర్భంలో కృష్ణుడు అర్జునునికి ఈ కథ నిదర్శనంగా చెప్పి, సత్యాసత్య నిరూపణలో వివేకాన్ని పాటించాలని చెపుతాడు. అసత్య దోషం కలుగుతుందని, ప్రతిజ్ఞా భంగం అవుతుందనే భయంతో హింసకు దారి తీసే, ధర్మానికి హాని చేసే పని చేయకూడదు. కౌశికుడు అలా చేసినందువల్లే జనులు దొంగల చేతిలో ప్రాణాలు కోల్పోయారు. అతనికీ హాని జరిగిందని కృష్ణుడు చెప్పాడు. సత్యవ్రత పాలనలో వివేకం అవసరమని దీని సారాంశం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.3.35 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** పునర్వసు ప.12.48 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.9.09 నుండి 10.49 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.24 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.20 నుండి 11.58 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.30.

క్లుప్తంగా...

గొడవలొద్దని ఎస్పీ హెచ్చరించిన కాసేపటికే దాడి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై పడి టీడీపీ శ్రేణుల విధ్వంసం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గ్రామంలో ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు హెచ్చరించి వెళ్లిన కొద్దిసేపటికే టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పిన్నెల్లిలో ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న వందలాది కుటుంబాలు గ్రామాన్ని విడిచి ఇతర ప్రాంతాల్లో తల దాచుకుంటున్నాయి. ఇటీవల ఈ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి చెందడంతో పోలీసుల పర్యవేక్షణలో అంత్యక్రియలు జరపాల్సిన దుస్థితి ఏర్పడింది. కర్మకాండలు జరుపుకునేందుకు బంధువులు, మిత్రుల రాకను జీర్ణించుకోలేని తెలుగుదేశం కార్యకర్తలు రెచ్చిపోయి ఇళ్లపై దాడులకు తెగబడ్డారు. ఇంటి అరుగులు, ప్రహరీ, గేట్లు ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిణామంతో పిన్నెల్లి గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాక్షాత్తు జిల్లా ఎస్పీ గ్రామంలో పర్యటించి హెచ్చరించినా, టీడీపీ మూకలు లెక్కచేయక పోవడం పోలీసు వ్యవస్థకే సవాల్ విసిరినట్లయింది.

కాకినాడలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగ మథనం

- హాజరైన తెలుగు రాష్ట్రాల దృగ్గణిత పంచాంగ కర్తలు




కాకినాడ రూరల్: రాబోయే తెలుగు నూతన సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరంలో పండగలు, పర్వదినాల నిర్ణయాలపై తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన భారత ప్రభుత్వం ఆమోదిత దృగ్గణిత పంచాంగ కర్తలు పంచాంగ మథనం చేశారు. కాకినాడకు సమీపంలోని రూరల్ మండలం రాయుడు పాలెంలోని బ్రాహ్మణ భవనంలో శుక్రవారం తెలుగు రాష్ట్రాలకు చెందిన పంచాంగ కర్తల సదస్సు నిర్వహించారు. తెలుగు దృగ్గణిత పంచాంగ కర్తల సమాఖ్య కార్యదర్శి పొన్నలూరి శ్రీనివాస గార్గేయ అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలుగు రాష్ట్రాల్లో పండగ నిర్ణయాలను కేవలం దృక్ సిద్ధాంత ప్రామాణికంగా నిర్దేశించిన పండగలను మాత్రమే ప్రభుత్వాలు పరిగణించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 36మంది పంచాంగ కర్తలు సదస్సుకు హాజరై పలు తీర్మానాలు చేశారు. 2025-26కు సంబంధించిన పండగలను సమాఖ్య నిర్ణయించింది. శ్రీనివాస గార్గేయ సిద్ధాంతి మాట్లాడుతూ టీటీడీ తమిళ పంచాంగం దృక్ సిద్ధాంతం ఆధారంగా ప్రచురిస్తున్నారని, దురదృష్టవశాత్తూ తెలుగు పంచాంగం మాత్రం పూర్వం పద్ధతిలో తీసుకువస్తున్నారన్నారు. సమాఖ్య అధ్యక్షుడు అన్నవరం గ్రామానికి చెందిన ద్విభాష్యం సుబ్రహ్మణ్య శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పంచాంగ కర్తలు హనుమంతవఝల సుబ్రహ్మణ్య శర్మ, పిడవర్తి చిన్నపూర్ణయ్య సిద్ధాంతి, ఉపద్రష్ట కృష్ణమూర్తి పేరిట ఏటా పురస్కారాలను పంచాంగకర్తలకు అందజేస్తామన్నారు.

శిలాఫలకాలపై చింతమనేని ఆక్రోశం

- రూ. కోటి అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు ధ్వంసం

ఏలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు ఆక్రోశం వెళ్లగక్కారు. కళ్లకు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక శిలాఫలకాలను ధ్వంసం చేశారు. చింతమనేని ప్రభాకర్ గురువారం కొల్లేరు పరిసర గ్రామాలైన గుడివాకలంక, మొండికోడులో పర్యటించారు. ఈ సందర్భంగా మొండికోడు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ప్రభాకర్‌కు కంటగింపుగా మారాయి.

ధనాపూర్-బెంగళూరు ప్రత్యేక రైలు దారి మళ్లింపు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా ధనాపూర్-బెంగళూరు మధ్య నడుపుతున్న ప్రత్యేక వారాంతపు రైళ్లను విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న మూడవ లైన్ నిర్మాణ పనుల కారణంగా దారి మళ్లించినట్లు విజయవాడ రైల్వే పీఆర్‌వో నుస్రత్ మండ్రూప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వయా విజయవాడ మీదుగా నడవాల్సిన ధనాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (03245) ఈ నెల 7న, బెంగళూరు-ధనాపూర్ (03246) ఈ నెల 9న, ధనాపూర్-బెంగళూరు (03259) ఈ నెల 6న, బెంగళూరు-ధనాపూర్ (03260), ధనాపూర్-బెంగళూరు (03247) ఈ నెల 8న, బెంగళూరు-ధనాపూర్ (03248), ధనాపూర్-బెంగళూరు (03241) ఈ నెల 9న, బెంగళూరు-ధనాపూర్ (03242) ఈ నెల 4, 11 తేదీల్లో బల్హార్షా, వరంగల్లు, విజయవాడ, గుంటూరు మీదుగా నడవాల్సిన రైళ్లను వయా బల్హార్ష, కాజీపేట, సికింద్రాబాద్, గుంతకల్లు, ధర్మవరం మీదుగా దారి మళ్లించారు.

గర్భిణికి 'డోలీ' నొప్పులు

గిరిజన ప్రాంతంలో గర్భిణులకు డోలీ కష్టాలు తప్పడం లేదు. సరైన రహదారి సౌకర్యం లేక, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు దాటలేక పడరాని పాట్లు పడుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కెందుగూడ గ్రామానికి చెందిన వంతాల నబిన(34) అనే గర్భిణికి శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. ఆస్పత్రికి తరలించేందుకు డోలీ కట్టారు. గ్రామ మాజీ వలంటీర్ సుబ్బారావు సహకారంతో నబిన కుటుంబ సభ్యులు రెండు కిలోమీటర్లు కాలినడకన మోసుకుంటూ బిరిగూడ వాగును దాటించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో లబ్బూరు పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. కెందుగూడకు సరైన రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన గురుమూర్తి, నీలకంఠం, సూరిబాబు, జగన్నాథం ఆవేదన వ్యక్తం చేశారు.



పార్తిమ్మను అతికష్టం మీద ఉబ్బెంగుల వాగును దాటిస్తున్న గిరిజనులు



కెందుగూడ నుంచి డోలీలో గర్భిణీ నబినను తీసుకు వస్తున్న కుటుంబ సభ్యులు

డోలీలో వాగులు దాటించి.. 8 కి.మీ. మోసి

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామానికి చెందిన వంతాల పార్తిమ్మ(46) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. శుక్రవారం ఆమె పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆస్పత్రికి తరలించేందుకు పార్తిమ్మ భర్త దొబులు, గ్రామస్తులు లక్ష్మణ్, సురేష్, రామ్మూర్తిల సహకారంతో డోలీపై దొరగూడ గ్రామం నుంచి బయలుదేరారు. ఈదురుగాలులతో కూడిన వర్షాన్ని సైతం తట్టుకుంటూ.. ఉధృతంగా ప్రవహిస్తున్న ఉబ్బెంగుల, బిరిగూడ వాగులను దాటించుకొని రోడ్డు మార్గం వరకు అతికష్టం మీద ఎనిమిది కిలో మీటర్లు డోలీతో మోసుకొని వచ్చారు. అక్కడి నుంచి 108లో ముంచంగిపుట్టు తరలించారు. వైద్యాధికారిణి గీతాంజలి వైద్య సేవలు అందిస్తున్నారు.

– ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా)



కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌జీ పండిట్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, అధికారులు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు.

– కాణిపాకం(చిత్తూరు జిల్లా)



తిరుమలలోని శ్రీవారి పుష్కరిణిని టీటీడీ అధికారులు గురువారం నుంచి మూసివేశారు. రానున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అభివృద్ధి చేయనున్నారు. ఈ కారణంగా నెలరోజుల పాటు పుష్కరిణి హారతిని కూడా నిలిపివేశారు. ప్రస్తుతం భక్తుల పుణ్యస్నానాల నిమిత్తం పుష్కరిణి పైభాగంలో షవర్లను ఏర్పాటు చేశారు.

– తిరుమల

అక్రమంగా తొలగిస్తున్నారు

- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన
- 2 నెలల్లో 2,360 మంది తొలగింపు
- రాజకీయ బెదిరింపులతో నలుగురి ఆత్మహత్య
- పంచాయతీరాజ్ కమిషనరేట్ ముందు ధర్నా
- తొలగించిన వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్
- ఉద్యోగభద్రతతో పాటు నెలకు రూ.20 వేల కనీస వేతనం ఇవ్వాలని వినతి



మాట్లాడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉపాధి హామీ పథకం అమలుకు క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను రెండు నెలలుగా రాజకీయ కారణాలతో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తోందంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా 2,360 మందిని తొలగించినట్లు తెలిపారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు శుక్రవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడుగంటల వరకు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, అధ్యక్షుడు ఎం.పరంధామయ్య, ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు, కోశాధికారి ఖాదర్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,360 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. 17 సంవత్సరాలుగా కేవలం గౌరవ వేతనంతో పనిచేస్తున్నవారిని అక్రమంగా తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో ఇంకా అనేకమందిని తొలగించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు చెప్పారు. అక్రమ తొలగింపులు, రాజకీయ బెదిరింపుల కారణంగా రాష్ట్రంలో నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు తీసుకోదని, ఉద్యోగాల నుంచి తొలగించదని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చెబుతున్నా.. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ బెదిరింపులు, అక్రమ తొలగింపులు కొనసాగడం విచారకరమని చెప్పారు. అక్రమంగా తొలగించిన వారందరినీ ప్రభుత్వం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ బెదిరింపులతో ఆత్మహత్య చేసుకున్న నలుగురి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబాల్లో వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగభద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.20 వేలకు పెంచాలని వారు కోరారు.

డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతా: డైరెక్టర్

కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల ప్రతినిధులు కొందరిని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ తన చాంబర్‌కు పిలిపించుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపులపై డ్వామా పీడీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివరాలు తెప్పించుకుంటానని కృష్ణతేజ హామీ ఇచ్చారని ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపిన వివరాలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామన్నారని చెప్పారు. ఈ ఆందోళనలో శ్రామిక మహిళా కన్వీనర్ కె.ధనలక్ష్మి, ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర నాయకులు వీరేష్‌గౌడ్, మహేష్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

38 మంది విద్యార్థినులకు అస్వస్థత

ప్రకాశంజిల్లా మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్‌లో ఘటన

మార్కాపురం రూరల్: ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థినులు 38 మంది అస్వస్థతకు గురైన ఘటన శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... మోడల్ స్కూల్‌లో దోమల నివారణ నిమిత్తం గురువారం సాయంత్రం దోమల మందును తరగతి గదుల్లో స్ప్రే చేశారు. స్ప్రే చేసిన కొద్దిసేపటి తర్వాత బల్లలను సిబ్బంది శుభ్రం చేయాల్సి ఉన్నా చేయలేదు. దీంతో విద్యార్థినులు యథావిధిగా శుక్రవారం ఉదయం హాస్టల్ నుంచి తరగతి గదులకు వచ్చారు. కూర్చున్న కాసేపటికే తుమ్ములు, తలనొప్పి, ఒంటిపై దద్దుర్లు, వాంతులతో సుమారు 38 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరందరినీ మోడల్ స్కూల్ సిబ్బంది సమీపంలో ఉన్న తిప్పాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకున్నందుకు...

- దేవదాయ శాఖ ఈవోపై టీడీపీ నేతల దౌర్జన్యం
- పోలీసులకు ఈవో ఫిర్యాదు



నార్పల: దేవదాయ శాఖ భూముల్లో నుంచి మట్టిని అక్రమంగా తరలించొద్దన్నందుకు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ) శిరీషపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేశారు. బండబూతులు తిట్టడంతో పాటు అంతు చూస్తామని బెదిరించారు. అనంతపురం జిల్లా నార్పల మండలంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని దుగుమర్రి గ్రామంలో శ్రీ ఈశ్వర వెంకటేశ్వర, పోతులరాజుస్వామి ఆలయాలకు చెందిన భూములున్నాయి. సర్వే నంబర్ 42లోని 4.58 ఎకరాలను సాగు కోసం ఆదిరెడ్డి అనే టీడీపీ కార్యకర్త రూ.2 వేలతో కౌలుకు తీసుకున్నాడు. అయితే సాగు చేయకుండా దేవదాయశాఖ షరతులకు విరుద్ధంగా గ్రామ సర్పంచ్ బావ అయిన టీడీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డితో కలసి మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలియడంతో ఈవో శిరీష అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. ఆమెను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు 'నీ ఉద్యోగం పీకేయిస్తాం.అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. దీనిపై ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.125.35 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్ఎస్‌డీ టోకెన్లను, భక్తులు క్యూల్లో వేచి ఉండే సమయం తగ్గించేందుకు ప్రస్తుతం 1.47 లక్షలు ఇస్తున్నామని, వీటిని మరికొంత పెంచేందుకు పరిశీలిస్తున్నామని చెప్పారు. తిరుమలకు వచ్చే భక్తులందరికీ దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలు మరింత మెరుగ్గా కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అక్టోబర్ 4-12 వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల పనులను సెప్టెంబర్ చివరినాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ఆగస్ట్ 15-17 వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరగనున్నాయని, ఆగస్ట్ 14న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. క్యూలు, కంపార్ట్‌మెంట్లల్లో వేచి ఉండే భక్తులకు ఇబ్బంది లేకుండా తాగు నీరు, పాలు, అన్నప్రసాదాల పంపిణీ, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరివేక్షించేందుకు కొందరు అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. టీటీడీ ఐటీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనం, వసతి తదితర సేవల బుకింగ్‌లో ఉన్న లోపాలను సరిదిద్దుతామని చెప్పారు.



శ్యామలరావు, ఈవో

రాజమహేంద్రవరం

మునిసిపల్ కమిషనర్ తుది ఉత్తర్వులు రద్దు

- అనుమతుల రెన్యువల్ కోసం పెట్టుకున్న దరఖాస్తును పరిష్కరించే వరకు కూల్చివేతలొద్దు
- వైఎస్సార్‌సీపీ కార్యాలయ భవన నిర్మాణం విషయంలో అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవనం కూల్చివేత నిమిత్తం మునిసిపల్ కమిషనర్ జారీ చేసిన తుది ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. భవన నిర్మాణ అనుమతుల రెన్యువల్ కోసం అధికారులకు ప్రత్యక్షంగా దరఖాస్తు సమర్పించేందుకు పార్టీ వర్గాలకు హైకోర్టు వెసులుబాటునిచ్చింది. భవన నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, భవన ప్లాన్ వివరాలను ఆ దరఖాస్తుకు జత చేయాలని ఆదేశించింది. ఈ దరఖాస్తుపై నిర్ణయం తీసుకునేంత వరకు పార్టీ కార్యాలయ భవనాన్ని కూల్చడానికి వీల్లేదని అధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో తదుపరి నిర్మాణాలేవీ చేపట్టవద్దని పార్టీ వర్గాలను సైతం ఆదేశించింది. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల భవనాల విషయంలో గత నెలలో ఇచ్చిన ఆదేశాలకు, చట్ట నిబంధనలకు లోబడి ఉండాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరంలోని తమ పార్టీ కార్యాలయ భవనం కూల్చివేత నిమిత్తం పురపాలక శాఖ అధికారులు జూలై 22న జారీ చేసిన తుది ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ కృష్ణమోహన్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ, ఇదే కోర్టు గత నెలలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తమ పార్టీ కార్యాలయ భవన నిర్మాణాలకు సంబంధించిన వివరాలను, వివరణలను అధికారులకు సమర్పించామన్నారు. అయితే వీటిని అధికారులు కనీస స్థాయిలో కూడా పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు.

రత్నగిరీశుని ధ్వజస్తంభం స్వర్ణమయం



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని రత్నగిరిపై వేంచేసి ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయ నూతన ధ్వజస్తంభానికి ఈ నెల తొమ్మిదో తేదీన స్వర్ణ కవచాలు అమర్చనున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. నెల్లూరుకు చెందిన దాతల సహకారంతో ఆలయంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, స్వర్ణ కవచ తాపడం పనులను గతేడాది రూ. 3 కోట్ల వ్యయంతో చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న ఘనంగా నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ నిర్వహించారు. స్వర్ణ రేకు తాపడం పనులు మే నెలలో ప్రారంభమయ్యాయి. మండపేటకు చెందిన చిన్నా బృందం సభ్యులు 300 కిలోల రాగితో రూపొందించిన ధ్వజస్తంభ కవచాలను దాత చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు పంపించి బంగారు పూత పూసి ధ్వజస్తంభానికి అమర్చే పనులు అప్పగించారు. బంగారు కవచాల పనులు పూర్తయ్యాయని, ఇందుకు 2 కిలోల బంగారం వినియోగించినట్లు సంస్థ జీఎం సత్యనారాయణరెడ్డి సాక్షికి తెలిపారు. బంగారు కవచాలను శ్రావణ శుద్ధ పంచమి, ఈ నెల తొమ్మిదో తేదీన ధ్వజస్తంభానికి అమర్చనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అతిపెద్ద నాగుపాము



వనపర్తి: తెలంగాణలోని వనపర్తిలో పీర్లగుట్ట సమీపంలోని ఓ ఇంట్లోకి అతి పెద్ద నాగుపాము వచ్చింది. వివరాల్లోకి వెళితే... శుక్రవారం రాంబాబు బాత్‌రూంలోకి వెళుతుండగా.. బుసలు కొడుతున్న శబ్దం విని ఆగిపోయాడు. ఆ తర్వాత పరీక్షగా చూడగా పెద్ద నాగుపాము కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయపడిన రాంబాబు సాగర్ స్నేక్ సొసైటీ నిర్వాహకుడు చీర్ల కృష్ణసాగర్‌కు ఫోన్ చేశాడు. ఆయన అక్కడకు చేరుకొని పామును పట్టుకున్నాడు. పాము పొడవు ఏడు అడుగులు ఉంటుందని తెలిపారు.

కావాలనే ఇరికించారు

- ఆ ఫిర్యాదులో పిటిషనర్ల ప్రస్తావన ఎక్కడా లేదు
- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 2021లో కేసు నమోదైతే ఇప్పుడు నిందితులుగా చేర్చి వేధిస్తున్నారు
- పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేయండి
- హైకోర్టును అభ్యర్థించిన సీనియర్ న్యాయవాదులు
- విచారణ సోమవారానికి వాయిదా



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో తమను ఉద్దేశపూర్వకంగా ఇరికించారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేష్, విజయవాడ నేత దేవినేని అవినాష్, పలువురు కార్యకర్తలు హైకోర్టుకు నివేదించారు. ఫిర్యాదులో ఎక్కడా పిటిషనర్ల పేర్లు లేవని వారి తరపు సీనియర్ న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్ రెడ్డి, ఎల్.రవిచందర్, పాపెల్లుగారి వీరారెడ్డి, న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి తెలిపారు. టీడీపీ పార్టీ కార్యాలయంపై తాము దాడి చేసినట్లు ఫిర్యాదుదారే చెప్పడం లేదని, పోలీసులు మాత్రం తమను నిందితులుగా చేర్చారని పిటిషనర్లు పేర్కొన్నారు. కేసు 2021లో నమోదైతే ఇప్పుడు తమను నిందితులుగా చేర్చి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందన్నారు. సహ నిందితులు ఇచ్చే వాంగ్మూలానికి న్యాయపరంగా ఎలాంటి విలువ లేదని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిందని కోర్టుకు నివేదించారు.

రాజకీయాలకు సామాన్యులు బలి..

మూడేళ్ల తరువాత కేసు విచారణ జరుగుతోందని, ఈ జాప్యానికి కారణాలు ఏమిటో దర్యాప్తు అధికారి చెప్పడం లేదన్నారు. కేసు దర్యాప్తులో జాప్యం ఉండకూడదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో చెప్పిందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అసాధారణ, నిరవధిక జాప్యాన్ని ఈ కోర్టు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు, ప్రభుత్వ పెద్దల రాజకీయాలకు సామాన్యులు బలవుతున్నారని తెలిపారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ కార్యాలయాలపై దాడులు జరిగితే పోలీసులు, ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదన్నారు. నిందితుల తరపున కేసులు వాదించిన న్యాయవాది గవాస్కర్‌ను నిందితునిగా చేర్చారని, రేపు ఈ కేసులు వాదిస్తున్నందుకు తనను కూడా నిందితునిగా చేర్చే అవకాశం ఉందని పొన్నవోలు తెలిపారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకుని పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కోర్టు సమయం ముగియడంతో న్యాయస్థానం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా

బ్యాకప్‌గా ప్రశాంత్ బాలకృష్ణన్


శుభాన్షు శుక్లా


ప్రశాంత్ బాలకృష్ణన్

న్యూఢిల్లీ: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా సారథ్యంలో భారతీయ వ్యోమగామి త్వరలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగుపెట్టబోతున్నాడు. ఇందుకోసం భారతవాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను ఎంపికచేశారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మానవసహిత అంతరిక్ష వ్యోమనౌక కేంద్రం (హెచ్ఎస్ఎఫ్‌సీ), నాసా, అమెరికాకు చెందిన ఆక్సియమ్ స్పేస్ సంస్థల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా గగనయాత్రికులను నాసా ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లనుంది. మిషన్ పైలట్‌గా గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా వ్యవహరిస్తారు. అనుకోని పరిస్థితుల్లో ఆయన వెళ్లలేకపోతే బ్యాకప్ మిషన్ పైలట్‌గా మరో గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌ను ఐఎస్ఎస్‌కు పంపిస్తారు. వీరికి ఈ వారంలోనే శిక్షణ మొదలవుతుంది. యాక్సియమ్-4 మిషన్ ద్వారా అక్కడకు వెళ్లే శుక్లా ఐఎస్ఎస్‌లో తోటి వ్యోమగాములతో కలిసి శాస్త్ర పరిశోధనలుచేయడంతో పాటు పలు సాంకేతికతలను పరీక్షించనున్నారు. తర్వాత ఐఎస్ఎస్ ఆవల అంతరిక్షంలోనూ గడిపే అవకాశముంది. శుక్లాతోపాటు ఐఎస్ఎస్‌కు అమెరికా, పోలండ్, హంగేరీల నుంచి ఒకరు చొప్పున వ్యోమగామి రానున్నారు. భారత తన సొంత మానవసహిత అంతరిక్ష ప్రయోగాల కోసం నలుగురిని గత ఏడాదే ఎంపికచేసిన విషయం తెల్సిందే. గగన్‌యాన్ మిషన్ కోసం బెంగళూరులోని ఇస్రో వ్యోమగామి శిక్షణా కేంద్రంలో వీరి శిక్షణ కూడా గతంలో మొదలైంది. ఇటీవల రష్యాలోనూ ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకున్నారు. గగన్‌యాన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి తీసుకెళ్లి తిరిగి సురక్షితంగా సముద్రజలాల్లో దింపాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

5 వేల కి.మీ. దూరం నుంచి శస్త్రచికిత్స



బీజింగ్: అత్యాధునిక వైద్య విధానాలతో అత్యవసర, ఆకస్మిక వైద్య సేవలు సైతం క్షణాల్లో అందుబాటులోకి వస్తాయని నిరూపితమైంది. చైనాలోని మారుమూల కష్కర్ ఛాతి ఆస్పత్రి ఈ ఘటనకు వేదికగా నిలిచింది. 5జీ టెక్నాలజీ సాయంతో వైద్యుడు 5,000 కిలోమీటర్ల దూరంలోని ఊపిరితిత్తుల రోగికి విజయవంతంగా శస్త్రచికిత్సచేయడం విశేషం. టెక్నాలజీకి ఆధునిక వైద్యవిధానాలు జోడిస్తే అద్భుతాలు సంభవిస్తాయని మరోసారి రూఢీ అయింది. వాయవ్య చైనాలోని గ్జిన్‌జియాంగ్ ప్రావిన్స్‌లోని మారుమూల కష్కర్ ఛాతి ఆస్పత్రిలో నూతన 5జీ సర్జికల్ రోబోట్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఊపిరితిత్తుల్లో కణితితో బాధపడుతున్న రోగికి రోబో శస్త్రచికిత్స చేసేందుకు ఇక్కడి నుంచి 5,000 కిలోమీటర్ల దూరంలోని షాంఘై నగరంలోని శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ లూ క్వింగ్‌క్వాన్ సిద్ధమయ్యారు. పలు రోబో చేతులు అమర్చిన 5జీ ఆధారిత రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సునాయసంగా వాడుతూ కేవలం గంటలో రోగి శరీరంలోని కణతిని విజయవంతంగా తొలగించారు.

భారత్‌లోనూ సేవలు మొదలు: ఇలాంటి సేవలు భారత్‌లోనూ అందుబాటులోకి వచ్చాయి. ఎస్ఎస్ఐ మంత్ర ఈ సేవలను చేరువచేసింది. ఐదు రోబో చేతులున్న ఈ వ్యవస్థతో గుండె ఆపరేషన్లనూ చేయొచ్చు. వైద్యుని ముందు 32 అంగుళాల మానిటర్, ఒక 3డీ విజన్ ఉంటాయి. ఇందులో ఒక భద్రతా కెమెరానూ బిగించారు. ఆపరేషన్ చేస్తూ వైద్యుడు మధ్యలో తల పక్కకు తిప్పగానే రోబో ఆపరేషన్‌ను ఆపేస్తుంది. శస్త్రచికిత్సలో ఒక్క సెకన్ కూడా పొరపాట్లు, తప్పిదాలు జరగకూడదనే ఉద్దేశంతో ఈ జాగ్రత్త ఏర్పాటుచేశారు. 8 మిల్లీమీటర్ల సన్నని ఉపకరణాలతో రోబో చేతులు చకచకా ఆపరేషన్ చేసేస్తాయి.


త్వరలో నాపైకి ఈడీ



'చక్రవ్యూహం' ప్రసంగమే కారణం: రాహుల్
చాయ్, బిస్కెట్లతో స్వాగతిస్తానని వెల్లడి

న్యూఢిల్లీ: మరోసారి తనపై ఈడీ దాడులు జరగనున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జోస్యం చెప్పారు. మోదీ సర్కారు తీరును నిశితంగా విమర్శిస్తూ ఇటీవల లోక్‌సభలో తాను చేసిన 'చక్రవ్యూహం' ప్రసంగం వారికి ఈ మేరకు ఆదేశాలందాయన్నారు. ''నా ప్రసంగం సహజంగానే '2 ఇన్ 1'కు నచ్చలేదు. దాని ఫలితంగానే నాపై దాడికి ఈడీ ప్లాన్ చేస్తోంది. ఈడీ లోపలి వ్యక్తులే ఈ మేరకు నాకు ఉప్పందించారు. నేను సిద్ధంగా ఉన్నా. ఈడీకి సాదర స్వాగతం. వారికోసం చాయ్, బిస్కెట్లతో ఎదురు చూస్తుంటా'' అని శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించారు. భారతీయులను మోదీ ఆధునిక చక్రవ్యూహంలో బంధించి నానా సమస్యలపాలు చేస్తున్నారంటూ లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ ఇటీవల దుయ్యబట్టడం తెలిసిందే.

అమిత్ షాపై కాంగ్రెస్ హక్కుల తీర్మానం



న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన విలయంపై ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించామంటూ హోం మంత్రి అమిత్ షా జూలై 31న చేసిన ప్రకటన అబద్ధమని కాంగ్రెస్ పేర్కొంది. సభను తప్పుదోవ పట్టించారంటూ కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్ శుక్రవారం రాజ్యసభలో మంత్రి అమిత్ షాపై హక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'కేరళ ప్రభుత్వానికి ముందే హెచ్చరికలు పంపామంటూ అమిత్ షా చేసిన ప్రకటన అబద్ధమని రుజువైంది. సభను తప్పుదోవ పట్టించడం ద్వారా సభా హక్కుల ఉల్లంఘనకు, సభా ధిక్కారానికి ఆయన పాల్పడ్డారు' అని ఆ నోటీసులో జైరాం రమేశ్ పేర్కొన్నారు.

ఆ 300 మంది ఎక్కడ?

శిథిలాల కింద చిక్కుకుంటే వారిని రక్షించేందుకు వ్యూహం సిద్ధం

బాధితులతో రాహుల్, ప్రియాంక



వయనాడ్/కొల్లామ్: కేరళలో కొండచరియలు పడ్డాక కాపాడండంటూ ఆర్తనాదాలు చేసిన వారిని కాపాడిన సహాయక బృందాలు ఇప్పుడు కనిపించకుండా పోయిన వారిపై ప్రధానంగా దృష్టిపెట్టాయి. ప్రకృతి వినాశక విశాల ఘటనాప్రాంతాల్లో ఇంకా వస్తున్న సెల్‌ఫోన్ సిగ్నళ్ల సాయంతో మనుషుల జాడను గుర్తించే అత్యాధునిక పరికరాలను తెప్పిస్తున్నారు. సెల్‌ఫోన్ చివరి లొకేషన్‌ను అత్యంత ఖచ్చితత్వంతో చూపించే గూగుల్ జీపీఎస్ కోఆర్డినేట్స్, డ్రోన్ ఏరియల్ ఫొటోల సాయంతో శిథిలాలు, కూలిన చెట్లు, బండరాళ్ల మధ్యలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నం చేయనున్నారు. ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ కుగ్రామాల్లో మరణాల సంఖ్య తాజాగా 300 దాటింది. గుర్తు తెలియని మృతదేహాలకు సామూహిక దహనసంస్కారాలు చేస్తున్నారు.

బృందాలుగా ఏర్పడి బరిలోకి..
దాదాపు 300 మంది జాడ ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు. కొండచరియలు పడి విస్తరించిన మొత్తం ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. శునకాలతోపాటు స్థానికులు, అటవీశాఖ సిబ్బంది మొత్తం 40 బృందాలుగా ఏర్పడి గాలింపు ముమ్మరంచేశారు. అత్తమల అరాన్‌మల, ముండక్కై, పుంచిరిమట్టం, వెల్లరిమల, జీవీహెచ్ఎస్ఎస్ వెల్లరిమల, నదీతీరం ఇలా కొండచరియల ప్రభావిత ప్రాంతాలను ఆరు జోన్లుగా విభజించారు. ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, డీఎస్‌జీ, కోస్ట్‌గార్డ్, నేవీ, స్థానిక యంత్రాంగం, కేరళ పోలీసులు, స్థానికులు, అటవీ సిబ్బంది, గజ ఈతగాళ్లు సంయుక్తంగా ఈ సంక్లిష్టమైన రెస్క్యూ ఆపరేషన్‌ను మొదలుపెట్టారు. డ్రోన్ ఆధారిత అత్యాధునిక రాడార్‌ను ఢిల్లీ నుంచి తేనున్నారు. 190 అడుగుల బెయిలీ తాత్కాలిక వంతెన నిర్మాణం పూర్తవంతో భారీ యంత్రాలను తెచ్చేందుకు మార్గం సుగమమైంది.

కేంద్రం శ్రద్ధతో పట్టించుకోవాలి: రాహుల్
గురువారం ఘటనాస్థలిని పరిశీలించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం సైతం పనులను పర్యవేక్షించారు. ''ఇది పెను విషాదం. ఈ ఉదంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో పట్టించుకోవాలి. బాధిత కుటుంబాలకు వేరే ప్రాంతాల్లో శాశ్వత పునరావాసం కల్పించాలి'' అన్నారు. వారికి కాంగ్రెస్ 100 ఇళ్లు కట్టిస్తుందన్నారు.

నిక్షేపంగా ఇల్లు, కుటుంబం

ఇంతటి విలయం మధ్య ఒక ఇల్లు నిక్షేపంగా ఉండటం రెస్క్యూ టీమ్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. పడవెట్టు కున్ను ప్రాంతంలో భారీ కొండచరియలు పడినా అక్కడి ఒక ఇల్లు మాత్రం దెబ్బతినలేదు. అయితే చుట్టుపక్కల అంతా కొండచరియలు పడిన భయానక దృశ్యాన్ని చూసిన ఆ ఇంట్లోని నలుగురు కుటుంబసభ్యులు ప్రాణభయంతో మంగళవారం నుంచి ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఫలానా ప్రాంతంలో తమ వారి జాడ తెలీడం లేదని బంధువులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న హెలికాప్టర్ బృందం సురక్షిత ప్రాంతానికి తరలించిందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి.



మేజర్ సీతకు సలామ్

కఠిన, విపత్కర, తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో మహిళలు పనిచేయడం కష్టమనే భావనను ఒక్క ఫొటోతో చెదరగొట్టిన ఆర్మీ మేజర్ సీత అశోక్ శెల్కేకు అందరూ మెచ్చుకుంటున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నది మీదుగా 190 అడుగుల బెయిలీ వంతెనను నిర్మించాల్సిన బాధ్యతను మద్రాస్ ఇంజనీర్ గ్రూప్, సెంటర్ తలకెత్తుకుంది. మేజర్ సీత సారథ్యంలోని జవాన్ల బృందం రేయింబవళ్లూ పనిచేసి 31 గంటల్లోపు వంతెనను నిర్మించింది. వంతెన నిర్మాణ పనుల్లో నిమగ్నమైన మేజర్ సీత ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'భారత సైన్యం తరఫున ఇక్కడికొచ్చి సాయ పడుతున్నందుకు నాక్కూడా గర్వంగా ఉంది. నన్ను నమ్మి ఇంతటి బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులకు, సాయపడిన స్థానికులకు నా కృతజ్ఞతలు' అని సీత అన్నారు. సీత సొంతూరు మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ దగ్గర్లోని గడిల్‌గావ్.

పరిమళించిన మానవత్వం

రూ.10 వేలు దానమిచ్చిన చిరు టీస్టాల్ యజమానురాలు

సర్వం కోల్పోయిన శిబిరాల్లో తలదాచుకుంటున్న వారికి చిన్నపాటి టీస్టాల్ యజమానురాలు సైతం తనవంతు సాయంచేసి దానగుణాన్ని చాటారు. రోడ్డు పక్కన టీ అమ్ముకునే వృద్ధ మహిళ సుబేదా కేరళ విలయ బాధితులకు తనవంతుగా రూ.10,000 ఇచ్చారు. ఈమె దానగుణం చూసి అందరూ మెచ్చుకుంటున్నారు. ''బ్యాంక్ రుణం కట్టేందుకే ఈ డబ్బు దాచా. టీవీలో విషాదవార్త విని మనసు చలించింది. నెలవారీ కిస్తీ(ఈఎంఐ) తర్వాత కడదాం.. ముందు వీళ్లను ఆదుకుందాం అని భర్త సైతం నాకు మద్దతు పలికారు. ఆరోగ్యం సహకరించక వయనాడ్‌దాకా వెళ్లి స్వయంగా ఇచ్చే ఓపికలేక కలెక్టరేట్‌కు వెళ్లి ముఖ్యమంత్రి విపత్తు సహాయనిధిలో జమచేశా' అని సుబేదా చెప్పారు. వరద బాధితుల సహాయార్థం గతంలోనూ ఈమె తన నాలుగు మేకలను అమ్మేసి వచ్చిన నగదును విరాళంగా ఇచ్చారు.

మౌలిక ప్రాజెక్టులపైనే పిల్స్ ఎందుకు?

విస్మయం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కీలకమైన రహదారులు వంటి మౌలికరంగ ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్న సమయంలో వాటిని ఆపాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యా(పిల్)లు దాఖలు కావడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. గోవాలో వాస్కోడగామా- కులెం సెక్షన్‌లో రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ కీలకమేనన్న ధర్మాసనం..'హిమాచల్‌లో రోడ్డు పనులపై పిల్ వేశారు. ప్రధాన రహదారులు, హైవేలపై కూడా పిల్‌లు వస్తున్నాయి. మన దేశంలో మాత్రమే ఎందుకిలా జరుగుతోంది?'అని ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రైలు సౌకర్యం లేని అంతర్జాతీయ రిసార్టు ఏదైనా ఉందా? అని పిటిషనర్‌ను నిలదీసింది. రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులను సవాల్ చేస్తూ దాఖలైన ఇదే పిల్‌ను ముంబై హైకోర్టు గోవా ధర్మాసనం కొట్టేయడాన్ని సమర్థించింది.


ఎలక్టోరల్ బాండ్లపై విచారణ చేయించలేం
ఎలక్టోరల్ బాండ్ల పథకంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ చేయించాలంటూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సంబంధం లేని అంశంపై దర్యాప్తునకు ఆదేశించలేమని శుక్రవారం స్పష్టం చేసింది. కాంట్రాక్టులు కట్టబెట్టినందుకు బదులు(క్విడ్ ప్రొక్వో)గా వ్యక్తులు, సంస్థల నుంచి రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్లను తీసుకున్నాయన్న కేవల ఊహాజనితాల ఆధారంగా రిటైర్డు న్యాయమూర్తితో దర్యాప్తునకు ఆదేశించడం తొందరపాటు, అసందర్భ చర్య అవుతుందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డీవాలా ధర్మాసనం విచారణ సందర్భంగా పేర్కొంది.

కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైంది. శుక్రవారం పార్టీ డెలిగేట్ల ఆన్‌లైన్ పోలింగ్ మొదలైన నేపథ్యంలో ఆమె మెజారిటీ ఓట్లను గెల్చుకున్నారు. దాంతో అభ్యర్థిత్వం ఖరారైంది. ''పార్టీ నామినీగా ఎన్నికవడం గౌరవంగా భావిస్తున్నా. వచ్చే వారం నా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా స్వీకరిస్తా. దేశంమీద ప్రేమతో ఏకమైన ప్రజల కోసం ఇకపై ప్రచారం చేస్తా'' అన్నారు. అమెరికా చరిత్రలో అధ్యక్ష అభ్యర్థిత్వం సాధించిన తొలి శ్వేతజాతీయేతర మహిళగా, తొలి భారతీయ అమెరికన్‌గా కమల చరిత్ర సృష్టించారు. ఆగస్టు 22న షికాగో జరిగే డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో కమల తన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా అంగీకరిస్తారు. అభ్యర్థిత్వం స్వీకరించాక కొద్దిరోజులకు ఆమె తన రన్నింగ్‌మేట్ పేరును ప్రకటిస్తారు.

ఇజ్రాయెల్ భద్రతకు బైడెన్ పూచీ



వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మాట్లాడారు. ఇజ్రాయెల్ భద్రతకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఇరాన్, దాని మిత్రదేశాలు, ఉగ్రవాద సంస్థల నుంచి ఇజ్రాయెల్‌పై దాడుల మొదలైతే దీటుగా తిప్పికొడతామని చెప్పారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు.

టెల్ అవీవ్‌కు విమానాలు రద్దు: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల దృష్ట్యా ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఈ నెల 8వ తేదీ దాకా విమానాల రాకపోకలు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది.

ఇవేం బెయిల్ షరతులు!

దిగువ కోర్టుల తీరుపై సుప్రీం విస్మయం

న్యూఢిల్లీ: వైవాహిక విభేదాల కేసుల్లో ముందస్తు బెయిల్ షరతుల విషయంలో కోర్టులు అసాధ్యమైన షరతులు విధిస్తున్నాయంటూ సుప్రీంకోర్టు ఆవేదన వెలిబుచ్చింది. వరకట్న నిషేధ తదితర చట్టాల కింద ఆరోపణలెదుర్కొంటున్న ఓ వ్యక్తికి పట్నా హైకోర్టు విధించిన ముందస్తు బెయిల్ షరతులపై ధర్మాసనం శుక్రవారం విస్మయం వెలిబుచ్చింది. దంపతులు కలిసుండేందుకు ఒప్పుకోవడంతో దిగువ కోర్టు వారిని ఉమ్మడి అఫిడవిట్ వేయాలని ఆదేశించింది. విడాకుల పిటిషన్ వెనక్కి తీసుకునే షరతుపై పిటిషనర్‌కు బెయిలిచ్చేందుకు అంగీకరించింది. అయితే, 'గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు, ఆమె శారీరక, ఆర్థిక అవసరాలన్నిటినీ తీర్చుతానని హామీ ఇవ్వండి' అని షరతు పెట్టింది. దీన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ షరతును తొలగిస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి ఆచరణ సాధ్యం కాని షరతులను ఇవ్వొద్దని కోర్టులకు సూచించింది. గౌరవంగా జీవించే హక్కును గుర్తించాలని, విచారణ న్యాయబద్ధంగా సాగేలా చూడాలని కోరింది.

మళ్లీ 'నీట్'కు ఆదేశించలేం: సుప్రీం

- వ్యవస్థీకృత లీకేజీకి రుజువుల్లేవ్
- పరీక్ష సమగ్రత దెబ్బతినలేదు

న్యూఢిల్లీ: నీట్-యూజీ 2024 పరీక్ష సమగ్రతకే తూట్లు పొడిచేంతటి భారీ స్థాయిలో వ్యవస్థీకృత లీకేజీ జరిగినట్టు ఇప్పటికైతే ఎలాంటి రుజువులూ లేవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశించలేమని స్పష్టం చేసింది. సీజేఐ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్డీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. ధర్మాసనం తరఫున సీజేఐ 63 పేజీల తీర్పు రాశారు. ''సోషల్ మీడియా, ఇంటర్నెట్ వంటివాటి ద్వారా ప్రశ్నపత్రాన్ని విస్తృతంగా లీక్ చేశారనేందుకు ఎలాంటి ఆధారాలూ లేవు. లీకేజీ ప్రధానంగా పట్నా, హజారీబాగ్ ప్రాంతాలకే పరిమితమైనట్టు తేలింది. తద్వారా లబ్ధి పొందిన విద్యార్థులను గుర్తించడం కష్టమేమీ కాదు. వారెంత మందో సీబీఐ దర్యాప్తు ఇప్పటికే తేల్చింది. కనుక మళ్లీ పరీక్ష నిర్వహించడం అనవసరం. పైగా దానివల్ల ఈ దశలో విద్యా సంవత్సరం దెబ్బ తింటుంది'' అని పేర్కొన్నారు.

ఎన్‌టీఏకి తలంటిన సీజేఐ
నీట్-యూజీ వంటి కీలక పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వ్యవహరించిన తీరు దారుణమని సీజేఐ దుయ్యబట్టారు. ముందు తప్పుడు నిర్ణయాలు తీసుకుని తర్వాత దిద్దుబాటుకు దిగడం దారుణమన్నారు. ''లక్షలాది మంది విద్యార్థులు హాజరయ్యే జాతీయ స్థాయి పోటీ పరీక్షల నిర్వహణ బృహత్తర కార్యక్రమమే. అందుకు భారీ వనరులు, సమన్వయం, ప్రణాళిక అవసరం. మేమేమీ కాదనడం లేదు. కానీ ఎన్‌టీఏ వంటి సంస్థలను ఏర్పాటు చేసింది అందుకే కదా! ఈసారి జరిగిన తప్పిదాలను నివారించేందుకు కావాల్సినన్ని నిధులు, సమయం ఎన్‌టీఏకు అందుబాటులో ఉన్నాయి. కనుక ఒకే కేంద్రంలో భారీ సంఖ్యలో అభ్యర్థులను అనుమతించడం వంటివి లీకేజీకి కారణాలని చెప్పడం కుదరదు. పైగా హజారీబాగ్ పరీక్ష కేంద్రంలో భద్రతా వైఫల్యమూ చోటుచేసుకుంది. స్ట్రాంగ్ రూం వెనక తలుపు తెరిచి అనధికార వ్యక్తులు ప్రశ్నపత్రాలను చేజిక్కించుకున్నారు. వాటిని ఇ-రిక్షాల్లో తరలించుకుపోయి అభ్యర్థుల చేతిలో పెట్టారు. ఫలితంగానే 67 మందికి నూరు శాతం మార్కులొచ్చాయి. అనుమానితులైన 1,563 మందికి తిరిగి పరీక్ష పెడితే ఆ సంఖ్య అంతిమంగా 17కు తగ్గింది. అది కూడా అభ్యర్థుల ఆక్రందనలు, మీడియా రిపోర్టులు, కోర్టు జోక్యం అనంతరం! ఇలాంటి వాటితో నిమిత్తం లేకుండానే ప్రజలు విశ్వసించేలా పనితీరు ఉండాలి. ఇకనైనా మరింత జాగరూకంగా ఉండండి'' అంటూ ఎన్‌టీఏను మందలించారు. తీర్పులో పేర్కొన్న అన్ని అంశాలపైనా దృష్టి పెట్టి ఇకపై పరీక్షల నిర్వహణ పూర్తిగా దోషరహితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు సిఫార్సు చేసే విషయంలో ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకోవాలని రాధాకృష్ణన్ ప్యానెల్‌ను సీజేఐ నిర్దేశించారు. అభ్యర్థుల గుర్తింపు నిర్ధారణ పద్ధతిని లోపరహితం చేయడం, పరీక్షల నిర్వహణ, ప్రక్రియ తాలూకు భద్రత, డేటా సెక్యూరిటీ తదితరాలపైనా సిఫార్సులు చేయాలని నిర్దేశించారు.

గవర్నర్లే వారధి

కేంద్ర, రాష్ట్ర బంధాల్లో కీలకం: మోదీ

న్యూఢిల్లీ: కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య గవర్నర్లు వారధిగా పనిచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయంలో వారిది అతి కీలక పాత్ర అన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అధ్యక్షతన శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైన రెండు రోజుల గవర్నర్ల సదస్సులో మోదీ మాట్లాడారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత గవర్నర్లపై ఉందని మోదీ చెప్పారు. బడుగు బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం వహించే సామాజిక సంస్థలతో, ప్రజలతో మాట్లాడుతూ ఉండాలని పేర్కొన్నారు. శక్తివంతమైన పదవిలో ఉన్న గవర్నర్లు రాజ్యాంగం పరిధిలో ప్రజా సంక్షేమానికి, ముఖ్యంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుందని మోదీ వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా కొనసాగాలంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు రాష్ట్రాలతో సమన్వయంతో పని చేయాలని ముర్ము చెప్పారు.

ఇంకా నయం, వరద నీటిపై కేసు పెట్టలేదు!

ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు • సివిల్స్ అభ్యర్థుల మృతి కేసు సీబీఐకి

న్యూఢిల్లీ: రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో నీట మునిగి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతిచెందిన కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తును పర్యవేక్షించడానికి సీనియర్ అధికారిని నియమించాలని కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు సూచించింది. పోలీసు శాఖతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ''బాధ్యత వహించాల్సిన అధికారులను వదిలేసి అటుగా వాహనంలో వెళ్తున్న అమాయకునిపై కేసు పెట్టారు. ఇంకా నయం, బేస్‌మెంట్‌లోకి పోటెత్తిందంటూ వరద నీటిపై కేసు పెట్టలేదు!'' అని వ్యాఖ్యానించింది.

అతని కోసం ఎందాకైనా...!

క్రషికోవ్... రష్యా టాప్ హిట్‌మాన్

జర్మనీ ఖైదు నుంచి విడిపించుకున్న పుతిన్

రష్యా చరిత్రలోనే అతి పెద్ద ఖైదీల మార్పిడి


మాస్కో విమానాశ్రయంలో క్రషికోవ్‌కు పుతిన్ స్వాగతం

2024 ఆగస్టు 1. మాస్కో అంతర్జాతీయ విమానాశ్రయం. అప్పుడే లాండైన విమానం నుంచి 8 మంది ప్రత్యేక భద్రత మధ్య బయటికి వచ్చారు. వారిలో ఒకరిని రిసీవ్ చేసుకునేందుకు ఏకంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతినే విమానాశ్రయం దాకా వచ్చారు. సదరు 'వీఐపీ'కి షేక్‌హాండ్ ఇచ్చి మరీ సాదరంగా స్వాగతించారు.

సరిగ్గా ఐదేళ్ల క్రితం. 2019 ఆగస్టు. జర్మనీ రాజధాని బెర్లిన్. చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ కార్యాలయానికి, పార్లమెంటుకు కూతవేటు దూరంలో ఉన్న ఓ పార్కు. సైకిల్‌పై వస్తున్న ఓ వ్యక్తి ఉన్నట్టుండి తుపాకీ తీశాడు. తన ముందు నడుస్తున్న మాజీ చెచెన్ రెబెల్ జెలీంఖాన్ ఖాన్‌గోష్విలిని టపీమని కాల్చేశాడు. చుట్టుపక్కల వాళ్లు షాక్ నుంచి తేరుకునే లోపే క్షణాల్లో మాయమైపోయాడు. సైకిల్‌ను పక్కనే ఉన్న నదిలో పారేశాడు. విగ్గు తీసి, నీట్‌గా షేవ్ చేసుకుని ఎవరూ గుర్తించలేనంతగా రూపం మార్చుకున్నాడు. విధి వక్రించి ప్రత్యక్ష సాక్షులు గుర్తించడంతో కాసేపటికే పట్టుబడి జీవితఖైదు అనుభవిస్తున్నాడు.

- నాడు జర్మనీలో జీవితఖైదుకు గురైందీ, నేడు మాస్కోలో పుతిన్ నుంచి ఘనస్వాగతం అందుకున్నదీ ఒక్కడే. అతనే... వదీం క్రషికోవ్. పేరుమోసిన రష్యా హిట్‌మ్యాన్.

జెలీంఖాన్ ఒక్కడినే కాదు, రష్యాకు కంట్లో నలుసుగా మారిన వాళ్లెందరినో క్రషికోవ్ వెంటాడి వేటాడాడు. విదేశీ గడ్డపై ఇలాంటి అసైన్‌మెంట్లను సైలెంట్‌గా పూర్తి చేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. రష్యా గూఢచర్య సంస్థ ఎఫ్ఎస్‌బీలో చేరిన కొన్నాళ్లకే టాప్ రేటెడ్ హిట్‌మ్యాన్‌గా పేరు సంపాదించాడు. ముఖ్యంగా పుతిన్‌కు అత్యంత ఇష్టునిగా మారాడు. అందుకే అతన్ని విడిపించుకోవడాన్ని ఆయన సవాలుగా తీసుకున్నారు. జెలీంఖాన్ హత్యతో తనకు సంబంధమే లేదని విచారణ పొడవునా క్రషికోవ్ బుకాయించినా, అది అతని పనేనని పుతిన్ అధికారికంగానే అంగీకరించారు. క్రషికోవ్‌ను 'గొప్ప దేశభక్తుని'గా అభివర్ణించారు. అతని కోసం సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికాతో చరిత్రలోనే అతి పెద్ద ఖైదీల మార్పిడికి కూడా అంగీకరించారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ రిపోర్టర్ ఇవాన్ గెర్షకోవిచ్, మాజీ మెరైన్ పాల్ వీలన్, రష్యా అసమ్మతివాది వ్లాదిమిర్ కారా ముర్జా సహా 16 మందిని వదిలేశారు. బదులుగా అమెరికా, జర్మనీ, పశ్చిమ దేశాల నుంచి క్రషికోవ్‌తో పాటు 8 మంది రష్యన్లను విడిపించుకున్నారు. వారిలో మరో ఇద్దరు అండర్ కవర్ ఏజెంట్లున్నారు. తద్వారా, విదేశాల్లో ఇలాంటి ఆపరేషన్లు చేసే క్రమంలో దొరికిపోయినా అధ్యక్షుడు తమను కాపాడి తీరతారని నిఘా విభాగం ఏజెంట్లకు ధీమా ఏర్పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. పుతిన్ ఆశించింది కూడా అదేనని వారంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

క్షిపణి దాడి కాదది...

బెడ్రూంలో బాంబు



హనియే హత్య వెనక మతిపోయే ప్లాన్

- రెణ్నెల్ల ముందే అమర్చిన ఇజ్రాయెల్
- గదిలోకి వెళ్తూనే రిమోట్‌తో పేల్చివేత

'జింకను వేటాడేప్పుడు పులి ఓపికగా ఉంటది. అదే పులినే వేటాడాల్సొస్తే?! ఇంకెంత ఓపిక కావాలి?' ఇది ఓ సినిమాలోని డైలాగ్. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేపై దాడి కోసం ఇజ్రాయెల్ నిఘా విభాగం మొసాద్ కూడా అచ్చం అలాగే ఓపిక పట్టింది. అది కూడా ఒక రోజో, రెండ్రోజులో కాదు.. ఏకంగా రెండు నెలలకు పైగా! ఆయన బస చేస్తారని భావించిన ఇంట్లో అప్పటికే బాంబు అమర్చి ఉంచింది. ఏ బెడ్రూంలోకి వెళ్తాడో పక్కాగా తెలుసుకుని మరీ అందులోనే బాంబును సిద్ధం చేసి పెట్టింది. అలా హనియే కోసం ముందస్తుగానే కాచుకుని కూచున్న మృత్యువు, సమయం రాగానే అమాంతంగా మింగేసింది..!

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో గత బుధవారం తెల్లవారుజామున జరిగిన పేలుడులో హనియే మరణించారు. అత్యంత కచ్చితత్వంతో కూడిన ఇజ్రాయెల్ క్షిపణి దాడే అందుకు కారణమని తొలుత వార్తలొచ్చాయి. క్షిపణిలాంటి వస్తువేదో హనియే గది కిటికీని తాకడాన్ని ప్రత్యక్ష సాక్షులు చూశారని కొందరు చెప్పారు. అది క్షిపణి దాడేనని ఇరాన్ కూడా ఆరోపించింది. టెహ్రాన్‌లో కట్టుదిట్టమైన రక్షణలో ఉండే గెస్ట్ హౌస్‌ను హనియేకు కేటాయించారు. అలాంటి గెస్ట్ హౌస్‌పై సుదూరం నుంచి అంతటి కచ్చితత్వంతో క్షిపణి దాడి సాధ్యమేనా? పైగా క్షిపణి దాడితో భారీ విధ్వంసం జరుగుతుంది. కానీ ఆ గెస్ట్ హౌస్‌కు అంతటి నష్టమేమీ జరగలేదు. గది, పరిసర భాగాలే బాగా దెబ్బతిన్నాయి. అదే భవనంలో పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ నాయకుడు జియాద్ అల్ నఖలా బస చేసిన పక్క గది కూడా దెబ్బ తినలేదు. కనుక ఎలా చూసినా జరిగింది క్షిపణి దాడి కాదు.

వామ్మో ఇజ్రాయెల్!
హనియే మృతికి గది లోపలి పేలుడే కారణమని ఇరాన్ అధికారులు ఎట్టకేలకు గుర్తించారు. ఆ గదిలో రెండు నెలల కిందే బాంబు పెట్టారని తెలుస్తోంది. ఇరాన్ భద్రతలోని లోపాలనే అందుకు అనువుగా మార్చుకున్నారు. బాంబు పెట్టి రెండు నెలలపాటు ఓపికగా నిరీక్షించారు. ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు హనియే టెహ్రాన్ చేరుకున్నారు. అది ముగిశాక గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆ గదిలోకే వెళ్లినట్టు పక్కాగా నిర్ధారించుకున్న తర్వాతే రిమోట్‌తో బాంబు పేల్చారు. పేలుడు ధాటికి భవనం ఒక్కసారిగా కదిలిపోయింది. గోడలో కొంత భాగం కూలింది. కిటికీలు పగిలాయి. పేలుడు తీవ్రతకే హనియే మృతి చెందారు. ఈ కోవర్ట్ ఆపరేషన్ వివరాలన్నింటినీ పాశ్చాత్య అధికారులతో మొసాద్ పంచుకుందని న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక పేర్కొంది. దేశం వెలుపల రాజకీయ ప్రత్యర్థులు తదితర టార్గెట్ల ఏరివేతకు మొసాద్ పాల్పడుతోంది. ఇజ్రాయెల్‌పై హమాస్ అక్టోబర్ 7 దాడుల తర్వాత దాని అగ్ర నేతలందరినీ వేటాడతామని ప్రధాని నెతన్యాహుతో పాటు మొసాద్ చీఫ్ డేవిడ్ బర్నియా కూడా ప్రతిజ్ఞ చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్యసభలో నవ్వులు పూయించిన జయ


రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్


జయా బచ్చన్

న్యూఢిల్లీ: రాజ్యసభలో వాడివేడి చర్చ కొనసాగుతున్న వేళ ఒక్కసారిగా నవ్వులు విరబూశాయి. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ తన పేరును గతంలో ఒకలా, ఇప్పుడు మరొకలా సంబోధించడమే ఇందుకు అసలు కారణం. గతంలో ఏం జరిగిందంటే.. రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ సింగ్ చర్చలో మాట్లాడాల్సిందిగా జయాబచ్చన్‌ను 'జయా అమితాబ్ బచ్చన్' అని పలికారు. వెంటనే ఆగ్రహంతో ఊగిపోయిన జయాబచ్చన్.. 'అమితాబ్ పేరును నాకెందుకు జోడిస్తున్నారు?. నాకంటూ సొంత గుర్తింపు లేదా? మహిళను భర్త పేరును కలిపి పిలవడం చాలా తప్పు. మహిళకు గుర్తింపు రావాలంటే భర్త పేరు వాడాల్సిందేనా? అంటూ ఆగ్రహంగా మాట్లాడారు. దీంతో హరివంశ్ కల్పించుకుని.. ' జయా మేడమ్.. మీరే స్వయంగా అఫిడవిట్‌లో పేరును అలా రాశారు. నేనేమీ కొత్తగా జతచేయలేదు' అన్నారు. చేసేది లేక శుక్రవారం తన పేరును పూర్తిగా పలికారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పిలవగానే లేచి, 'నేను జయా అమితాబ్ బచ్చన్‌ను మాట్లాడుతున్నా' అని అనగానే పాత విషయం గుర్తొచ్చి ధన్‌ఖడ్ ఘొల్లున నవ్వారు. జయ కూడా గట్టిగా పగలబడి నవ్వారు. దీంతో సభలో వారంతా నవ్వుల్లో మునిగిపోయారు.

అదుపు తప్పిన 'సారథి'



ఏలూరు జిల్లా నూజివీడులోని ఆర్టీసీ డిపోకు 2 నూతన లగ్జరీ బస్సులు రాగా వాటిని మంత్రి పార్థసారథి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఓ బస్సును ఆయన బస్టాండ్ ఆవరణలో నడిపారు. డ్రైవింగ్ చేస్తుండగా బస్సు అదుపు తప్పడంతో అదే మార్గంలో నిలిపి ఉంచిన పోలీసు జీపును మంత్రి ఢీకొట్టారు. దీంతో బస్సుకు ఎడమ వైపు ముందు భాగంలో హెడ్‌లైట్ దెబ్బతింది. ప్రమాద సమయంలో జనం ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. - నూజివీడు

టార్గెట్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

దెబ్బ కొట్టాలని ప్రయత్నించారు. జగన్ తరువాత ఎక్కువ కేసులు నామీదే ఉన్నాయి. నామీద ఐదు సీబీఐ కేసులు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గిఫ్ట్ కాదా ఇది? ఏ తప్పూ చేయని నేను ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నా. వైఎస్ రాజశేఖరరెడ్డి నన్ను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొచ్చారనే కారణంతో.. నామీద ఐదు సీబీఐ కేసులు బనాయించినా 24 ఏళ్ల రాజకీయ జీవితంలో 20 ఏళ్లు ఆ పార్టీలోనే పనిచేశా' అని చెప్పారు. మహిళలంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గౌరవం లేదన్నారు

కాంగ్రెస్‌లో ఉంటే జగన్ కేంద్రమంత్రి, ఆ తర్వాత ముఖ్యమంత్రి కూడా అయ్యేవారు

యూపీఏ హయాంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న గులాం నబీ ఆజాద్ సైతం వైఎస్ జగన్‌పై అక్రమ కేసుల వెనుక ఉన్న కుట్రను బయటపెట్టారు. ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఆయన గతంలోనే మీడియా ప్రతినిధులకు అసలు విషయాన్ని వెల్లడించారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కొనసాగి ఉంటే కేంద్ర మంత్రి అయ్యేవారు, ఆ తర్వాత ముఖ్యమంత్రి కూడా అయ్యేవారు'. అని ఆజాద్ వ్యాఖ్యానించారు. తద్వారా కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం వల్లే వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు నమోదు చేశారన్న వాస్తవాన్ని బహిర్గతం చేశారు. కాంగ్రెస్‌లో కొనసాగి ఉంటే అక్రమ కేసులు ఉండేవి కావు.. పైగా జగన్ కేంద్ర మంత్రి కూడా అయ్యేవారు అని ఆనాడే స్పష్టం చేశారు.

- గులాం నబీ ఆజాద్

అధిష్టానం చెబితేనే పిటిషన్ దాఖలు చేశా

వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు బనాయించేందుకు కాంగ్రెస్ పార్టీ పావుగా వాడుకున్న దివంగత మాజీ మంత్రి శంకర్‌రావు కూడా గతంలోనే ఆ కుట్రను బయటపెట్టడం గమనార్హం. జగన్‌కు వ్యతిరేకంగా శంకర్‌రావుతో న్యాయస్థానంలోపిటిషన్ దాఖలు చేయించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఈ కుట్రలకు తెర తీసింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో శంకర్‌రావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 'సాక్షాత్తూ సోనియా గాంధీ ఆదేశించడంతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశా' అని స్పష్టం చేశారు.

- కాంగ్రెస్ మాజీ మంత్రి శంకర్‌రావు

కాంగ్రెస్‌లో ఉంటే మంచోడే

ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన దివంగత వీరప్ప మొయిలీ సైతం వైఎస్ జగన్‌పై అక్రమ కేసుల వెనుక లోగుట్టును గతంలోనే బయటపెట్టారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగి ఉంటే మంచి వ్యక్తే. ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం దురదృష్టకరం' అని నాడు మీడియాతో వ్యాఖ్యానించారు.

- వీరప్ప మొయిలీ

మా వాళ్లకు ఇవ్వాల్సిందే

- అంగన్‌వాడీ ఉద్యోగుల్ని తొలగించండి
- అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు
- వర్కర్స్ భర్తలను చంపేస్తామంటూ బెదిరింపులు
- కొండాపురంలో ఐదుగురి రాజీనామా
- మైలవరంలో 22 మందిని తొలగించేందుకు ప్రయత్నాలు
- జమ్మలమడుగు నియోజకవర్గంలో తారస్థాయికి చేరిన నేతల ఆగడాలు

టాస్క్‌ఫోర్స్: 'మా పార్టీకోసం పనిచేసినవారికి ఉపాధి కల్పించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలుగా, ఆయాలుగా నియమించాలి. ఇప్పుడు పనిచేస్తున్నవారిని తొలగించండి. మా వాళ్లకు ఆ పోస్టులు ఇవ్వండి..' అంటూ వైఎస్సార్ జిల్లాలో ఎన్‌డీఏ కూటమికి చెందిన పలువురు రాజకీయ నాయకులు ఐసీడీఎస్ అధికారులను తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. ఉద్యోగాలు మానేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను బెదిరిస్తున్నారు. ముఖ్యంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఈ ఒత్తిళ్లు, బెదిరింపులు ఎక్కువయ్యాయి. వీటికి లొంగని వారిని లక్ష్యంగా చేసుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయడంలేదంటూ ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులపై చర్యలు తీసుకుని వారిని తొలగించాలని అధికారుల మీద ఒత్తిడి తెస్తున్నారు. నియోజకవర్గంలోని జమ్మలమడుగు, ముద్దనూరు ఐసీడీఎస్‌ల పరిధిలో ఈ వేధింపులు ఎక్కువయ్యాయి. ముద్దనూరు ఐడీసీఎస్ పరిధిలోని కొండాపురం మండలంలో రాజకీయ నాయకులు ఒత్తిళ్లు, బెదిరించడంతో ఐదుగురు అంగన్‌వాడీ ఉద్యోగులు రాజీనామా చేశారు. రాజీనామా చేయాలని, లేకపోతే మీ భర్తలకు మూడుతుందంటూ కొందరు కార్యకర్తలు, ఆయాలను బెదిరిస్తున్నారు. దీంతో వారు భయాందోళనలు చెందుతున్నారు. జమ్మలమడుగు ఐసీడీఎస్ పరిధిలోని మైలవరం మండలంలో 22 మందిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల చిన్న కొమెర్ల గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలను తొలగించాలంటూ స్థానిక నాయకులు నియోజకవర్గ నేతల వద్ద పంచాయితీ పెట్టడంతో వామపక్షాల నాయకులు అడ్డుపడినట్లు తెలిసింది. గత పాలనలో ఇలా ఎప్పుడూ జరగలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోరాడతాం

ఎవరైనా కొత్తగా వచ్చిన వారిని తొలగించుకుంటే తమకు అభ్యంతరం లేదని, 20–30 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఇబ్బందిపెడితే పోరాడతామని సీఐటీయు, సీపీఐ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ వేధింపులు, బెదిరింపులు ఆపకపోతే ప్రభుత్వానికి, స్థానిక నాయకులకు వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్ష పార్టీలు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సన్నద్ధం అవుతున్నారు.

నవరత్నాల శిలాఫలకం ధ్వంసం



కొయ్యలగూడెం: టీడీపీ కూటమి నేతల అరాచకాల్లో భాగంగా.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం బయ్యనగూడెం సచివాలయంపై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శుక్రవారం ధ్వంసం చేశారు. నవరత్నాల పథకాలకు సంబంధించిన శిలాఫలకంపై జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఉండడం ఏమిటంటూ.. కూటమి పార్టీ శ్రేణులు సుత్తులతో ఫలకాన్ని పగుల గొట్టారు. పంచాయతీ పాలకవర్గ సభ్యుల కళ్లెదుటే దుర్భాషలాడుతూ పైశాచికానందం పొందారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి జెట్టి గుర్నాథరావు దీనిని ఖండిస్తూ.. దాడికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

6 నెలల్లో 'జువ్వలదిన్నె' పూర్తి చేస్తాం: మంత్రులు



బిట్రగుంట/గుడ్లూరు (ఉలవపాడు): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను 6 నెలల్లోగా పూర్తి చేసి మత్స్యకారులకు అంకితం చేస్తామని ఆర్‌అండ్‌బీ, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చెప్పారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మారిటైం బోర్డు అధికారులు, జిల్లా కలెక్టర్ ఆనంద్ తదితరులతో పనుల పురోగతిపై సమీక్షించారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌లతో పాటు దామవరం విమానాశ్రయాన్ని కూడా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రులు విమానాశ్రయ భూములను పరిశీలించారు. అలాగే, జూన్ 2025 లోపు రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తామని మంత్రి జనార్దన్‌రెడ్డి చెప్పారు. మంత్రి ఆనంతో కలిసి ఆయన రామాయపట్నం పోర్టును శుక్రవారం పరిశీలించారు.

ఆ 'వెలుగు'లు విస్తరిద్దాం.!

- ఇంధన పరిరక్షణ పై కార్యక్రమాలు కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరిన బీఈఈ
- కలిసి పనిచేసేందుకు సన్నద్ధమవుతున్న ఏపీఎస్ఈసీఎం



సాక్షి, అమరావతి: భవిష్యత్ తరాల కోసం ఇంధన పరిరక్షణ ఆవశ్యకతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ దిశగా చేపట్టిన పలు కార్యక్రమాలను ఇకపైనా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకోసం బీఈఈతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి విద్యుత్ ఆదా చర్యలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ఇంధన సంరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సన్నద్ధం అవుతోంది. ఈ క్రమంలోనే బీఈఈ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి, ఏపీఎస్ఈసీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.ఎ.వి.పి. కుమార రెడ్డి, కేంద్ర, రాష్ట్రాలకు చెందిన ఈ రెండు విభాగాల అధికారులు ప్రత్యేకంగా సమావేశమై విధి విధానాలపై తాజాగా చర్చించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగింది ఇదీ..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో బీఈఈతో కలిసి రాష్ట్రంలోని వివిధ విద్యా సంస్థలలో 1000 ఎనర్జీ క్లబ్‌లను ఏపీఎస్ఈసీఎం ఏర్పాటు చేసింది. పట్టణ ఉష్ణ ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో 'ఏపీ కూల్ సర్ఫేస్ పాలసీ 2023–28' అప్పటి ప్రభుత్వ ప్రోత్సాహంతో రూపొందించింది. 59 భారీ పరిశ్రమల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ) సహకారంతో ప్రత్యేక పరికరాలను అమర్చడం ద్వారా 'పాట్' పథకంలో దాదాపు 1.16 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన ఇంధనం ఆదా అయ్యేలా చేసింది. 1158 సినిమా థియేటర్ల స్క్రీన్లపై నాలుగు చిన్న వీడియోలతో పాటు నాలుగు ఎఫ్ఎం ఛానళ్లలో 3 జింగిల్స్‌ను ప్రసారం చేసింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీలోని ఆంధ్రా భవన్, తిరుమల తిరుపతి దేవస్థానం, పలు జనరల్ హాస్పిటల్స్, విజయవాడలోని డెంటల్ హాస్పిటల్, 130 గవర్నమెంట్ పాఠశాలల్లో విద్యుత్ ఆదా కోసం ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, మోటార్లు అమర్చింది. 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)ని నోటిఫై చేసింది. విశాఖపట్నంలో సూపర్ ఎనర్జీ కన్జర్వేటివ్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) భవన నిర్మాణాన్ని చేపట్టింది.

ఐఏఎస్సా.. అయితే..?

- ఏం తమాషానా.. మా దుకాణాలు తనిఖీ చేస్తారా?
- అధికారంలో ఉన్నాం.. మాజోలికొస్తే ఊరుకోం.. వెంటనే వెళ్లిపోండి..
- రేషన్ షాపుల తనిఖీకి వెళ్లిన సబ్ కలెక్టర్‌కు టీడీపీ నేతల హెచ్చరిక
- పోలీసుల్ని కూడా అసభ్య పదజాలంతో దూషించిన నాయకులు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'మేం అధికారంలో ఉన్నాం. మా షాపులు తనిఖీ చేస్తారా.. ఎంత ధైర్యం.. మా జోలికొస్తే ఊరుకోం..' ఇవి ఏ ఉద్యోగినో, చిన్న అధికారినో ఉద్దేశించి అన్న మాటలు కాదు. సాక్షాత్తు ఐఏఎస్ అధికారి అయిన సబ్ కలెక్టర్‌ను ఉద్దేశించి అన్న మాటలు. 'ఐఏఎస్ అధికారి అయితే మాత్రం మా షాపుల్ని తనిఖీ చేస్తారా? తమాషాలు చేస్తున్నారా?..' అంటూ తెలుగుదేశం నాయకులు ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాను అడ్డుకున్నారు. దీంతో ఆయన మౌనంగా వెనుదిరిగారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. తెలుగుదేశం నేతల బరితెగింపుపై అధికార యంత్రాంగంలోను, ప్రజల్లోను తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆవు చేలో మేస్తుంటే.. దూడ గట్టున మేస్తుందా.. అన్నట్లు రాష్ట్రంలో లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుంటే.. నియోజకవర్గస్థాయిలో తెలుగుదేశం నేతలు అదేరీతిలో రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారు. మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా గురువారం రాత్రి 10 గంటల సమయంలో యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో రేషన్ దుకాణాల తనిఖీకి వచ్చారు. సిబ్బందితో కలిసి పలు షాపుల్ని తనిఖీ చేశారు. తొలుత వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు చెందిన రేషన్ దుకాణాలను పరిశీలించారు. అనంతరం టీడీపీ సానుభూతిపరులకు చెందిన దుకాణాల తనిఖీకి వెళ్లారు. దీంతో టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ మీనాను ఉద్దేశించి తీవ్రపదజాలంతో వ్యాఖ్యలు చేశారు. 'మేం అధికారంలోకి వచ్చి నెలకాకముందే మా రేషన్ దుకాణాల్లోనే తనిఖీ చేస్తారా..' అంటూ నిలదీశారు. 'ఏం? ఐఏఎస్ అధికారి అయితే మాత్రం తమాషా చేస్తున్నారా..' అంటూ మరికొందరు దూషణలకు దిగారు. పక్కనే ఉన్న పోలీసు అధికారులను కూడా దూషించారు. టీడీపీ నేతల తీరుతో తీవ్ర మనస్తాపానికి గురైన సబ్ కలెక్టర్ తనిఖీలు నిలిపేసి వెళ్లిపోయారు. అడ్డుకున్నది అధికార పార్టీ నేతలు కావడంతో తమ విధులకు ఆటంకం కలిగించారంటూ ఒక్క అధికారి కూడా కనీసం ఫిర్యాదు చేయలేదు.

బ్లాక్ మార్కెట్‌కు బియ్యం

టీడీపీ సానుభూతిపరుల దుకాణాల నుంచి రేషన్ బియ్యం పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిందని, అందుకే ఆ పార్టీ నేతలు తనిఖీలను అడ్డుకున్నారని తెలిసింది. టీడీపీకి చెందినవారి షాపులకు ఒక్కోదానికి సుమారు 30 క్వింటాళ్ల బియ్యం తక్కువ దిగుమతి అయినట్లు తెలిసింది. పేదలకు అందాల్సిన ఈ బియ్యాన్ని స్టాక్‌పాయింట్ నుంచే నల్లబజారుకు తరలించి సొమ్ముచేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్ కలెక్టర్ తనిఖీలో ఈ బండారం బయటపడుతుందనే భయంతోనే టీడీపీ నేతలు షాపుల తనిఖీనే అడ్డుకున్నారని తెలిసింది. అందుకే సబ్ కలెక్టరును కూడా లెక్కచేయకుండా ఎదిరించినట్లు భావిస్తున్నారు. తనిఖీకి వచ్చిన సబ్ కలెక్టర్, పోలీసు అధికారులపై టీడీపీ నేతలు విరుచుకుపడిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నా జిల్లా యంత్రాంగం కనీసం స్పందించలేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరిపి అధికారుల విధులకు ఆటంకం కలిగించి, దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పేదల గుడిసెలు పీకేసిన టీడీపీ నేత

- వైఎస్సార్ జిల్లా బద్వేలులో అనుచరులతో కలిసి వీరంగం
- దళిత మహిళలపై దాడి.. అడ్డొచ్చినవారిపైనా దాష్టీకం
- నలుగురికి గాయాలు

బద్వేలు అర్బన్: వైఎస్సార్ జిల్లా బద్వేలులో టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డి శుక్రవారం పేదలపై దౌర్జన్యం చేశారు. ప్రభుత్వ స్థలంలో వారు వేసుకున్న గుడిసెల్ని పీకేశారు. అసభ్యపదాలతో దూషిస్తూ దళిత మహిళలపై దాడిచేశారు. ఆయన అనుచరులు కూడా రెచ్చిపోయారు. వారి దాడిలో నలుగురు గాయపడ్డారు. సి.కొత్తపల్లె పొలంలోని పలు సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిలో సీపీఎం అనుబంధ ప్రజాసంఘమైన వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో పేదలు రెండునెలలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. ఆ స్థలంలో తన పట్టా భూమి ఉందని, ఖాళీ చేయాలని బద్వేలు మండలానికి చెందిన టీడీపీ నేత రామచంద్రారెడ్డి వారిపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరికొందరు పేదలు గుడిసెలు వేసుకుంటుండగా రామచంద్రారెడ్డి 30 మందికి పైగా అనుచరులతో అక్కడికి వెళ్లి గుడిసెలను తొలగించారు. అడ్డుకోబోయిన దళిత మహిళలు సుబ్బమ్మ, స్వప్నలను అసభ్య పదజాలంతో దూషిస్తూ వారిపై దాడిచేశారు. దానం, నారాయణలపై ఆయన అనుచరులు దాడిచేసి కొట్టారు. గాయపడిన నలుగురిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన పట్టా భూమి పక్కనే ఉన్న ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించాలనే ఉద్దేశంతోనే రామచంద్రారెడ్డి పేదలపై దాడిచేశారని సీపీఎం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అర్బన్ సీఐ యుగంధర్‌ను అడగగా ఘటన జరిగిన వెంటనే వెళ్లి పరిశీలించి, బాధితులతో మాట్లాడినట్లు చెప్పారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామన్నారు. మండల ఇన్‌చార్జి తహసీల్దారు మనోహర్‌రెడ్డిని అడగగా సి.కొత్తపల్లె పొలంలో పేదలు గుడిసెలు వేసుకున్న స్థలం ప్రభుత్వానిదా, పట్టాదారునిదా అనే విషయంపై శనివారం సర్వే చేయనున్నట్లు తెలిపారు.



మహిళలపై దాడిచేస్తున్న టీడీపీ నేత రామచంద్రారెడ్డి

ఒక్క రోజులో 97 శాతం పంపిణీ సంతృప్తినిచ్చింది

సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి : ఒకటో తేదీనే ఇంటి వద్ద రూ.2,737 కోట్లతో 64 లక్షల మందికి పెంచిన పింఛన్ల పంపిణీ తనకు ఎంతో సంతృప్తి ఇచ్చిందని సీఎం చంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులో రికార్డు స్థాయిలో 97.54 శాతం పింఛన్లు అందించినట్టు పేర్కొన్నారు. పెరిగిన పింఛన్ పేదల జీవితాలకు భరోసానిస్తుందని, ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులందరికీ అభినందనలు తెలిపారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలిచ్చామని, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్‌లు చెల్లించామని.. ఆర్థిక ఇబ్బందులున్నా రూ.5,300 కోట్లు విడుదల చేసినట్టు పేర్కొన్నారు.

విలేకరి తల్లికి పెన్షన్ అందజేత

సాక్షి,టాస్క్‌ఫోర్స్: పంచాయతీలకు రావాల్సిన నిధులు ఎందుకు పక్కదారి పడుతున్నాయని ప్రశ్నించినందుకుగాను అధికార పార్టీ నేతలు శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం సాక్షి విలేకరి షణ్ముఖరావు తల్లికి పింఛన్‌ను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ విషయం 'సాక్షి' మెయిన్‌లో ప్రచురితమవడంతో శుక్రవారం ఉదయాన్నే బెలమరపాలవలస సచివాలయ సిబ్బంది ఆ గ్రామంలోకి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేసే ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయంలో స్థానిక టీడీపీ కార్యకర్తలు వారిని అడ్డుకోవడంతో సచివాలయ సిబ్బంది వెనుదిరిగారు. ఈ చర్యను వైఎస్సార్‌సీపీ నేతలు, జర్నలిస్ట్ సంఘాలు, వివిధ వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించారు. అన్ని వైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో షణ్ముఖరావు తల్లికి పింఛన్ అందజేశారు.

పింఛను అడిగిన మహిళను చావబాదారు!

- పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు దాడి
- కేసు నమోదు చేయని పోలీసులు



మీర్జేపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడిలో గాయపడి స్పృహ కోల్పోయిన అమరమ్మ

పుంగనూరు (చిత్తూరు జిల్లా): ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయలేదన్న కారణంగా ఓ వృద్ధ మహిళ పింఛను ఆపేశారు. ఎందుకు ఇవ్వలేదని అడిగినందుకు ఆమెపై టీడీపీ గూండాలు గురువారం దాడి చేశారు. ఇదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు శుక్రవారం మళ్లీ చావబాదారు. ఈ దారుణమైన ఘటన పుంగనూరు మండలంలోని మీర్జేపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మీర్జేపల్లి గ్రామంలో దళిత కులానికి చెందిన చెన్నమ్మ, రామయ్య, మునెమ్మ, గంగమ్మ, సరస్వతి, ఏకిల కులానికి చెందిన అమరమ్మకు పింఛను ఇవ్వకుండా గురువారం ఆపివేశారు. పంచాయతీ కార్యదర్శిని పెన్షన్ ఇవ్వాలని వారు కోరారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన నాగరాజు, గిరి తదితరులు వృద్ధ మహిళలను కులం పేరుతో దూషించి, 'మా ఇష్టం వచ్చిన వారికి పెన్షన్ ఇస్తాం.. అడగడానికి మీరెవరు? మీరు ఓట్లు వేశారా?' అంటూ దాడి చేసి.. మీ అంతు తేలుస్తాం అని బెదిరించడంతో మహిళలు అమరమ్మతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగ్రహించిన తెలుగుదేశం పార్టీకి చెందిన వారు శుక్రవారం ఉదయం అమరమ్మ ఇంటి వద్దకు వెళ్లి బయటకు ఈడ్చుకొచ్చి చితకబాదారు. తీవ్రంగా కొట్టి గాయపరచడంతో ఆమె స్పృహ కోల్పోయింది. గ్రామస్తులు ఆమెను అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అమరమ్మ ప్రస్తుతం చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నది. కాగా గురువారం దళిత పెన్షన్‌దారులిచ్చిన ఫిర్యాదుపై కూడా పోలీసులు కేసులు నమోదు చేయకపోవడంతో పలువురు మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, వృద్ధ మహిళ అమరమ్మపై తెలుగుదేశం పార్టీ గూండాలు దాడి చేసి, గాయపరచడంపై మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా.. మీర్జేపల్లి గ్రామంలో పింఛన్లు అందరికీ పంపిణీ చేశామని ఎంపీడీవో వెంగమునిరెడ్డి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

నిలిపివేతపై అధికారికి లబ్ధిదారుల ఫిర్యాదు

'మాకు పెన్షన్ రాకుండా టీడీపీ నేతలు అడ్డుపడుతున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారు' అంటూ శ్రీ సత్యసాయి జిల్లా, రొద్దం మండలం, నారనాగేపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులు వాపోయారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలంటూ ఏవో చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కేవలం తామంతా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులం కావడంతోనే టీడీపీ నేతలు ఈ విధంగా తమపై కక్షసాధిస్తున్నారని వారు వాపోయారు. దీనికి స్పందించిన చంద్రశేఖర్‌రెడ్డి తక్షణమే వారందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ ఘటనపై పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి ఉషాశ్రీ చరణ్ మాట్లాడుతూ మంత్రి సవిత ఇలాకాలో పండుటాకుల పింఛన్లు నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మరికొంతమందికి ఇలానే పింఛన్లు నిలిపివేశారని తెలిపారు. - రొద్దం



ఆలస్యమయ్యామని సచివాలయ ఉద్యోగులపై చర్యలు

- కొందరి సస్పెన్షన్ వేటు.. మరికొందరికి షోకాజ్ నోటీసులు జారీ
- అధికారుల తీరు బాధాకరమన్న సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్

సాక్షి,అమరావతి: పింఛన్ల పంపిణీని ఒకటో తేదీ తెల్లవారుజామున ఆలస్యంగా ప్రారంభించారని అధికారులు కొన్ని జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఒక ప్రకటనలో తప్పుపట్టింది. సామాజిక పింఛన్ పంపిణీలో భాగంగా గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు స్ఫూర్తిదాయకంగా పని చేశారని, అందువలన ఒక్కరోజులోనే 97% మంది లబ్ధిదారులకు పింఛన్‌లు అందాయని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డీ.జాని పాషా పేర్కొన్నారు. అయితే, సాంకేతిక సమస్యలతోనో లేదంటే పలు కారణాలతో ఫోన్లు పనిచేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 0.25 శాతం మంది సచివాలయ ఉద్యోగులు కొంత ఆలస్యంగా పెన్షన్ పంపిణీ ప్రారంభించినప్పటికీ సాయంత్రంలోగా వారికి కేటాయించిన లబ్ధిదారులకు 97–100 శాతం మేర పంపిణీ పూర్తి చేశారని.. అయినప్పటికీ,కొన్ని జిల్లాలలో అధికారులు సచివాలయ ఉద్యోగులను సస్పెండ్ చేయడం వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. 'ప్రభుత్వ లక్ష్యం సాధించడం కోసం సచివాలయ ఉద్యోగులు ఒక యజ్ఞంలా పింఛన్ పంపిణీ చేసి రికార్డు నెలకొల్పిన సందర్భంలో కొన్ని ప్రాంతాల్లో సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులు జారీచేయడం వలన ఉద్యోగుల ఆందోళన చెందుతున్నారని, అధికారులు సహృదయంతో ఉద్యోగులు సస్పెన్షన్లు ఎత్తివేయాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో వలంటీర్లతో ఒక్క రోజులోనే అందించాం..

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మత్స్యలింగం



సాక్షి, అమరావతి : వైఎస్ జగన్ ప్రభుత్వంలో వలంటీర్లతో ఒక్క రోజులోనే పెన్షన్లు అందించామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మత్స్యలింగం తెలిపారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పంచాయతీల శివారు గ్రామాల్లో సైతం అందించామని, సచివాలయ సిబ్బందితో టీడీపీ ప్రభుత్వం ఆ పనిచేయలేకపోయిందన్నారు. వలంటీర్లను తీసేసి కొద్దిపాటి సచివాలయ సిబ్బందితో పింఛన్లు ఇవ్వాలనుకోవటం సబబు కాదని హితవుపలికారు. సచివాలయాల వద్దకే వచ్చి పింఛన్లు తీసుకోలేక చాలామంది మృత్యువాత పడ్డారన్నారు. పింఛన్ తీసుకోకుంటే మరుసటి రోజే ఆ నగదును ప్రభుత్వానికి జమ చేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ అమలు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసిందని దుయ్యబట్టారు. టీడీపీ కూటమి ప్రభుత్వం గత 50 రోజుల్లో తీసుకుంటున్న పలు నిర్ణయాలు, మరీ ముఖ్యంగా విద్యా రంగంలో తీసుకున్న నిర్ణయాలు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్నాయన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోగ్యశ్రీ పథకానికి డబ్బుల్లేవని, నెట్‌వర్క్ ఆస్పత్రులకు డబ్బులివ్వలేం కాబట్టి అందరూ ఆయుష్మాన్‌భారత్ కార్డులు తీసుకోవాలని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గతంలో కేవలం రూ.5 లక్షలే ఉన్న ఆరోగ్యశ్రీ పరిధిని వైఎస్ జగన్ ఏకంగా రూ.25 లక్షలు వరకు పెంచి అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

హెచ్‌సీయూ ఇంటిగ్రేటెడ్ పీజీ-2024 అడ్మిషన్లు షురూ

- దరఖాస్తుకు చివరి తేదీ ఆగస్టు 15...22న కౌన్సెలింగ్



రాయదుర్గం: కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) యూజీ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులనుంచి ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసింది. సీయూఈటీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 15లోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఆగస్టు 22న కౌన్సెలింగ్ 30, 31 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించింది. సెప్టెంబర్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపింది. మరిన్ని వివరాలకు www.uohyd.ac.inను సంప్రదించవచ్చని వర్సిటీ సూచించింది.

క్లుప్తంగా...

ప్రాణహాని ఉంది.. భద్రతను 3+3కి పెంచేలా ఆదేశించండి

- హైకోర్టులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పిటిషన్



సాక్షి, అమరావతి: తనకు ప్రాణహాని ఉన్న దృష్ట్యా ఎమ్మెల్యేగా తనకున్న 1+1 భద్రతను 3+3కి పెంచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది శివరామ్ వాదనలు వినిపిస్తూ, తమకు ప్రాణహాని ఉందన్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న 1+1 భద్రతను 3+3కి పెంచాలని జిల్లా ఎస్పీకి వినతి పత్రం ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం వెలువరించలేదని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిబంధనల ప్రకారం పిటిషనర్‌కు 1+1 భద్రతను కల్పించామన్నారు. వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ వివరణ సమర్పణ నిమిత్తం తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేశారు.

పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలి

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియను ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తూ 2022 నవంబర్ 28న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. ఆ పోస్టులకు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో 95,208 మంది క్వాలిఫై అయ్యారని, ఇప్పటి వరకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించలేదని పేర్కొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణను పూర్తి చేయాలి

పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు విజ్ఞప్తి




సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చట్టం చేసి జీవో 114ను విడుదల చేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో 10,117 మందిని క్రమబద్ధీకరించడానికి అనుమతించిందని చెప్పారు. ఇప్పటి వరకు కేవలం మూడు వేల మంది మాత్రమే.. అందులోనూ వైద్యారోగ్యశాఖలో మాత్రమే ఉద్యోగుల క్రమబద్ధీకరణ జరిగిందన్నారు. విద్యాశాఖలో ఐదు వేల మందిని క్రమబద్ధీకరించాల్సి ఉందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కాంట్రాక్టు అధ్యాపకుల రెన్యువల్ ఫైల్‌ను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, రెసిడెన్షియల్, గిరిజన సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బంది పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని లేఖలో కోరారు.

'వయనాడ్' బాధితులకు సీపీఎం విరాళాల సేకరణ

సాక్షి, అమరావతి: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 300 మందికి పైగా మృత్యువాతపడ్డారని, వందలాది మంది గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎంత సహాయ సహకారాలు అందించినప్పటికీ యావత్ భారత ప్రజానీకం అండగా నిలవాల్సిన సమయమిదని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల వద్దకు వెళ్లి బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించాలని సీపీఎం నిర్ణయించిందని తెలిపారు.

కుల జనగణన చేయాలి

- ఎన్.రఘువీరారెడ్డి



మడకశిర: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల జనగణన చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎస్సీల దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కిందని తెలిపారు. కేరళలోని వయనాడ్‌లో జరిగిన జల ప్రళయంలో వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకోవడం బాధాకరమన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

స్విమ్స్‌కి జాతీయ ప్రాముఖ్యం కల్పించండి

- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతిలోని స్విమ్స్‌కు జాతీయ ప్రాముఖ్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిళ్ల గురుమూర్తి డిమాండ్ చేశారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు మూడు దశాబ్దాలుగా ఎన్నో సేవలందిస్తున్న స్విమ్స్ ప్రాధాన్యం గుర్తించాలని కోరారు. స్విమ్స్‌ను జాతీయ ప్రాధాన్యం కలిగిన సంస్థగా గుర్తించాలని ఏపీ ప్రభుత్వం 2023 ఆగస్టులో కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి జాతీయ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ పద్దులపై మాట్లాడారు. స్విమ్స్ విశ్వవిద్యాలయానికి జాతీయ ప్రాముఖ్యం, హోదా ఇస్తే అధునాతన ఆరోగ్య సంరక్షణ సేవల్ని వెనకబడిన రాయలసీమతో సహా దక్షిణ కోస్తాజిల్లాల్లోని వెనుకబడిన సామాజిక, ఆర్థిక నేపథ్యాలు కలిగిన రోగులకు కూడా విస్తరించగలదని తెలిపారు.

పీసీపీఐఆర్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం



ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలియం కెమికల్స్, పెట్రోకెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్) ఏర్పాటుపై గెయిల్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కన్సార్టియంతో అధ్యయనం ప్రారంభించినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయమంత్రి అనుప్రియాపటేల్ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై వివరణాత్మక సాధ్యాసాధ్యాల నివేదికను ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) 2017లో రూపొందించిందని చెప్పారు. 2021 జూలైలో పెట్రోలియం, సహజ వనరులశాఖ ప్రాజెక్టును పునఃసమీక్షించడానికి ఏపీ ప్రభుత్వం, గెయిల్, హెచ్‌పీసీఎల్, ఈఐఎల్ ప్రతినిధులతో జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రాజెక్టును ఆచరణీయం చేయడానికి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ అవసరమని ఓ అధ్యయనం నిర్ధారించినట్లు పేర్కొన్నారు.

ఏపీకి ఐదు ఫిషింగ్ హార్బర్ల మంజూరు



సాగరమాల పథకంలో భాగంగా ఏపీకి ఐదు ఫిషింగ్ హార్బర్లు మంజూరు చేసినట్లు కేంద్ర నౌకాయానశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. వీటిలో ఒకటి పూర్తయిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మా తనూజరాణి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

రాజ్యసభ

పీఎం గతిశక్తిలో ఏపీకి రెండు ప్రాజెక్టులు

- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మౌలిక వసతుల అభివృద్ధికి మూలధన వ్యయం కోసం ఆంధ్రప్రదేశ్‌కు దీర్ఘకాల రుణం కింద రెండు ప్రాజెక్టులకు 2022–23లో రూ.202 కోట్లు ఆమోదించినట్లు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. రూ.171 కోట్ల అంచనా వ్యయంతో విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో నీటి కనెక్టివిటీ కోసం కొప్పర్తి నోడ్‌ను అభివృద్ధి చేయడానికి ఆమోదం తెలిపామని, ప్రస్తుతం 20 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. కొప్పర్తి నోడ్‌లో రూ.54 కోట్ల అంచనా వ్యయంతో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ (జేఎంఐహెచ్), వైఎస్సార్ ఈఎంసీ, ప్రతిపాదిత పీఎం మిత్ర పార్కుల నుంచి సరకు రవాణా వేగంగా సాగడానికి కనెక్టివిటీ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపామని, 45 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు 46 ఎంఎల్‌డీ బాహ్య నీటిసరఫరాకు రూ.171 కోట్లు, వైఎస్సార్ జేఎంఐహెచ్, కొప్పర్తి, కడప రైల్వే సైడింగ్ (ప్రధాన ట్రాక్ పక్కన చిన్న రైల్వేట్రాక్)కు రూ.31 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

ఏపీలో 4057 నీటి వనరుల నిర్మాణాలు



మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) పథకం ప్రారంభమయ్యాక 2014–15 నుంచి 2023–24 వరకు ఏపీలో 4,057 నీటివనరుల నిర్మాణాలు పూర్తయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి రామ్‌నాథ్‌ఠాకూర్ జవాబిచ్చారు.

పీఎంఏవై-జీలో 76,905 ఇళ్లు పూర్తి



ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ (పీఎంఏవై–జీ) పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 76,905 ఇళ్లు పూర్తయ్యాయని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్రానికి 2,46,430 ఇళ్లు కేటాయించగా 2,46,426 ఇళ్లను అనుమతించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

రైల్వే కార్యకలాపాల ప్రైవేటీకరణ లేదు



దేశంలో రైల్వే కార్యకలాపాల ప్రైవేటీకరణ ప్రతిపాదన లేదని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు జవాబిచ్చారు.



జనసేన నేతల చేతిలో గాయపడి పొలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న చింతగట్ల మాజీ సర్పంచ్ ఉప్మాక

మాజీ మహిళా సర్పంచ్‌పై పాశవిక దాడి

- భూ వివాదంలో దారుణంగా చితకబాదిన జనసేన నేతలు
- ఎవరైనా కాపాడటానికి ముందుకొస్తే చంపేస్తామని బెదిరింపు
- దీంతో రెండు గంటలపాటు అచేతనంగా పడిపోయిన వైనం
- తుదకు గ్రామ మహిళా పోలీస్, పెద్దల చొరవతో ఆస్పత్రికి తరలింపు

పెందుర్తి (విశాఖ జిల్లా): విశాఖ జిల్లా పెందుర్తి మండలం చింతగట్లలో జనసేన నేతలు అధికారమదంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారైన మాజీ మహిళా సర్పంచ్‌పై దాడి చేశారు. అత్యంత దారుణంగా చితకబాదారు. అంతటితో ఆగకుండా ఆమెను ఎవరూ కాపాడకూడదని గ్రామస్తులను హెచ్చరించారు. ఎవరైనా ముందుకొచ్చి కాపాడితే చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితురాలు రెండు గంటల పాటు నరకయాతన అనుభవించింది. కాపాడాలంటూ ఆర్తనాదాలు చేసింది. ఈ ఘటన గ్రామస్తుల కంట నీరు తెప్పించింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చింతగట్లకు చెందిన మాడిసెట్టి వెంకునాయుడుకు రమణ, పైడిరాజు ఇద్దరు కుమారులు. వీరికి గ్రామంలో ఆరు ఎకరాల భూమి ఉంది. దీనిపై చాలా ఏళ్లుగా ఇద్దరు అన్నదమ్ముల మధ్య వివాదం నడుస్తోంది. కోర్టులో కేసు కూడా వేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రమణ, అతని కుమారుడు హరీష్ ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రమణ, అతని భార్య కనకమ్మ, కుమారుడు హరీష్ దౌర్జన్యంగా భూమిని దున్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న పైడిరాజు భార్య ఉప్మాక (మాజీ సర్పంచ్) వారిని భూమి దున్నొద్దని వారించింది. దీంతో రమణ, కనకమ్మ, హరీష్ కలిసి ఉప్మాకను విచక్షణారహితంగా కొట్టారు. రక్షించాలంటూ కేకలు వేస్తూ ఉప్మాక పొలంలోనే స్పృహ తప్పి కుప్పకూలిపోయింది.

రెండు గంటలపాటు నరకయాతన

తీవ్రంగా గాయపడిన ఉప్మాక పొలంలోనే దాదాపు రెండు గంటల పాటు నరకయాతన అనుభవించింది. ఆమెను చికిత్స కోసం తరలించేందుకు ఎవరైనా ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హరీష్ హెచ్చరించడంతో గ్రామస్తులు భయంతో మిన్నకుండిపోయారు. చివరకు గ్రామ సచివాలయ మహిళా పోలీస్, గ్రామపెద్దలు ముందుకు వచ్చి 108లో బాధితురాలిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా, మాడిసెట్టి హరీష్ ఓ హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. గతేడాది నవంబర్‌లో అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజుపై దాడి కేసులోనూ అరెస్ట్ అయ్యాడు.

8,352 చ.కి.మీ.లలో సీఆర్డీఏ పరిధి

▶ మొదటి పేజీ తరువాయి



అమరావతి ప్రాంతాన్ని మార్చే వారికే భూమి కేటాయించాలన్నారు. గతంలో భూములు పొందిన వ్యక్తులు మళ్లీ ఎన్ని రోజుల్లో నిర్మాణాలు చేపట్టాలి.. అనే అంశంపైనా చర్చించారు. అమరావతిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. దేశంలో టాప్ 10 కళాశాలలు, టాప్ 10 స్కూల్స్, టాప్ 10 ఆస్పత్రులను రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేసేలా దృష్టి సారించాలన్నారు. మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపిన పలు గ్రామాలను తిరిగి రాజధాని పరిధిలోకి తీసుకురావాల్సి ఉందని అధికారులు సీఎంకు వివరించారు. సమావేశంలో సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సింగపూర్ ప్రభుత్వంతో చర్చిస్తాం: మంత్రి నారాయణ

రాష్ట్రంలో సీడ్ క్యాపిటల్ నిర్మాణం కోసం మళ్లీ సింగపూర్ ప్రభుత్వంతో చర్చిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ సమావేశానంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'సీడ్ క్యాపిటల్‌ను చెన్నై–కలకత్తా హైవేకు అనుసంధానిస్తాం. ఇందుకు ప్రస్తుతం నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు మరో నాలుగు రోడ్లను అభివృద్ధి చేస్తాం. గతంలో రాజధాని మాస్టర్ ప్లాన్‌లో అనుకున్న విధంగా హెల్త్ సిటీ, స్పోర్ట్స్ సిటీ వంటి నవ నగరాలు నిర్మిస్తాం' అని తెలిపారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి అమరావతికి వెళ్లే కరకట్ట రోడ్డును సెంట్రల్ డివైడర్ ఉండేలా నాలుగు లేన్లతో నిర్మించేలా వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అమరావతిలో ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల ద్వారా మరో నాలుగు ఐకానిక్ బ్రిడ్జిలు వస్తాయన్నారు. 2019కు ముందు రాజధానిలో పలు కేంద్ర, రాష్ట్ర సంస్థల ఏర్పాటుకు భూములు కేటాయించామని.. ఆయా సంస్థలు వీలైనంత త్వరగా సంస్థలను నెలకొల్పేలా చర్చిస్తామని తెలిపారు.

సీఆర్డీయే పరిధిలోకి బాపట్ల, పల్నాడు జిల్లాలు

రాజధాని ప్రాంతంలో మధ్యలో నిలిచిపోయిన కట్టడాల పరిశీలనకు ఐఐటీ హైదరాబాద్ బృందం అమరావతిలో పర్యటించిందని, శనివారం ఐఐటీ మద్రాస్ నిపుణులు ఐకానిక్ భవనాల కట్టడాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని తెలిపారు. వచ్చే వారంలో అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడతామని చెప్పారు. అమరావతి హ్యాపీ నెస్ట్ ప్రాజెక్ట్ కూడా తిరిగి ప్రారంభించేలా దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఆర్5 జోన్ అంశం న్యాయస్థానంలో ఉండటంతో న్యాయ సలహాలు తీసుకుని ముందుకెళ్తామని తెలిపారు. ఇప్పుడున్న వారితో పాటు మరో 32 మంది కన్సల్టెంట్స్‌ను నియమిస్తామని వెల్లడించారు. సీఆర్డీయే పరిధిలోకి కొత్తగా పల్నాడు, బాపట్ల జిల్లాలు కూడా వస్తున్నట్టు మంత్రి వివరించారు.

పథకాలు.. ఫలితాలు

ప్రజలకు కేవలం పథకాలు అందించడమే కాదని, వాటి ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికతో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమం, విద్యుత్ శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సాధికారత, మాతా శిశు మరణాలు, మిషన్ వాత్సల్యతో చిన్నారుల సంరక్షణ కార్యక్రమాలను సమీక్షించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వీలైనన్ని మహిళా హాస్టళ్లు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో మంచి ఫలితాలు సాధించేలా సరికొత్త ఆలోచనలతో కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

రైతులకు పగటిపూటే 9 గంటల విద్యుత్ అందాలి

వ్యవసాయానికి పగటిపూటే 9 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఫీడర్ల సామర్థ్యాన్ని మెరుగు పరచడంతో పాటు కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. తక్కువ ఖర్చుతో డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుదుత్పత్తితోపాటు సరఫరా మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యత కల్పించే ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో విద్యుదుత్పత్తి పరిస్థితిని వివరించారు. ఇంధన శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎం కార్యదర్శి రాజమౌళి, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి

రాష్ట్రంలో నిత్యావసరాల ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో పనిచేస్తే ధరల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. సచివాలయంలో శుక్రవారం పౌర సరఫరాల శాఖపై సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం ధాన్యం సేకరణను అస్తవ్యస్తంగా మార్చిందని ఆరోపించారు. ధాన్యం సొమ్మును చెల్లించడంలోనూ తీవ్ర జాప్యం చేశారని, ఇకపై ఎలాంటి అవరోధాల్లేకుండా ధాన్యం సేకరణ చేయాలని సూచించారు. బియ్యం డోర్ డెలివరీ పేరుతో చేపట్టిన ఎండీయూ విధానం లోపభూయిష్టంగా సాగిందని ఆరోపించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ సిద్ధార్థ్‌జైన్, పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అధ్యయనం తర్వాతే కొత్త మద్యం విధానం

సమగ్ర అధ్యయనం తర్వాతే కొత్త ఎక్సైజ్ విధానాన్ని ప్రకటిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులతో జరిగిన సమీక్షలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న ఎక్సైజ్ విధానాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ వ్యవహారాలపై సీఐడీ విచారణ జరిపిస్తామని, గత ఐదేళ్లలో జరిగిన లావాదేవీల ఫైళ్లను సీజ్ చేయాలని ఆదేశించారు.

రాళ్లు రువ్వి.. కట్టెలతో కొట్టి..



వైఎస్సార్‌సీపీకి చెందిన రంగనాయకులుకు కాలు విరిగిన దృశ్యం



దాడిలో స్పృహ తప్పి పడిపోయిన బోయ లక్ష్మన్న

టీడీపీ నాయకుల దౌర్జన్యకాండ

- కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బిల్లేకల్‌లో విధ్వంసం
- కూరగాయల మార్కెట్ వేలాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి
- సీఐ, ఎస్ఐ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు


ఆలూరు రూరల్/ఆస్పరి: కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బిల్లేకల్లులో దినసరి కూరగాయల మార్కెట్ వేలాల్లో శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు వంద మందికి పైగా పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడి విధ్వంసం సృష్టించారు. రాళ్లు రువ్వి, కట్టెలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆస్పరి సీఐ, ఎస్ఐ, వైఎస్సార్‌సీపీకి చెందిన పది మంది గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామ పంచాయతీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌కు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతి రోజూ సాయంత్రం రైతులు కూరగాయలను తెచ్చి బహిరంగ వేలం నిర్వహిస్తారు. వేలం పాడి కూరగాయలు తీసుకుని విక్రయించుకునేందుకు వ్యాపారస్తులు వస్తుంటారు. ఈ క్రమంలో కూరగాయల మార్కెట్ వేలాల నిర్వహణను వైఎస్సార్‌సీపీకి చెందిన గిత్త నల్లన్న దక్కించుకుని రోజూ రైతులు తెచ్చిన కూరగాయలకు కమీషన్ తీసుకుని వేలాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు వీరేష్ 19 సంచుల్లో (ఒక సంచి 25 కేజీలు) తెచ్చిన కూరగాయలను విక్రయించడానికి వేలానికి ఉంచాడు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు వెంకటేష్ సంచి రూ.390తో వేలం పాడాడు. అంతకు మించి ఎక్కువ ధర ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆగ్రహించిన వీరేష్, మరికొందరితో కలసి వెంకటేష్‌పై దాడి చేశారు. అదే రోజు రాత్రి 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ హయాంలో మార్కెట్‌లో నిర్మించిన సీసీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేశారు.

రైతులెవరూ మార్కెట్‌కు రావొద్దని చాటింపు

ఈ క్రమంలో బిల్లేకల్లు గ్రామంలోని కూరగాయల మార్కెట్‌లో వేలాలు నిర్వహించరాదని, రైతులు ఎవరూ కూరగాయలు తీసుకురావద్దని టీడీపీ వర్గీయులు శుక్రవారం ఉదయం గ్రామంలో దండోరా వేయించారు. అయినా శుక్రవారం సాయంత్రం యథా ప్రకారం మార్కెట్‌లో కూరగాయల వేలాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ వర్గీయులు వీరాంజినేయులు, పెరుగోడు, మొద్దోడు, రాజశేఖర్, చిన్న వీరేష్, వీరాంజినేయులు, విశ్వనాథ్, నాగరాజు, చెన్నకేశవులు, రామాంజినేయులు, గంగాధర్, గోపాల్‌తో పాటు మరో వంద మంది మూకుమ్మడిగా రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన రంగ నాయకులు ఎడమ కాలు విరగ్గా, లక్షన్న సొమ్మసిల్లి పడిపోయాడు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గొడవ విషయం తెలుసుకున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆస్పరి సీఐ హనుమంత రెడ్డి, ఎస్ఐ రవీంద్ర ఘటన స్థలానికి వెళ్లారు. ఇరువర్గాలను చెదర గొడుతుండగా సీఐ హనుమంతప్ప తలకు రాయి తగిలి రక్త గాయం అయ్యింది. ఎస్ఐకి కూడా స్వల్పంగా గాయపడ్డారు. సీఐకి ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, ఆదోనిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, గ్రామంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చంద్రబాబు పాలనలో ఎస్సీలకు చేటు

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ కేంద్ర మాజీ మంత్రి చింతా ధర్నా



చిత్తూరు కలెక్టరేట్: ఎస్సీల్లోని ఐక్యతను దెబ్బతీసి.. రాజకీయంగా లబ్ధి పొందేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఎంతకైనా తెగిస్తాడని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆయన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరికాదన్నారు. భారత దేశ సమగ్రత, భారతదేశ సమైక్యతను దెబ్బతీసేలా అనాలోచిత నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ప్రకటించిందన్నారు. ఇలాంటి తీర్పు గతంలో ఎన్నడూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పది సంవత్సరాల్లో భారతదేశాన్ని బలహీనపరిచేలా తీర్పు ఇచ్చారని చెప్పారు. నరేంద్రమోదీ పరిపాలన పరిశీలిస్తే భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు.

టీడీపీ పాలనలో ఎస్సీలకు ప్రాధాన్యత లేదు

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక సీఎం కార్యాలయంలో 7 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమిస్తే అందులో ఒక్క ఎస్సీ కూడా లేరని విమర్శించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ ఒక్క ఎస్సీ ఐఏఎస్ అధికారికి పోస్టింగ్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. పక్క రాష్ట్రమైన తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ పరిపాలనను చూసి చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని చురకలంటించారు. అంబేడ్కర్, నెహ్రూ, గాంధీలు కలిసి రాజ్యాంగంలో ఎస్సీలకు రిజర్వేషన్లు ఇచ్చారని తెలిపారు. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేలా, దేశ సమగ్రత, సమైక్యతకు గొడ్డలి పెట్టుగా సుప్రీంకోర్టు తీర్పు ఉందన్నారు. కలెక్టరేట్ ఏఓ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో పలు మండలాల నుంచి దళితులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు చంద్రబాబు మొండిచేయి

- పీఆర్సీ ఊసే ఎత్తడం లేదు. మధ్యంతర భృతి లేదు
- గత ప్రభుత్వంపై బురద జల్లడమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి ఫైర్



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం వస్తే ఉద్యోగులకు మేలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు చంద్రబాబు మాటలు.. ఆ హామీల అమలుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయని ఏపీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేదని ప్రచారం చేస్తూ.. గత ప్రభుత్వంపై ఆయన బురద జల్లుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము అధికారంలోకొస్తే ఉద్యోగులకు పీఆర్సీ, మధ్యంతర భృతి(ఐఆర్) ఇస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే గతంలో సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టగానే 27 శాతం ఐఆర్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంకా ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు చాలా ఉన్నాయన్నారు. జీపీఎఫ్, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఏపీజీఎల్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, లాస్ట్ పీఆర్సీ ఎరియర్స్ ఇవ్వాల్సి ఉందని, ఇంకా రాష్ట్రంలోని దాదాపు 3.8 లక్షల పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. నిజానికి ఇవన్నీ మేనిఫెస్టో అంశాలని చెప్పారు.

వలంటీర్లకూ వెన్నుపోటు

వలంటీర్లను కొనసాగిస్తామని, వారికి రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల ముందు ఉగాది పండగ రోజు ప్రకటించిన చంద్రబాబు, అధికారంలోకి రాగానే.. దాదాపు 2.5 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేశారని, వారికి రెండు నెలలుగా ఆ వేతనాలు కూడా చెల్లించడం లేదని ఆక్షేపించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు 1.20 లక్షల మంది.. పోలీసులు అందరూ కలిపి దాదాపు 3 లక్షల మంది ఉద్యోగులు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)లో ఉండగా.. దాన్ని సమీక్షించి అందరికీ ఆమోదయోగ్యమైన పెన్షన్ స్కీమ్ తెస్తామని కూడా టీడీపీ కూటమి మాట ఇచ్చి, మేనిఫెస్టోలో పెట్టిందని చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. పాత పెన్షన్ పథకం(ఓపీఎస్)పై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల భృతి వెంటనే అమలు చేయాలని, ఏటా 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మాట నిలబెట్టుకుంటూ వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు ఎంతో మేలు చేసిందని ఆయన తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచడం, మహిళా ఉద్యోగులకు 6 నెలల వరకు చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వడంతో పాటు మరెన్నో విధాలుగా ఉద్యోగులకు మేలు చేసిందని చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు.

రీచ్ టు రిచ్



బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి సమీపంలో కృష్ణా నదిలో యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

తవ్వుకో తమ్ముడూ!

వానాకాలం కావడంతో ఇసుక రీచ్‌లు ఇంకా అధికారికంగా తెరవలేదు. అయినా తమ్ముళ్లకు అడ్డేలేదు. అడిగేవాడు లేడు.. దోచుకున్నవారికి దోచుకున్నంత.. పట్టపగలు.. మిట్టమధ్యాహ్నం.. అందరూ చూస్తుండగానే ఇసుక వాహనాలు దూసుకెళ్తున్నాయి.. భారీ యంత్రాలు పెట్టిమరీ ఇసుకను తోడేస్తున్నారు. అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. వానాకాలం ఇబ్బంది లేకుండా గత ప్రభుత్వం ముందు చూపుతో ఏర్పాటుచేసిన స్టాక్ యార్డుల్లో ఇసుకనూ కాజేశారు. ఇప్పటికే సగానికి సగం తినేశారు. మిగిలిన సగం ఇష్టమొచ్చిన రేటుకు అమ్మేసుకుంటున్నారు. ఇసుక కావాలంటే తమ్ముళ్ల జేబులు తడవాల్సిందే. మంచిధర పలకాల్సిందే. రీచ్‌ల్లోనూ, స్టాక్ యార్డుల్లోనూ తమ్ముళ్ల దోపిడీ ఎలా ఉందో సాక్షి పరిశీలించింది. - సాక్షి, అమరావతి

ఉచితం పేరుతో టీడీపీ నేతలు ఇసుకను ఊడ్చేస్తున్నారు. ఇటు స్టాక్ యార్డులను ఖాళీ చేస్తున్నారు. అటు రీచ్‌లను గుల్ల చేస్తున్నారు. స్టాక్ యార్డుల్లో ఒక రకమైన దోపిడీకి పాల్ప డుతున్నారు. రీచ్‌లలో మరో రకమైన దందా సాగిస్తున్నారు. స్టాక్ యార్డుల్లో అంతా సవ్యం గా సాగుతున్నట్లు బోర్డులు పెట్టినా... టీడీపీ నాయకులు అధికంగా డబ్బులు వసూలు చేసుకుని టోకెన్లు ఇచ్చినవారికే ఇసుక లోడ్ చేస్తున్నారు. అదేవిధంగా అధికారికంగా మూతపడిన రీచ్‌లలోనూ అడ్డూ అదుపు లేకుండా భారీ యంత్రాలు పెట్టి ఇసుకను తోడేస్తున్నారు. అక్రమంగా తవ్విన ఇసుకను హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు తరలిస్తున్నారు. బయట ప్రాంతా లకు ఇసుకను తరలిస్తుండటంతో స్థానికంగా ప్రజల అవసరాలకు సరిపడా దొరకడం లేదు. అధికార పార్టీ నేతలకు అనధికారికం గా అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఉచిత ఇసుక పేరుతో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎక్కడా విక్రయించడం లేదు. మరోవైపు కొందరు టీడీపీ నాయకులు స్టాక్ యార్డుల్లో ఒక టోకెన్ చూపించి 10, 15 లారీల ఇసుక లోడ్ చేయించుకుని తీసుకువెళుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే లేడు.

'స్టాక్' స్వాహా చేసి రీచ్‌లపై పడ్డారు..

గత ప్రభుత్వం ఈ వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా చూసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా స్టాక్ యార్డుల్లో ముందుగానే 80లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేసింది. అయితే, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్టాక్ యార్డుల్లో నిల్వ చేసిన ఇసుకపై టీడీపీ నేతలు కన్నేశారు. ప్రభుత్వం ఉచిత పాలసీ విధివిధా నాలు ఖరారు చేసేలోపే 40లక్షల టన్నులను స్వాహా చేశారు. మిగిలిన 40లక్షల టన్నులను ఉచితంగా పం పిణీ చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ, ఆచరణలో ఎక్కడా ఉచితంగా ఇసుక ఇస్తున్న దాఖలాలు లేవు. స్టాక్ యార్డులను కేంద్రంగా చేసుకుని టీడీపీ నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇప్పుడు ఏకంగా రీచ్‌లపై పడి దొరికినంత తవ్వేస్తున్నారు. కొత్త సర్కారు వచ్చి రెం డు నెలలు గడుస్తున్నా ఇసుక పాలసీ రాలేదు. అయినా తమ్ముళ్లకు లెక్కేలేదు. వారిని ఆపేవారే లేరు. ఎక్కడ దొరికితే అక్కడ దోచుకోవడమే. అధికారులు కూడా మీనమేషాలు లెక్కిస్తున్నారు. హిందూపురం నుంచి శ్రీకాకుళం వరకు రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి.

- రాష్ట్రవ్యాప్తంగా ఇసుక రీచ్‌లను చెరబట్టిన టీడీపీ నేతలు
- ఇప్పటికే స్టాక్ యార్డుల్లో అడ్డగోలు దోపిడీ
- వర్షాకాలంలో రీచ్‌లు మూతపడినా భారీ యంత్రాలతో తవ్వకాలు
- హిందూపురం నుంచి శ్రీకాకుళం వరకు ఇదే తంతు

కృష్ణాలో పట్టపగలే తవ్వకాలు

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి సమీపాన కృష్ణా నదిలో పట్టపగలే యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఉన్న గాజుల్లంక, పోతార్లంక ఇసుక రీచ్‌లు అధికారికంగా మూతపడ్డాయి. కానీ, నదీ తీర గ్రామాలైన పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం, ఈపూరు, చిలుమూరు గ్రామాలలో టీడీపీ, జనసేన నాయకులు ఇష్టానుసారం ఇసుకను తవ్వి వందలాది ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. ప్రతిరోజూ 200లకు పైగా ట్రాక్టర్లను మూడు, నాలుగు ట్రిప్పులు తిప్పుతూ వేల టన్నుల ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

రెండు నెలల్లోనే రూ.330 కోట్ల నష్టం

ఉచిత ఇసుక విధానమే అయినా... ప్రజలకు ఉచితంగా ఇసుక అందకపోగా అదనపు భారం పడుతోంది. అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం కూడా రావడంలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇసుకపై ఏడాదికి రూ.785 కోట్ల ఆదాయం లభించేది. ఇప్పుడు ప్రభుత్వానికి ఆ ఆదాయం రాదు. పైగా ప్రజలకు లాభం కలగడంలేదు. ఈ రెండు నెలల్లో అస్పష్టమైన ఇసుక విధానం వల్ల ప్రభుత్వం రూ.130 కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. మరోవైపు స్టాక్ యార్డుల నుంచి టీడీపీ అక్రమంగా కొల్లగొట్టిన 40 లక్షల టన్నుల ఇసుక విలువ రూ.200 కోట్లకుపైమాటే. ప్రభుత్వానికి అదీ నష్టమే. డబ్బులు కట్టే ఉచిత ఇసుక విధానం, నిల్వ చేసిన ఇసు కను అక్రమంగా టీడీపీ నేతలు అమ్ముకోవడం ద్వారా ప్రభుత్వానికి ఈ రెండు నెలల్లోనే అధికారికంగా రూ.330 కోట్ల నష్టం వచ్చినట్లు లెక్క. ఆ డబ్బంతా ఎవరికి జేబుల్లోకి వెళ్లినట్లు? టీడీపీ నేతల జేబుల్లోకే కదా?.. సంపద ఎవరికి పెరుగుతుందో అందరూ ఆలోచించాలి.

వంశధార.. జనసేన ఎమ్మెల్యే బంధువుల వశం

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బంధువులు వంశ ధార నదిని తమ వశం చేసుకున్నారు. భామిని మం డలం నేరడి–బిల్లుమడ గ్రామాల మధ్య వంశధార నది నుంచి వారు పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు సాగి స్తున్నారు. వంశధార నదీ తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వ కాలపై తనిఖీలు చేస్తున్న గనుల శాఖాధికారులు అటు వైపు మాత్రం కన్నెత్తి చూడడంలేదు.

కాజ్‌వే దిమ్మెలను ధ్వంసం చేసి ఇసుక తరలింపు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ముత్తుకూరు, ఆనగల్లు, బీఎస్ ఆర్ పేట రీచ్‌లలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరు గుతున్నాయి. ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటకకు ఇసుకను తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఏర్పేడు మండలం మోదుగులపాలెంలో సువర్ణముఖి నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. భారీ యంత్రా లతో ఇసుక తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లలో లోడ్ చేసి ఇతర ప్రాం తాలకు తరలిస్తున్నారు. ఇందుకోసం నదిపై కాజ్‌వే మీద ఉన్న దిమ్మెలను సైతం ధ్వంసం చేసి లారీలు వెళ్లేందుకు రోడ్డులా ఏర్పాటు చేసుకున్నారు. దిగువమాసాపల్లె, పాలూరు స్టాక్ యార్డులను టీడీపీ నేతలు తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. అక్కడ ఒక టోకెన్ తీసుకుని పది ట్రక్కుల్లో ఇసుకను లోడ్ చేయించుకుని అక్రమంగా తరలిస్తున్నారు.



ఏర్పేడు మండలం మోదుగులపాలెం వద్ద ఇసుక లారీలు వెళ్లేందుకు స్వర్ణముఖి నదిపై కాజ్‌వే దిమ్మలను ధ్వంసం చేసి రోడ్డు వేస్తున్న దృశ్యం



మోదుగులపాలెం వద్ద స్వర్ణముఖి నదిలో యంత్రాలతో ఇసుక అక్రమ తవ్వకాలు



శ్రీకాకుళం జిల్లా నారాయణపురం వద్ద అర్ధరాత్రి బారులు తీరిన ఇసుక లారీలు

నెల్లూరు జిల్లాలో అక్రమ తవ్వకాలపై జనం ఆగ్రహం

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పెన్నా నదిలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు, రవాణా సాగు తున్నాయి. ఈ క్రమంలో పొదలకూరు మండలం విరు వూరు గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ నేతలు పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. 50 ట్రాక్టర్లను నిలిపివేసి గొడవ చేయడంతో అందులో ఉన్నవారు వాటిని వది లేసి పరారయ్యారు. ఇక్కడ ఇసుక తోడితే పర్యావరణా నికి ముప్పు ఏర్పడి మేకపాటి గౌతంరెడ్డి బ్యారేజీ ఉని కికే ప్రమాదమని స్థానికులు ఆందోళనకు దిగి అక్రమా ర్కులను తరిమేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చం ద్రమోహన్‌రెడ్డి అండతోనే అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా మర్రిపాడు, పల్లిపాడు, మినగల్లు స్టాక్ యార్డుల నుంచి టీడీపీ నేతలు తమ ఇష్టప్రకారం ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. 20 టన్నుల ఇసుకకు డబ్బులు చెల్లించి 40 టన్నులు లోడ్ చేయిస్తున్నారు. వారి ఆగడాలతో దూర ప్రాంతాల నుంచి స్టాక్ యార్డు లకు ఇసుక కోసం వెళ్లిన లారీలు ఒకటి, రెండు రోజులు పడిగాపులు పడాల్సివస్తోంది.



నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం విరువూరులో గురువారం అర్ధరాత్రి గ్రామస్తులు అడ్డుకోవడంతో డ్రైవర్ వదిలి వెళ్లిన ఇసుక ట్రాక్టర్

రాజాంలో మామిడి తోటల్లో డంప్

విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం రేగిడి మం డలం తునివాడలో నాగావళి నదిలోని ఇసుకను టీడీపీ నేతలు ఎడ్లబండ్ల ద్వారా తరలించి సమీపంలోని మామిడితోటల్లో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి విజయనగరం, విశాఖపట్నానికి చెందిన వ్యక్తులకు ఇసు కను విక్రయిస్తున్నారు. ఎడ్లబండ్ల ద్వారా మాత్రమే ఇసుక బయటకు తీసుకువస్తుండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని, ఉచితం మాటున ఇక్కడ రోజూ లక్షల రూపాయల ఇసుక వ్యాపారం జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.



రాజాం సమీపంలోని తునివాడలో మామిడి తోటలో ఇసుక డంప్

పోలీసులతో చేతులు కలిపి...

శ్రీకాకుళం రూరల్ కరజాడ గ్రామంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. నదిలో తవ్విన ఇసుక సమీపంలోని ప్రాంతాల్లో పెట్టి కుప్పలుగా పోసి అక్కడి అమ్ముతున్నారు. నరసన్నపేట మండలంలో లకలాం, మడపాం, గోపాలపెంటలో రాత్రి సమయం లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ టీడీపీ కార్యకర్తలు నేరుగా పోలీసులతోనే చేతులు కలిపి ఇసుక తవ్వకాలు, రవాణాకు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు.

● ఆంధ్ర టు హైదరాబాద్



ఎన్టీఆర్ జిల్లా అనుమంచిపల్లి వద్ద నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఇసుక లారీలు

టీడీపీ నేతల స్లిప్‌లు ఉంటేనే..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు టీడీపీ నేతల దోపిడీకు అడ్డాగా మారాయి. స్టాక్ పాయింట్ల వద్ద వారు బహిరంగంగా దందాలు చేస్తున్నారు. రావుల పాలెం–1, రావులపాలెం–2, మండపల్లి స్టాక్ పాయింట్ల వద్ద ఐదు యూనిట్ల ఇసుక ధర రూ.5,300 ఉండగా, రూ.11,500 చెల్లిస్తే కాని ఇసుక లోడ్ చేయడంలేదు. స్టాక్ పాయింట్ వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటె రూ.5 వేలు అదనంగా అనధికారికంగా చెల్లిస్తేనే ఇసుక ఇస్తున్నారు. రావులపాలెం, మండపల్లి, తాడిపూడి, కపిలేశ్వరపురం ఇసుక స్టాక్ పాయిం ట్ల వద్ద టీడీపీ నేతలు రోడ్డు మీదనే లారీలు ఆపి ఇసుక స్లిప్‌లు ఇస్తున్నారు. రావులపాలెం వద్ద అయితే టీడీపీ నేతలు ముందుగానే డబ్బులు తీసుకుని రూ.6,200, స్లిప్‌లు ఇస్తున్నారు. ఈ స్లిప్‌లు పొందిన వారిని మాత్రమే స్టాక్ పాయింట్‌కు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. ఈ స్టాక్ పాయింట్ వద్ద తనిఖీ చేసినా బయటపడని విధంగా దందా అంతా బయటే నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు.



రావులపాలెంలో స్టాక్ పాయింట్ వద్ద...

అనంతలో అంతే లేదు

అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడడంలేదు. నందలపాడు సమీపంలో పెన్నా నది పరీవాహక ప్రాంతం నుంచి టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుకను తవ్వి బయట ప్రాంతాలకు తరలిస్తు న్నారు. నిత్యం ఇసుక లోడుతో లారీలు వెళుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. శ్రీ సత్యసాయి జిల్లా హిం దూపురం నియోజకవర్గంలోని సంతేబిదనూర్, చిలమత్తూరు మండలంలో పెన్నా, కుముద్వతి, చిత్రావతి నదీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తవ్వి అమ్ముకుంటున్నారు.



హిందూపురం నియోజకవర్గంలో చిలమత్తూరు వద్ద చిత్రావతి నదిలో పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు

క్లుప్తంగా...

విశాఖపట్నం పోర్టు మరో రికార్డు

24 గంటల్లో అత్యధిక ముడి చమురు హ్యాండ్లింగ్



పోర్టు పాయింట్ మూరింగ్ వద్ద ముడిచమురు నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: మేజర్ పోర్టులతో పోటీపడుతూ నంబర్ వన్ దిశగా అడుగులు వేస్తున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) క్రూడ్ ఆయిల్ హ్యాండ్లింగ్‌లో తన రికార్డుని తానే అధిగమించింది. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమి టెడ్ (హెచ్‌పీసీఎల్)కు చెందిన ముడిచమురు నిర్వహణలో అద్భుత ఫలితాలు రాబట్టింది. పోర్టు చరిత్రలోనే అత్యధికంగా ముడిచమురు నిర్వహించినట్లు చైర్మన్ డా.అంగముత్తు వెల్లడించారు. మలేషియాకు చెందిన ఎంటీ ఈగల్ వ్యాలరీ క్రూడాయిల్ షిప్ 1వ తేదీన విశాఖ పోర్టుకు చేరుకుంది. 24 గంటల పాటు విశాఖ తీరం సమీపంలోని వీపీఏ పాయింట్ మూరింగ్ ఎస్‌పీఎం వద్ద హెచ్‌పీసీఎల్‌కు చెందిన 1,60,000 మెట్రిక్ టన్నుల క్రూడాయిల్ హ్యాండ్లింగ్ చేశారు. ఈ ఏడాది మే 26న హ్యాండ్లింగ్ చేసిన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును పోర్టు అధిగమించిందని వీపీఏ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు.

రైతులకు రాయితీపై బిందు సేద్యం పరికరాలు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో బిందు సేద్యం అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ 2024–25లో నిర్దేశించిన లక్ష్యం మేరకు బిందు పరికరాల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని సూచించారు. గత ప్రభుత్వం బిందు సేద్యాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. రైతులకు తక్షణమే బిందు సేద్యం అమలు చేయాలనే సంకల్పంతో కంపెనీలకు దశల వారీగా బకాయిలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఇటీవలే రూ.176 కోట్లు విడుదల చేశామన్నారు. 2024–25 సీజన్లో 3 లక్షల హెక్టార్లలో సాగుకు రాయితీపై బిందు సేద్యం పరికరాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు మంత్రి తెలిపారు. ఉద్యాన శాఖ కార్యదర్శి అహ్మద్ బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరదసాయం అందించడంలో వివక్ష ఎందుకు?

అల్లూరి జిల్లా గన్నవరంలో బాధితుల నిరసన దీక్ష



గన్నవరంలో నిరసన దీక్ష చేస్తున్న ప్రజలు

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): గోదావరి ముంపు గ్రామాలకు వరద సాయం అందించటంలో ప్రభుత్వం వివక్ష చూపిస్తోందంటూ అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గన్నవరం, గన్నేరుకొయ్యపాడు గ్రామస్తులు శుక్రవారం భద్రాచలం–కూనవరం ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. గోదావరి వరద గ్రామాలను చుట్టుముట్టి వారం రోజులు ఉండటంతో బయటికి వెళ్లే దారిలేక, కూలిపనులు లేక పస్తులతో కాలం గడిపామని వాపోయారు. పక్క మండలాల్లో ముంపునకు గురికాని గ్రామాలకు కూడా వరద సాయం అందించారని, తమ గ్రామాలకు ఎందుకివ్వరని ప్రశ్నించారు. కార్యక్రమంలో గన్నవరం ఎంపీటీసీ కంటి రాజు, సర్పంచ్ భద్రమ్మ తదితరులుపాల్గొన్నారు.

విశాఖలో ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌నకు హాజరైన నేవల్ ఎయిర్‌స్టేషన్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నేవల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ డేగాలో జాతీయ స్థాయి ఏవియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్‌షాప్ శుక్రవారం జరిగింది. ఈస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ ఎం.మురళీ మోహన్‌రాజు ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. దేశంలో ఉన్న అన్ని నేవల్ ఎయిర్‌స్టేషన్‌లకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. సీఎస్‌వో రియర్ అడ్మిరల్ మురళీ మోహన్‌రాజు మాట్లాడుతూ గగనతలంలో ప్రతి సునిశిత అంశాన్ని పరిశీలించి.. భద్రతను పటిష్టం చేసే బాధ్యత ప్రతి నేవల్ ఎయిర్‌స్టేషన్‌కు ఉందని స్పష్టం చేశారు. తూర్పు, పశ్చిమ నౌకాదళం, సదరన్ నేవల్ కమాండ్ పరిధిలో ఉన్న ప్రతి ఎయిర్ స్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దృష్టిసారించాలని సూచించారు. ఐఎన్ఎస్ డేగాలో కొనసాగుతున్న ఎయిర్‌ఫీల్డ్ ప్రాజెక్టును ఆయన సందర్శించారు.

■ తెల్ల నేరేడు భలే



ఈ సీజన్‌లో అందరూ ఇష్టపడే పండ్లు నేరేడు. అవి నల్లగా ఉంటాయని అందరికీ తెలుసు. కానీ అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మార్కెట్‌లో ప్రత్యక్షమైన తెల్లని నేరేడు పండ్లు అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాయి. సన్న గుడ్డులా కనిపించే తెల్లని నేరేడు పండ్లు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా వీటిని విదేశాల్లో పండించి ఇక్కడి మార్కెట్లలో విక్రయిస్తారు. అయితే తొలిసారిగా గుర్రంకొండ, కలకడ మండలాల్లో ఒకరిద్దరు రైతులు సాగు చేయడంతో గుర్రంకొండ మార్కెట్లో తొలిసారిగా కనిపిస్తున్నాయి. కాపు బాగా కాస్తే చెన్నై, బొంబాయి, ఢిల్లీ పట్టణాల్లోని మార్కెట్లకు తరలించి విక్రయిస్తామని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కిలో రూ.120 ధర పలుకుతోంది.

– గుర్రంకొండ

■ ఏలియన్‌కు గుడి !



సాధారణంగా దేవుళ్లకు గుడి కట్టడం తెలుసు. కొందరు తల్లిదండ్రులకు, భార్యకు, పిల్లలకు,సినీ ప్రముఖులకు ఆలయాలు నిర్మిస్తుంటారు. కానీ తమిళనాడు రాష్ట్రం సేలంలో ఓ వ్యక్తి ఏకంగా ఏలియన్‌కు ఆలయాన్ని నిర్మిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. తమిళనాడులోని సేలం జిల్లా మల్లమూపంబట్టికి చెందిన లోకనాథన్ మూడు ఎకరాల భూమిలో ఏలియన్ ఆలయాన్ని నిర్మిస్తున్నాడు. ఆలయంలో నేలకు 11 అడుగుల లోపల సెల్లార్‌లో శివుడు, పార్వతి, మురుగన్, కాళీమాత వంటి దేవతా విగ్రహాలు, ఏలియన్ విగ్రహాలను ప్రతిష్ఠించాడు. దాదాపు నిర్మాణ పనులు ముగింపు దశకు చేరాయి. ఆలయంలో ఏలియన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తాత్కాలికంగా పూజలు మొదలు పెట్టాడు. ప్రపంచంలోనే ఏలియన్‌ల కోసం తానే మొదటి ఆలయాన్ని నిర్మిస్తున్నానని లోకనాథన్ చెబుతున్నాడు. ప్ర కృతి వైపరీత్యాలను నివారించే శక్తి గ్రహాంతరవాసులకు ఉందని నమ్ముతున్నానని చెబు తున్నాడు. తన నమ్మకం ప్రకారం ఏలియన్స్‌కు కొమ్ములు ఉండవని స్పష్టం చేశాడు. అరటి ఆకును శరీరానికి చుట్టుకుంటే గ్రహాంతరవాసుల నుంచి వచ్చే రేడియేషన్ నుంచి తప్పించుకోవచ్చని తెలిపాడు.

– సేలం (తమిళనాడు)

■ అరుదైన అలుగు ప్రత్యక్షం



నల్లమల అటవీ ప్రాంతంలో సంచరించే అంతరించిపోతున్న జాతుల్లో ఒక్కటైన అలుగు (పంగోలిన్) ప్రకాశం జిల్లా మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్స్ హాస్టల్‌లో శుక్రవారం ఉదయం ప్రత్యక్షమైంది. ప్రిన్సిపాల్ రాజబాబు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్నేక్ వాచర్ నిరంజన్ అక్కడకు చేరుకుని అలుగును పట్టుకుని దోర్నాల అటవీ ప్రాంతంలో వదిలారు. కాగా, తల నుంచి తోక వరకూ పొలుసులు ఉండే దీన్ని పట్టుకోడానికి ఎవరైనా దగ్గరికి వచ్చినప్పుడు బంతి ఆకారంలో ముడుచుకుంటుంది. ఈ పొలుసులను ఆభరణాలు, ఖరీదైన వస్త్రాల్లో వాడటంతోపాటు పొలుసుల పొడిని వివిధ రకాల మందుల్లో కూడా ఉపయోగిస్తారు. చైనా, రష్యా, టర్కీ దేశాల్లో ఔషధాల తయారీలో ఉపయోగించే ఈ అలుగును రూ.80 లక్షల వరకూ విక్రయిస్తారని ఒక అంచనా.

– మార్కాపురం

సాగర్‌లోకి 3.99 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

550.6 అడుగుల్లో 211.1 టీఎంసీల నిల్వ

- మూడురోజుల్లో నిండనున్న సాగర్
- శ్రీశైలంలోకి పెరిగిన వరద.. 4.89 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- 883.3 అడుగుల్లో 206.1 టీఎంసీలు నిల్వ చేస్తూ 5.28 లక్షల క్యూసెక్కులు విడుదల
- కృష్ణా ప్రధానపాయలో ఎగువన స్థిరంగా వరద
- తుంగభద్ర డ్యామ్ నుంచి 1.82 లక్షల క్యూసెక్కులు దిగువకు
- మంత్రాలయం వద్ద ప్రమాదకరంగా తుంగభద్ర ప్రవాహం
- నేడు శ్రీశైలంలోకి ఇదే రీతిలో కొనసాగనున్న ప్రవాహం



సాక్షి, అమరావతి/విజయపురిసౌత్: నాగార్జునసాగర్‌లోకి కృష్ణా వరద ఉద్ధృతి మరింత పెరిగింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సాగర్‌లోకి 3,99,159 క్యూసెక్కులు చేరుతుండడంతో నీటినిల్వ 550.6 అడుగుల్లో 211.1 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి భారీవరద వస్తున్న నేపథ్యంలో మరో మూడురోజుల్లో సాగర్ నిండుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటు సుంకేశుల నుంచి తుంగభద్ర, అటు జూరాల నుంచి కృష్ణా వరద ఉద్ధృతి శ్రీశైలంలోకి మరింత పెరిగింది. ప్రాజెక్టులోకి 4,89,361 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా.. స్పిల్‌వే పదిగేట్లను 20 అడుగులు ఎత్తి 4,66,650 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. విద్యుదుత్పత్తి చేస్తూ కుడికేంద్రం నుంచి 23,904 క్యూసెక్కులు, ఎడమకేంద్రం నుంచి 37,857 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. వెరసి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 5,28,411 క్యూసెక్కుల నీరు సాగర్ వైపు ఉరకలెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 25 వేలు, మల్యాల పంప్‌హౌస్ నుంచి హంద్రీ–నీవా ప్రధాన కాలువలోకి 253 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులు తరలిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా ప్రధానపాయ, తుంగభద్ర నదుల్లో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి 3.27 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా ఖాళీ ప్రదేశాన్ని నింపుతూ దిగువకు 3 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 3 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా ఖాళీ ప్రదేశాన్ని భర్తీచేస్తూ దిగువకు 2.85 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టులోకి 2.95 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతేస్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 1.90 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.82 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో మంత్రాలయం వద్ద తుంగభద్ర నీటిమట్టం 311.75 మీటర్లకు (సముద్రమట్టానికి) చేరుకుంది. తుంగభద్ర ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండటంతో తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. ఎగువ నుంచి వరద ప్రవాహం స్థిరంగా వస్తున్న నేపథ్యంలో శ్రీశైలంలోకి వరద ఉద్ధృతి శనివారం కూడా ఇదే రీతిలో కొనసాగనుంది.

తగ్గుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. నదిలో కలుస్తున్న ఉపనదుల నీరు, కొండవాగుల నీరు క్రమేపీ తగ్గుతుండటంతో నదిలో ప్రవాహం తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం 31.750 మీటర్లకు చేరుకుంది. స్పిల్‌వే నుంచి 8.06 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద కూడా వరద నీరు తగ్గుతూ 34.20 అడుగులకు చేరుకుంది. వరద ప్రవాహం తగ్గుతుండటంతో నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీచేయడంతో మళ్లీ వరద పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

మట్టిమిద్దె పైకప్పు కూలి నలుగురి దుర్మరణం

- గురువారం అర్ధరాత్రి ఘటన
- నంద్యాల జిల్లాలో విషాదం



మృతదేహాలను బయటకు తీస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పొట్టకూటికోసం కూలిపనులకు వెళ్లి అలసిపోయి నిద్రిస్తున్న దంపతులు, చిన్నారులను ఇంటి పైకప్పు రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన నంద్యాల జిల్లాలో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత చోటుచేసుకుంది. చాగలమర్రి మండలం, చిన్నవంగలి గ్రామానికి చెందిన గురుశేఖర్‌రెడ్డి (45), భార్య దస్తగిరమ్మ (38)లకు ముగ్గురు కుమార్తెలు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గురుశేఖర్‌రెడ్డి వ్యక్తిగత కారణాలతో గ్రామంలోనే ఓ పాత మట్టిమిద్దెను బాడుగకు తీసుకుని నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి గురుశేఖర్‌రెడ్డి, అతని భార్య దస్తగిరమ్మ, పెద్ద కూతురు పవిత్ర (17), చిన్న కూతురు గురులక్ష్మి (10) భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మట్టిమిద్దె పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. నలుగురూ మట్టికింద కూరుకుపోయి మృత్యువాత పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున స్థానికులు గమనించి హుటాహుటిన శిథిలాలను తొలగించి మృతదేహాలను వెలికితీశారు.గురుశేఖ ర్‌రెడ్డి రెండో కుమార్తె ప్రసన్న గురువారం సాయంత్రమే వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని పాఠశాలకు వెళ్లడంతో ప్రాణాలతో బయటపడింది.

బ్యాంకు దోపిడీకి విఫల యత్నం

బ్యాంక్ సిబ్బంది ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

త్రిపురాంతకం: కొంతమంది దుండగులు చేసిన బ్యాంక్ దోపిడీ ప్రయత్నం విఫలమయిన ఘటన ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం మేడపి యూనియన్ బ్యాంక్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో చోటుచేసుకుంది. శుక్రవారం బ్యాంక్ సిబ్బంది ఎప్పటిలా బ్యాంకులోకి వచ్చాక సేఫ్ లాకర్‌లో తాళం పెడుతుండగా అది ఇరుక్కుపోయింది. తూర్పు వైపున షట్టర్ తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. దీంతో రాత్రి సమయంలో ఎవరో వచ్చి ఉంటారని గుర్తించి పోలీసులకు బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సాంబశివయ్య బ్యాంకులో జరిగిన దోపిడీ య త్నంపై పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపారు. ఈమేరకు దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐలు సుబ్బారావు, క్లూస్ టీమ్ సీఐ శరత్ కుమార్ తమ సిబ్బందితో బ్యాంక్ దోపిడీకి యత్నించిన తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ దోపిడీకి యత్నించిన వారు తూర్పు వైపున ఉన్న షట్టర్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బ్యాంకులో సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక మహిళ ముసుగు ధరించి లోపలకు ప్రవేశించి సీసీ కెమెరాలను కట్ చేసే ప్రయత్నం చేసింది. బ్యాంకులోని సేఫ్ లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నించింది. లాకర్ ఇరుక్కుపోయి వారి ప్రయత్నం ఫలించలేదు.

అవయవదానానికి నేనూ రెడీ

- అవయవదానంతో ఎంతోమందికి పునర్జన్మ
- ఆరోగ్యశ్రీ ఎత్తేయడం లేదు.. పేరు మార్చాం
- వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



సాక్షి, అమరావతి/భవానీపురం (విజయవాడ పశ్చిమ): అవయవదానంతో ఎంతోమందికి పునర్జన్మ లభిస్తోందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తాను కూడా మరణానంతరం అవయవదానం చేస్తానని మంత్రి ప్రకటించారు. జీవన్‌దాన్ ఆధ్వర్యంలో జాతీయ అవయవదాన వారోత్సవాల్లో భాగంగా 'అవయవదానంపై అవగాహన' సదస్సు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకూ 128 మందికి అవయవాలు మార్చగలిగామని, ఈ ఏడాది 200గా లక్ష్యం నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇకపై అవయవదానం చేసిన వారి అంత్యక్రియల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొని వీరవందనం సమర్పించేలా సీఎంతో మాట్లాడతానని చెప్పారు. అలాగే అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రంతో పాటు ఆర్థిక సాయం కూడా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఈనెల 3న కేంద్రం అందించే అవార్డుకు రాష్ట్రం ఎంపికైందని తెలిపారు. అనంతరం అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను వేదికపై మంత్రి ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు విజయవాడలోని ఏలూరు లాకుల నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకూ వలంటీర్లు, వైద్యకళాశాలల పారామెడికల్ స్టాఫ్, నర్సింగ్ స్టాఫ్ వాకథాన్ నిర్వహించారు. ఎమ్మెల్యే బొండా ఉమా, జీవన్‌దాన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నరసింహం పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పేరు మార్చాం

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎత్తేస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, 'ఎన్టీఆర్ వైద్యసేవ'గా పేరు మార్చామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

అంతర్రాష్ట్ర ఏటీఎం దొంగ అరెస్ట్

- గాజువాకకు చెందిన వృద్ధురాలి అకౌంట్ నుంచి రూ.6 లక్షలు కాజేత
- పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజయ్.. ఒడిశాలో అరెస్ట్

విశాఖ సిటీ: సహాయం చేసే నెపంతో ఏటీఎంలకు వచ్చే వృద్ధులు, మహిళలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర దొంగను విశాఖ పోలీసులు అరెస్టు చేశారు.పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం పోలీసులు కేసు వివరాలను వెల్లడించారు. గాజువాకకు చెందిన ఓ వృద్ధురాలు ఈ ఏడాది జూన్ 21న ఉదయం 10.30 గంటలకు పాత గాజువాకలోని ఓ ఏటీఎం సెంటర్‌కు వెళ్లింది. ఆమె ఏటీఎం నుంచి బ్యాలెన్స్ చెక్ చేసుకుని రసీదు తీసుకోవాలని ప్రయత్నించినప్పటికీ రాలేదు. అదే సమయంలో ఆమె వెనుక ఉన్న వ్యక్తి తాను సహాయం చేస్తానని చెప్పడంతో ఆమె నమ్మి కార్డు ఇచ్చింది. ఆమె పిన్ నంబర్ ఎంటర్ చేసినపుడు సదరు వ్యక్తి గమనించాడు. అప్పుడు కూడా రసీదు రాకపోవడంతో అతడు ఆ కార్డును తీసి త న వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డును ఆమెకు ఇచ్చాడు.

కొడుకు మరణం పరిహారాన్ని కాజేసి..

వృద్ధురాలి కొడుకు ఓ కంపెనీలో పనిచేశాడు. అతడు మరణించగా.. పరిహారంగా రూ. 6 లక్షలు ఆమె తల్లి బ్యాంక్ ఖాతాలో వేశారు. ఆ డబ్బును ఆ మోసగాడు ప్రతి రోజూ రూ.10 వేల నుంచి రూ.20 వేల చొప్పున తీస్తూ మొత్తంగా రూ.6 లక్షలు కాజేశాడు. జూలై 10న ఆమె బ్యాంకుకు వెళ్లి బ్యాలెన్స్ చెక్ చేసుకుంది. ఖాతాలో ఉండాల్సిన రూ.6 లక్షలు లేకపోవడంతో జూలై 13న గాజువాక పోలీసులను ఆశ్రయించింది.

ఒడిశాలో నిందితుడి అరెస్ట్

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు డీసీపీ (క్రైం) వెంకటరత్నం పర్యవేక్షణలో ఏసీపీ జోన్–2 (క్రైం) సి.హెచ్. శ్యామలరావు, సౌత్ సబ్‌డివిజన్ (క్రైం) ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో ఈ మోసాలకు పాల్పడుతున్నది పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజయ్ (37)గా గుర్తించి గురువారం ఒడిశాలో అదుపులోకి తీసుకున్నారు. సంజయ్ నుంచి రూ.1,46,800 రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేదల నోట్లో మట్టి!

- రేషన్ బియ్యంలో గోతాల వ్యర్థాలు, కాగితం ముక్కలు, పుల్లలు
- అవాక్కయిన వినియోగదారులు



విజయవాడలో పంపిణీ చేసిన రేషన్ బియ్యం

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం రాకతో రేషన్ బియ్యం తీరుతెన్నులే మారిపోయాయి. గడచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సార్టెక్స్ రైస్ (నాణ్యమైన బియ్యం) పంపిణీ చేస్తే.. కొత్త ప్రభుత్వ హయాంలో బియ్యం రంగుమారింది. నూకలు, గోతాల వ్యర్థాలు, కాగితం ముక్కలు, విరిగిన పుల్లలు దర్శనమిస్తున్నాయి. వీటిని చూసి వినియోగదారులు అవాక్కయ్యారు. విజయవాడ సమీపంలోని బీఎంపీఎస్ కాలనీలో శుక్రవారం ఈ తరహా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. దీంతో వారంతా 'ఇంతకాలం శుభ్రంగా ఇస్తున్న బియ్యం ఇప్పుడెందుకు ఇలా ఉన్నాయి... మళ్లీ ఇంటికి వెళ్లి బియ్యంలో రాళ్లు ఏరుకునే రోజులొచ్చాయా?' అంటూ ఎండీయూ ఆపరేటర్‌ను నిలదీశారు. తినడానికి పనికిరాని విధమైన బియ్యాన్ని పంపిణీ చేయడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్టీపీపీలో కాంట్రాక్ట్ కార్మికుడి దుర్మరణం

ఎస్కార్ట్ హైడ్రా వెహికల్ కిందపడి మృతి



మృతి చెందిన అక్బర్‌బాషా

ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లాలోని డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లో ఎస్కార్ట్ హైడ్రా వెహికల్ కిందపడి శుక్రవారం అక్బర్‌బాషా(50) అనే కాంట్రాక్ట్ కార్మికుడు మరణించాడు. పోలీసుల కథనం మేరకు ముద్దనూరుకు చెందిన అక్బర్‌బాషా ఆర్టీపీపీ స్టేజ్–4లోని 600 మెగావాట్ల ప్రాజెక్టులో బాటమ్ యాష్ షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడ అబ్రహం అనే వ్యక్తిని ఎస్కార్ట్ హైడ్రా వెహికల్ ఆపరేటర్‌గా నియమించారు. కెనడి అనే వ్యక్తి కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. డ్రైవర్ అబ్రహంకు బదులు కెనడి ఎస్కార్ట్ హైడ్రా వెహికల్‌ను నడిపి రివర్స్ చేసే క్రమంలో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అక్బర్‌బాషాను తొక్కించాడు. తీవ్రంగా గాయపడిన అక్బర్ బాషాను ఆర్టీపీపీలోని ప్రాజెక్ట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ చేయాల్సిన పని కార్మికుడితో చేయించడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• తెలంగాణ

ఇదిగో జాబ్ కేలండర్

- శాసనసభకు సమర్పించిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వివిధ రకాల నోటిఫికేషన్లు, పరీక్షల నెలలు విడుదల
- గ్రూప్ పరీక్షలతో పాటు వివిధ పోస్టుల భర్తీ వివరాలు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీల భర్తీ ప్రక్రియకు సంబంధించిన జాబ్ కేలండర్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాబ్ కేలండర్‌ను శాసనసభకు సమర్పించారు. రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన నోటిఫికేషన్లు, పోస్టుల కేటగిరీలు, నోటిఫికేషన్లు జారీ చేసే నెలలు, పరీక్షలు నిర్వహించే నెలలు(తాత్కాలిక ఖరారు), రిక్రూటింగ్ ఏజెన్సీలు, పోస్టులకు అర్హతలను కేలండర్‌లో సవివరంగా తెలియజేశారు. ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదల చేసిన గ్రూప్ పరీక్షల వివరాలతోపాటు భవిష్యత్తులో విడుదల చేయబోయే గ్రూప్ పరీక్షల వివరాలు, వివిధ సంస్థల్లో ఇంజనీరింగ్ పోస్టులు, టీచర్లు, లెక్చరర్లు ఎస్ఐలు తదితర పోస్టుల భర్తీ, టెట్ నిర్వహణకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. అయితే విభాగాల పేర్లను పేర్కొన్నప్పటికీ ఖాళీల సంఖ్యను మాత్రం వెల్లడించలేదు. కాగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో దీనిపై క్లుప్తంగా ప్రకటన చేశారు. నిరుద్యోగ యువతీ యువకుల ఆశలు నెరవేర్చేందుకు జాబ్ కేలండర్ ప్రకటిస్తామని ముందే చెప్పామని, ఆ విధంగానే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జాబ్ కేలండర్ విడుదల చేస్తున్నామని చెప్పారు. ''ఇప్పటికే గ్రూప్–1 నోటిఫికేషన్‌లో అదనంగా 60 పోస్టులు జోడించి 563 ఖాళీల కోసం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేశాం. ఫలితాలు ప్రకటించాం. ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేశాం. మొత్తంగా 32,410 మంది నిరుద్యోగ యువతకు నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,505 ఉద్యోగాల నియామకం చివరి దశకు చేరుకుంది. 11,022 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. గ్రూప్–1, గ్రూప్ 2, గ్రూప్–3 పరీక్షల మధ్య తగిన సమయం లేకపోవడంతో నిరుద్యోగుల కోరిక మేరకు ఆగస్టు 7, 8 తేదీల్లో జరగాల్సిన గ్రూప్–2 పరీక్షలు డిసెంబర్‌కు వాయిదా వేశాం. ఈ నెల 1వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో జాబ్ కేలండర్ గురించి చర్చించి ఆమోదించాం..' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు!

- అన్ని రాజకీయ పక్షాలు అంగీకరిస్తే పెడతాం: సీఎం రేవంత్‌రెడ్డి
- మద్దతిస్తామన్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అన్ని రాజకీయ పక్షాలు ఒప్పుకుంటే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీగా మారుస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలుగు భాషకు, పత్రికా రంగానికి సురవరం ప్రతాప్‌రెడ్డి ఎంతో సేవ చేశారని, తెలంగాణ పోరాటంలో సైతం పాల్గొన్నారని కొనియాడారు. సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ద్వారా ఆ పార్టీ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి.. శుక్రవారం శాసనసభలో విజ్ఞాపన లేఖను అందించగా, దానిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. కాగా, తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టడానికి తాము మద్దతిస్తున్నట్లు బీఆర్ఎస్ సభ్యుడు కె.తారక రామారావు తెలిపారు. వాస్తవానికి దీనిపై తాము గతంలోనే నిర్ణయం తీసుకున్నామని, అయితే పదేళ్ల వరకు వర్సిటీ విభజన జరగకపోవడంతో అప్పట్లో సాధ్యం కాలేదని చెప్పారు. రూ.5 కోట్లతో దేశోద్ధారక భవనంలో సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు మీద ఆడిటోరియాన్ని బాగు చేశామని తెలిపారు. ఆయనపై గౌరవంతో 394 మంది కవులతో గోల్కొండ కవుల సంచిక కూడా తెచ్చామన్నారు.

'గాంధీ'లో మరో పీజీ కోర్సు

జీరియాట్రిక్స్ ఎండీ కోర్సు మంజూరు

సాక్షి, హైదరాబాద్: గాంధీ వైద్య కళాశాలలో మరో పీజీ కోర్సుకు జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అనుమతి ఇచ్చింది. జీరియాట్రిక్స్‌లో పీజీ (ఎండీ) కోర్సును మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు సీట్లతో ఈ కోర్సు ప్రారంభం కానుంది. బీఎన్ గంగాధర్ నేతృత్వంలోని ఎన్ఎంసీ అప్పీల్ కమిటీ రాష్ట్ర విన్నపాన్ని పరిశీలించింది. ప్రభుత్వం సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నాలుగు సీట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో జీరియాట్రిక్ పీజీ కోర్సుకు అనుమతి రావడం ఇదే మొదటి సారి. దేశంలో మొత్తం 18 జీరియాట్రిక్ పీజీ సీట్లుండగా, అందులో నాలుగు మన రాష్ట్రంలో ఉన్నాయి.

భూమి హక్కులకు 'కొత్త చట్టం'!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులపై హక్కులను నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురానుంది. ఈ మేరకు 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్–2024' పేరుతో రూపొందించిన ముసాయిదా బిల్లును ప్రజల ముందుకు తెచ్చింది. భూహక్కుల రికార్డులను ఎప్పటికప్పుడు సవరించడం, ఇప్పటివరకు పాస్‌బుక్‌లు రాని భూముల సమస్యలను పరిష్కరించడం, సర్వే చేసి కొత్తగా భూహక్కుల రికార్డు తయారు చేసుకునే అధికారాన్ని కల్పించడమే ప్రధాన ఉద్దేశాలుగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నట్టు పేర్కొంది. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూదార్, ఆబాదీలకు ప్రత్యేక హక్కుల రికార్డు, అప్పీల్, రివిజన్ వంటి సెక్షన్లను ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు.


పారుల్

తొలి రౌండ్ హీట్స్‌లోనే అంకిత, పారుల్ నిష్క్రమణ

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో భారత్‌కు వరుసగా రెండో రోజు నిరాశ తప్పలేదు. మహిళల 5000 మీటర్ల పరుగులో పారుల్ చౌదరీ, అంకిత దయాని హీట్స్‌లోనే వెనుదిరిగారు. భారత్ నుంచి రెండు ఈవెంట్‌లలో విశ్వక్రీడలకు అర్హత సాధించిన పారుల్ చౌదరీ.. శుక్రవారం జరిగిన రెండో హీట్‌లో 15 నిమిషాల 10.68 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 14వ స్థానంతో సరిపెట్టుకుంది. తొలి హీట్‌లో పోటీపడిన భారత మరో రన్నర్ అంకిత దయాని 20వ స్థానంలో నిలిచింది. అంకిత 16 నిమిషాల 19.38 సెకన్లలో గమ్యాన్ని చేరుకుంది. ఒక్కో హీట్ నుంచి తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వాళ్లు ఫైనల్‌కు అర్హత సాధించారు.

స్వియాటెక్‌కు కాంస్యం



పారిస్ ఒలింపిక్స్ మహిళల టెన్నిస్ సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) కాంస్య పతకం సాధించింది. కాంస్య పతక మ్యాచ్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ 6–2, 6–1తో కరోలినా ష్మిడ్లోవా (స్లొవేకియా)పై విజయం సాధించింది.



గురి చెదిరింది కాంస్యం చేజారింది

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. ఒలింపిక్స్ ఆర్చరీలో సెమీఫైనల్‌కు చేరిన భారత మిక్స్‌డ్ జట్టు.. పతకం పట్టే సువర్ణావకాశాన్ని చేజార్చుకుంది. ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్–అంకిత భకత్ జోడీ.. 'పారిస్' క్రీడల్లో నాలుగో స్థానంలో నిలిచింది. సెమీఫైనల్లో దక్షిణ కొరియా జోడీ చేతిలో ఓడిన ధీరజ్–అంకిత జంట... కాంస్య పతక పోరులో అమెరికా ద్వయం చేతిలో ఓడి రిక్తహస్తాలతో వెనుదిరిగింది.

- మిక్స్‌డ్ టీమ్‌లో ధీరజ్–అంకిత జోడీకి నాలుగో స్థానం
- కాంస్య పతక పోరులో అమెరికా జంట చేతిలో ఓటమి

పారిస్: విశ్వక్రీడల్లో భారత ఆర్చర్లకు మరోసారి నిరాశ తప్పలేదు. 36 ఏళ్ల ఒలింపిక్స్ ఆర్చరీ చరిత్రలో తొలిసారి సెమీఫైనల్‌కు చేరి పతక ఆశలు రేపిన మన మిక్స్‌డ్ ఆర్చరీ జట్టు చివరకు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఒలింపిక్స్ చరిత్రలో మన ఆర్చర్లకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. శుక్రవారం రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం కోసం జరిగిన పోరులో బొమ్మదేవర ధీరజ్–అంకిత భకత్ ద్వయం 2–6తో (37–38, 35–37, 38–34, 35–37) బ్రాడీ ఎలీసన్–క్యాసీ కాఫ్‌హోల్డ్ (అమెరికా) జంట చేతిలో ఓడింది. ధీరజ్ గురి అంచనాలకు తగ్గట్లు సాగినా... ఒత్తిడికి గురైన అంకిత పలుమార్లు గురి తప్పడం ఫలితంపై ప్రభావం చూపింది. నాలుగు సెట్‌లలో కలిపి అంకిత రెండుసార్లు 7 పాయింట్లు సాధించడంతో జట్టు విజయావకాశాలను ప్రభావితం చేసింది. తొలి సెట్‌లో అంకిత 7 ,10 పాయింట్లు సాధించగా.. ధీరజ్ రెండు 10లు నమోదు చేశాడు. ప్రత్యర్థి ఆర్చర్లు 10, 9, 9, 10 పాయింట్లు సాధించి ముందంజ వేయగా.. రెండో సెట్‌ను కూడా అంకిత 7 పాయింట్లతో ప్రారంభించింది. ఈసారి కూడా ప్రత్యర్థిదే పైచేయి కాగా.. మూడో సెట్‌లో అంకిత 10, 9, ధీరజ్ 9, 10 పాయింట్లు గురిపెట్టారు. ప్రత్యర్థి జంట 10, 7, 9, 8 పాయింట్లు చేసి వెనుకబడింది. ఇక నాలుగో సెట్‌లో అంకిత రెండు బాణాలకు ఎనిమిదేసి పాయింట్లే రాగా.. ధీరజ్ 9, 10 పాయింట్లు గురిపెట్టాడు. అయితే వరుసగా 10, 9, 9, 9 పాయింట్లు సాధించిన అమెరికా జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. దక్షిణ కొరియా, జర్మనీ జోడీలకు స్వర్ణ, రజత పతకాలు లభించాయి. అంతకుముందు సెమీఫైనల్లో ధీరజ్–అంకిత జోడీ 2–6తో (38–36, 35–38, 37–38, 38–39) ప్రపంచ నంబర్‌వన్ కిమ్ వూజిన్–లిమ్ షిహ్యోన్ (కొరియా) జంట చేతిలో ఓడింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో భారత్ 5–3తో (38–37, 38–38, 36–37, 37–36) స్పెయిన్‌పై, తొలి రౌండ్‌లో 5–1తో (37–36, 38–38, 38–37) ఇండోనేసియాపై గెలిచింది. మహిళల వ్యక్తిగత విభాగంలో దీపికా కుమారి, భజన్ కౌర్ ఈరోజు బరిలోకి దిగనున్నారు.

మరో చరిత్రకు మను 'సై'

మూడో ఒలింపిక్ పతకంపై మనూ భాకర్ గురి

25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఫైనల్‌కు అర్హత	క్వాలిఫయింగ్‌లో 590 పాయింట్లతో 2వ స్థానం	నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పతకం కోసం పోటీ

టాప్-3లో నిలిస్తే అత్యధిక వ్యక్తిగత ఒలింపిక్ పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా ఘనత

ఏ భారత ప్లేయర్‌కూ సాధ్యంకాని రికార్డును తన పేరిట లిఖించుకునేందుకు పిస్టల్ షూటర్ మనూ భాకర్ ఒక్క పతకం దూరంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటికే రెండు కాంస్య పతకాలు గెలిచిన 22 ఏళ్ల మనూ భాకర్ మూడో పతకంపై గురి పెట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో మనూ రెండో స్థానంలో నిలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జరిగే ఫైనల్లో మనూ టాప్–3లో నిలిస్తే మూడో పతకాన్ని ఖరారు చేసుకుంటుంది. దాంతోపాటు ఒలింపిక్స్ చరిత్రలో అత్యధికంగా 3 వ్యక్తిగత పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా మనూ భాకర్ అవతరిస్తుంది. నార్మన్ ప్రిచర్డ్ (1900 పారిస్; అథ్లెటిక్స్‌లో 2 రజతాలు), రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్‌లో కాంస్యం; 2012 లండన్‌లో రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియోలో రజతం; 2020 టోక్యోలో కాంస్యం) రెండు పతకాల చొప్పున సాధించగా... ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచి ప్రస్తుతం ఈ ముగ్గురి సరసన మనూ భాకర్ ఉంది.



పారిస్: టోక్యో ఒలింపిక్స్‌లో పూర్తిగా నిరాశపరిచిన మనూ భాకర్ 'పారిస్'లో మాత్రం విశ్వరూపం ప్రదర్శిస్తోంది. తాను పాల్గొంటున్న మూడు ఈవెంట్లలోనూ మనూ భాకర్ ఫైనల్‌కు చేరి ఔరా అనిపించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలోనూ కాంస్యం గెలిచిన మనూ భాకర్ 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలోనూ పతక పోరుకు అర్హత పొందింది. 40 మంది షూటర్ల మధ్య జరిగిన క్వాలిఫయింగ్‌లో మనూ 600 పాయింట్లకుగాను 590 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ మరో భారత షూటర్, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ 581 పాయింట్లు స్కోరు చేసి 18వ స్థానంతో సరిపెట్టుకుంది. టాప్–8లో నిలిచిన వారికి మాత్రమే ఫైనల్ బెర్త్‌లు ఖరారవుతాయి. 25 మీటర్ల పిస్టల్ క్వాలిఫయింగ్‌ను రెండు భాగాలుగా నిర్వహించారు. ముందుగా ప్రెసిషన్ ఈవెంట్‌లో, తర్వాత ర్యాపిడ్ ఈవెంట్‌లో పోటీపడ్డారు. మనూ ప్రెసిషన్ ఈవెంట్‌లో 294 పాయింట్లు, ర్యాపిడ్‌లో 296 పాయింట్లు సాధించింది. క్వాలిఫయింగ్‌లో వెరోనికా (హంగేరి; 592 పాయింట్లు) టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఆ తర్వాత హనియె రోస్తమియాన్ (ఇరాన్; 588 పాయింట్లు) మూడో స్థానాన్ని, ట్రిన్ తు విన్ (వియత్నాం; 587 పాయింట్లు) నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు. నాన్ జావో (చైనా; 586 పాయింట్లు) ఐదో ర్యాంక్‌లో, జిన్ యాంగ్ (కొరియా; 586 పాయింట్లు) ఆరో ర్యాంక్‌లో, కామిలి జెద్రాఝ్స్కీ (ఫ్రాన్స్; 585 పాయింట్లు) ఏడో ర్యాంక్‌లో, కేటలిన్ మోర్గాన్ (అమెరికా; 585 పాయింట్లు) ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు.



52 ఏళ్ల తర్వాత...

- ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియాపై భారత హాకీ జట్టు విజయం
- 3–2తో ఓడించి పూల్ 'బి'లో రెండో స్థానం

పారిస్: ఆగస్టు 30, 1972... ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు అగ్రశ్రేణి టీమ్ ఆస్ట్రేలియాను 3–1 గోల్స్ తేడాతో ఓడించింది. ఆ తర్వాత ఇన్నేళ్లల్లో ఒలింపిక్స్ వేదికగా 'కూకాబుర్రాస్'లపై మన జట్టు విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు 52 ఏళ్ల తర్వాత భారత్ ప్రదర్శన పునరావృతమైంది. శుక్రవారం జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–2 గోల్స్ తేడాతో అగ్రశ్రేణి జట్టు ఆస్ట్రేలియాను ఓడించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ (13వ, 32వ ని.లో) సాధించగా, అభిషేక్ (12వ ని.లో) మరో గోల్ కొట్టాడు. ఆసీస్ ఆటగాళ్లలో క్రెయిగ్ థామస్ (25వ ని.లో), బ్లేక్ గోవర్స్ (55వ ని.లో) చెరో గోల్ నమోదు చేశారు. అయితే ఈ మ్యాచ్‌కు ముందే క్వార్టర్ ఫైనల్‌కు చేరిన భారత్... తాజా ఫలితంతో 10 పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంతో ముగించింది. గ్రూప్ 'ఎ'లో మూడో స్థానంలో నిలిచిన జట్టుతో (బ్రిటన్ లేదా జర్మనీ) ఆదివారం జరిగే క్వార్టర్ ఫైనల్లో భారత్ ఆడుతుంది.

టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత ఆసీస్‌తో కాంస్యపతక విజేత భారత్ మధ్య పోరు హోరాహోరీగా సాగింది. ఇరు జట్లు దూకుడుగా ఆటను మొదలు పెట్టాయి. ఆసీస్‌కు వరుసగా వచ్చిన రెండు అవకాశాలను భారత డిఫెన్స్ సమర్థంగా అడ్డుకుంది. అయితే 12వ నిమిషంలో లలిత్ కొట్టిన షాట్‌ను ఆసీస్ కీపర్ చార్టర్ నిలువరించగలిగినా... రీబౌండ్‌లో అభిషేక్ దానిని పోస్ట్‌లోకి కొట్టాడు. తర్వాతి నిమిషంలోనే భారత్‌కు పెనాల్టీ అవకాశం రాగా, చక్కటి ఫ్లిక్‌తో హర్మన్‌ప్రీత్ దానిని సమర్థంగా ఉపయోగించుకున్నాడు. రెండో క్వార్టర్‌లో తమకు లభించిన కార్నర్‌ను కంగారూలు గోల్‌గా మలిచారు. మూడో క్వార్టర్‌లో మన్‌ప్రీత్‌ను ఆసీస్ ఆటగాడు ఫ్లయిన్ ఒగిలివీ దురుసుగా అడ్డుకోవడంతో భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీనిని హర్మన్ సునాయాసంగా గోల్‌గా మార్చాడు. చివరి క్వార్టర్‌లో మన జట్టుకు మరో రెండు అవకాశాలు దక్కినా గోల్ మాత్రం రాలేదు. ఆట మరో ఐదు నిమిషాల్లో ముగుస్తుందనగా తమకు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌గా గోల్‌గా మలచి ఆసీస్ గెలుపు అంతరాన్ని తగ్గించ గలిగింది.

పారిస్‌లో భారతీయం

నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ

మహిళల వ్యక్తిగత ఎలిమినేషన్ రౌండ్: దీపికా కుమారి X మిచెల్లి క్రొపెన్ (జర్మనీ) (మధ్యాహ్నం గం. 1:52 నుంచి), భజన్ కౌర్ X దినంద చోరునిసా (ఇండోనేసియా) (మధ్యాహ్నం గం. 2:05 నుంచి)

షూటింగ్

మహిళల స్కీట్ క్వాలిఫికేషన్ రౌండ్: రైజా ఢిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). మహిళల 25 మీటర్ల పిస్టల్ (పతక పోరు): మనూ భాకర్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి)

బాక్సింగ్

పురుషుల 71 కేజీల క్వార్టర్ ఫైనల్: నిశాంత్ X మార్కో వెర్డె (మెక్సికో) (అర్ధరాత్రి గం. 12:18 నుంచి)

సెయిలింగ్

పురుషుల డింగీ రేసులు: విష్ణు (మధ్యాహ్నం గం. 3:45 నుంచి). మహిళల డింగీ రేసులు: నేత్ర కుమానన్ (సాయంత్రం గం. 5:55 నుంచి)

'లక్ష్యం' దిశగా మరో అడుగు



- బ్యాడ్మింటన్ సెమీఫైనల్లో లక్ష్య సేన్
- పురుషుల సింగిల్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత ఆటగాడిగా గుర్తింపు

పారిస్: భారత యువ షట్లర్ లక్ష్య సేన్ ఒలింపిక్స్ పతక ఆశలను సజీవంగా నిలిపాడు. అద్భుత ఆటతీరుతో చెలరేగుతున్న లక్ష్య సెమీఫైనల్లోకి అడుగు పెట్టి పతకంపై గురి పెట్టాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 19–21, 21–15, 21–12 స్కోరుతో ప్రపంచ 11వ ర్యాంకర్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు. 75 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్‌ను కోల్పోయినా... ఆ తర్వాత సత్తా చాటిన 23 ఏళ్ల లక్ష్య సెమీస్ చేరాడు. ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్‌లో భారత్ తరఫున సెమీఫైనల్ చేరిన తొలి ఆటగాడిగా సేన్ ఘనత సృష్టించాడు. గతంలో భారత్ నుంచి అత్యుత్తమంగా పారుపల్లి కశ్యప్ (2012), కిడాంబి శ్రీకాంత్ (2016) క్వార్టర్ ఫైనల్ వరకు మాత్రమే రాగలిగారు. లో కీన్ యె (సింగపూర్), అక్సెల్‌సన్ (డెన్మార్క్) మధ్య జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే సెమీఫైనల్లో లక్ష్య సేన్ తలపడతాడు. సెమీస్‌లో లక్ష్య గెలిస్తే అతనికి స్వర్ణం లేదా రజతం ఖాయమవుతుంది. ఒకవేళ సెమీఫైనల్లో ఓడినా కాంస్య పతకం కోసం మళ్లీ పోటీ పడే అవకాశం ఉంటుంది. 2021 వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్యపతక విజేత అయిన లక్ష్య క్వార్టర్స్‌లో తొలి గేమ్‌లో కూడా పోరాడాడు. ఆరంభంలో దూకుడు ప్రదర్శించిన టిన్ చెన్ 11–9తో ముందంజ వేసి ఆపై 14–9తో నిలిచాడు. అయితే కోలుకున్న లక్ష్య వరుస పాయింట్లతో 16–15కు దూసుకెళ్లాడు. స్కోరు 19–19కి చేరగా, చివరకు గేమ్ తైపీ ఆటగాడిదే అయింది. రెండో గేమ్ కూడా పోటాపోటీగా సాగగా సేన్ 11–10తో ఆధిక్యంలో నిలిచాడు. స్కోరు 13–13కి చేరిన తర్వాత 10 పాయింట్లలో 8 గెలుచుకొని గేమ్ సొంతం చేసుకున్నాడు. మూడో గేమ్‌కు వచ్చే సరికి లక్ష్య ఆటతో మరింత జోరు పెరిగింది. విరామ సమయానికి 11–7 వద్ద ఉన్న సేన్ ఆ తర్వాత దూసుకుపోయాడు. వరుస స్మాష్‌లతో దూకుడు కనబర్చడంతో టిన్ చెన్ వద్ద సమాధానం లేకపోయింది.



'నన్ను పెళ్లాడతావా'

బ్యాడ్మింటన్ కోర్టులో షట్లర్ పెళ్లి ప్రతిపాదన

హువాంగ్ య ఖియాంగ్... చైనా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. శుక్రవారం మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో జెంగ్ సివీతో కలిసి బరిలోకి దిగిన హువాంగ్ విజేతగా నిలిచి స్వర్ణపతకం సొంతం చేసుకుంది. అయితే పసిడి సాధించిన కొద్ది సేపటికే ఆమెకు సహచరుడి నుంచి అనూహ్యంగా పెళ్లి ప్రతిపాదన వచ్చింది. చైనా డబుల్స్ ప్లేయర్ ల్యూ యుచెన్ ఉంగరాన్ని తీసుకొచ్చి 'నన్ను పెళ్లాడతావా' అంటూ హువాంగ్ ముందు మోకాళ్లపై కూర్చొని అడిగాడు. వెంటనే తాను కూడా సంతోషంగా స్పందిస్తూ ఓకే చెప్పేసింది. స్వదేశానికి ఒలింపిక్ పతకంతో పాటు ఇప్పుడు ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను కూడా ఆమె తీసుకెళుతోంది.



'కొంత విరామం కావాలి'

ఆటలో కొనసాగుతానని సింధు స్పష్టీకరణ

పారిస్: భారత్ తరఫున వరుసగా మూడు ఒలింపిక్స్ క్రీడల్లో పతకాలు సాధించిన తొలి క్రీడాకారిణిగా నిలిచే లక్ష్యంతో బరిలోకి దిగిన బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట (పీవీ) సింధు దురదృష్టవశాత్తూ ఆ ఘనతను అందుకోలేకపోయింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన సింధు పారిస్ ఒలింపిక్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో తన భవిష్యత్తు ఆలోచనల గురించి సింధు వెల్లడించింది. తాజా ఓటమితో చాలా బాధపడుతున్నానన్న ఆమె... మరో చర్చకు తావు లేకుండా ఆటలో కొనసాగుతానని స్పష్టం చేసింది. అయితే శారీరకంగా, మానసికంగా కాస్త విరామం కోరుకుంటున్నానని పేర్కొంది. 29 ఏళ్ల సింధు ఒలింపిక్స్ పరాజయం తర్వాత సోషల్ మీడియా ద్వారా తన స్పందనను తెలియజేసింది. 'పారిస్ ప్రయాణం చాలా గొప్పగా సాగింది. కానీ ఓటమి బాధించింది. ఈ పరాజయం నా జీవితంలో చాలా కఠినమైంది. దీని నుంచి కోలుకునేందుకు సమయం పడుతుంది. అయితే జీవితం ఆగిపోదు. మళ్లీ కొనసాగాల్సిందే. పారిస్‌కు అర్హత సాధించే క్రమంలో ఎంతో పోరాడాను. గత రెండేళ్లు గాయాలతో ఎక్కువ సమయం ఆటకు దూరమయ్యాను. ఈ సవాళ్లను అధిగమించి నా దేశం తరఫున మూడో ఒలింపిక్స్‌లో ఆడే అవకాశం రావడం గొప్పగా అనిపించింది. ఈ స్థాయిలో ఆడటం, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవగలగడం నా అదృష్టం. నేను విజయం కోసం శాయశక్తులా ప్రయత్నించాను కాబట్టి ఎలాంటి చింత లేదు. ఇప్పుడు అభిమానుల మెసేజ్‌లు నాకు ఊరటనందిస్తున్నాయి. నా భవిష్యత్తు గురించి స్పష్టత ఇవ్వదల్చుకున్నా. ఆటలో ఇంకా కొనసాగుతా. అయితే కొంత విరామం తీసుకుంటాను. నా శరీరానికి, మనసుకు ఇప్పుడు విశ్రాంతి చాలా అవసరం. రాబోయే రోజుల కోసం సరైన ప్రణాళికలు రూపొందించుకుంటా. ఎందుకంటే నేను అమితంగా ఇష్టపడే ఆటలోనే నాకు ఆనందం దక్కుతుంది' అని సింధు తన మనసులో భావాన్ని వ్యక్తపర్చింది.

40 ఏళ్ల తర్వాత మళ్లీ ఒలింపిక్స్‌లో...



వెనిజులా షూటర్ అరుదైన ఘనత


1984 ఒలింపిక్స్‌లో 2024 ఒలింపిక్స్‌లో

పారిస్: ఒలింపిక్స్‌లో ఆటగాళ్ల విజయగాథలే కాదు... వీటిలో పాల్గొనే వారిలో ఎన్నో భిన్నమైన, ఆసక్తికర నేపథ్యాలు కూడా ఉంటాయి. అలాంటి వాటిలో ఇది కూడా ఒకటి. వెనిజులాకు చెందిన షూటర్ లియోనెల్ మార్టినెజ్ పారిస్‌లో ట్రాప్ ఈవెంట్‌లో పోటీ పడ్డాడు. ఓవరాల్‌గా 28వ స్థానంతో ముగించాడు. అయితే అతను పోటీల్లో పాల్గొనడం విశేషం కాదు... 60 ఏళ్ల వయసున్న మార్టినెజ్ 40 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ ఒలింపిక్స్ బరిలోకి దిగడమే అసలు ఘనత! 20 ఏళ్ల కుర్రాడిగా 1984 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో మార్టినెజ్ పాల్గొన్నాడు. ఆ తర్వాత ఆటకు దూరమై పలు వ్యాపారాల్లో స్థిరపడ్డాడు. అయితే చాలా ఏళ్ల తర్వాత అతనికి మళ్లీ షూటింగ్ వైపు మనసు మళ్లింది. మొదటి నుంచి రెగ్యులర్‌గా జిమ్‌కు వెళుతూ తన శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకున్న మార్టినెజ్‌కు మరోసారి క్రీడల్లోకి అడుగు పెట్టడం కష్టం కాలేదు. తన షూటింగ్‌కు పదును పెట్టుకున్న అతను 2023 పాన్ అమెరికన్ క్రీడల్లో రజతం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. 2028 లాస్ ఏంజెలిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లోనూ పాల్గొనాలనేదే మార్టినెజ్ తర్వాతి లక్ష్యం. అప్పటికి 64 ఏళ్లు వచ్చినా సరే... ఎక్కడ మొదలు పెట్టానో అక్కడే ముగిస్తాను అంటూ అతను ఘంటాపథంగా చెబుతున్నాడు. మార్టినెజ్‌కు ముందు జపాన్ ఈక్వెస్ట్రియన్ ఆటగాడు హొకెసు హిరోషి మాత్రమే రెండు ఒలింపిక్స్ మధ్య ఎక్కువ విరామం (44 ఏళ్లు) తీసుకున్నవాడిగా నిలిచాడు. తొలిసారి 1964 ఒలింపిక్స్‌లో పాల్గొన్న అతను ఆ తర్వాత 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో మళ్లీ బరిలోకి దిగాడు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	13	8	8	29
2	ఆస్ట్రేలియా	10	6	5	21
3	అమెరికా	9	18	15	42
4	ఫ్రాన్స్	9	11	12	32
5	బ్రిటన్	9	9	8	26
6	జపాన్	8	3	6	17
7	దక్షిణ కొరియా	7	5	4	16
44	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

పరిశోధనలతో సమాజానికి మేలు

యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ కాలేజీలు, యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ అన్నారు. వీరి నియామకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి నాణ్యమైన పరిశోధనలు ఆశించలేమని. కాంట్రాక్టు పద్ధతిన పనిచేసే వారు నిబద్ధతతో పని చేయలేరని అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి తగిన విధంగా ఉంటే పరిశోధనల్లో ఆటోమేటిక్‌గా నాణ్యత పెరుగుతుందని స్పష్టం చేశారు. చాలా వర్సిటీల్లో శాశ్వత సిబ్బందిని నియమించకుండా, కాంట్రాక్టు అధ్యాపకులతోనే నడిపిస్తున్నారు కదా! అనే ప్రశ్నకు బదులిస్తూ..ఇది చాలా పెద్ద సమస్య అని, రాష్ట్రాల గవర్నర్లు, ప్రభుత్వాలకు ఈ విషయంలో తాము చాలాసార్లు లేఖలు రాశామని చెప్పారు. తమ పరిధిలో ఉన్నంత వరకు తాము ప్రయత్నిస్తున్నామని, గత వారంలో కూడా దీనిపై చర్చించామని తెలిపారు. ఇప్పటికైనా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉద్యోగం కోసం పీహెచ్‌డీ చేయకూడదు

పరిశోధనా రంగంలోకి ఎక్కువ మంది యువత రావాలనే ఉద్దేశంతోనే.. పీజీతో సంబంధం లేకుండా నాలుగేళ్ల డిగ్రీ తర్వాత పీహెచ్‌డీ చేసే వెసులుబాటు కల్పించామని జగదీశ్‌కుమార్ వెల్లడించారు. ఈ విధానం విదేశాల్లో ఎప్పటి నుంచో విజయవంతంగా అమలవుతోందని, ఇక్కడ కూడా మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. పీహెచ్‌డీ చేసిన వారికి జీవనోపాధి కష్టమవుతోందనే అభిప్రాయంపై మాట్లాడుతూ..'పీహెచ్‌డీ అంటే ఏదో ఉద్యోగం కోసం చేసే కోర్సు కాదు. రీసెర్చ్‌పై ఆసక్తి (ప్యాషన్) ఉంటేనే ఈ రంగంలోకి రావాలి. దేశానికి సేవ చేయాలనే ఉద్దేశంతో పీహెచ్‌డీ చేయాలి. అంతేకానీ ఉద్యోగం కోసం మాత్రం రావొద్దు. ఉద్యోగమే కావాలనుకుంటే పీజీ తర్వాత ఏదైనా వేరే కోర్సు చేసి స్థిరపడటం మంచిదని నా అభిప్రాయం..' అని చెప్పారు.

న్యాక్ గుర్తింపు తీసుకోవాలి

తెలంగాణ సహా ఎక్కడైనా యూనివర్సిటీలు, డిగ్రీ కాలేజీలు న్యాక్ గుర్తింపు పొందే విషయంలో ఎప్పటికప్పుడూ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయని జగదీశ్ కుమార్ తెలిపారు. న్యాక్ గుర్తింపు కోసం ముందుకు రావాలని విద్యా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. అలా రాకపోతే సమాజానికి మేలు చేయని వారిగానే పరిగణించాల్సి వస్తుందని, నాణ్యమైన విద్యను అందించడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు.

బీఆర్క్-24 ప్రవేశాల ఏపీ కన్వీనర్‌గా ఆచార్య విశ్వనాథకుమార్



ఏఎఫ్‌యూ (కడప): బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్)-2024 ప్రవేశాల ఏపీ కన్వీనర్‌గా ఆచార్య జి.విశ్వనాథకుమార్ నియమితులయ్యారు. వైఎస్సార్ జిల్లా కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈయనను కన్వీనర్‌గా నియమిస్తూ ఏపీ ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య కె. రామ్మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీలో లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులు 15.22 లక్షలు

మూడేళ్ల వివరాలు వెల్లడించిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర, జాతీయ లోక్ అదాలత్‌లో భారీస్థాయిలో కేసులు పరిష్కారమైనట్లు కేంద్ర న్యాయశాఖ తెలిపింది. ఏపీ, తెలంగాణలో 2.14 కోట్ల కేసులు ఈ ఏడాది జూన్‌కి పరిష్కారమైనట్లు శుక్రవారం తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంది. ఇందు కోసం తెలుగు రాష్ట్రాల్లో 22,538 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించింది. 2021 నుంచి 2024-25 (జూన్-30) వరకు ఈ కేసుల ద్వారా రూ.818 కోట్లు బాధితులు పొందినట్లు పేర్కొంది. లోక్ అదాలత్‌లో భాగంగా ఏపీకి సంబంధించి 15.22 లక్షల కేసులు పరిష్కరించినట్లు తెలిపింది.

బాల్య వివాహాల్లో కర్ణాటక ఫస్ట్

- రెండు, మూడు స్థానాల్లో అస్సాం, తమిళనాడు
- ఏపీలో కేవలం 26 మాత్రమే
- పార్లమెంట్‌లో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి వెల్లడి



2022లో వివిధ రాష్ట్రాల్లో నమోదైన బాల్యవివాహాలు ..

సాక్షి, అమరావతి: దేశంలో కర్ణాటక, అస్సాం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రల్లో అత్యధికంగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి శుక్రవారం లోక్‌సభలో వెల్లడించారు. 2022లో దేశంలో 1002 బాల్య వివాహాలు జరిగినట్లు ఆమె తెలిపారు. బాల్య వివాహాల నిషేధ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని నిరోధించేందుకు చట్ట ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. ఏపీలో 2022లో కేవలం 26 బాల్య వివాహాలు నమోదయ్యాయని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల కేంద్రంగా బాల్య వివాహాల నిరోధానికి పటిష్ట చర్యలు తీసుకుంది. రక్తహీనత సమస్యను అధిగమిస్తే బాల్యవివాహాలను నివారించడం సాధ్యమనే లక్ష్యంగా గత వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాల్యవివాహాలు చేసే అవకాశం ఉన్న వారికి ముందుగానే గుర్తించి, నివారించడంతో పాటు కేసులు కూడా నమోదు చేసింది.

ఉచితంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సిమ్‌లు

అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిందిగా కస్టమర్లకు సంస్థ సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో మెరుగైన టెలికాం సర్వీసుల కోసం తమ సిమ్‌లను 4జీ టెక్నాలజీకి అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిందిగా సంస్థ సూచించింది. ప్రస్తుతం 2జీ/3జీ సిమ్‌లు వినియోగిస్తున్నవారికి 4జీ సిమ్‌లను ఉచితంగా అందిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీసులు, బీఎస్ఎన్ఎల్ సర్వీసు సెంటర్లతో పాటు బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు/రిటైలర్లు/ఏజెంట్ల వద్ద 4జీ సిమ్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ప్రస్తుతం వినియోగిస్తున్న సిమ్ ఏ టెక్నాలజీ అన్నది 54040 అనే నెంబర్‌కు " SIM"అని సందేశం పంపడం ద్వారా అది 2జీ/3జీ/4జీ సిమ్మా అనే విషయాన్ని తెలుసుకోవచ్చని పేర్కొంది. 4జీ సేవలు అందుబాటులోకి వచ్చిన చోట్ల 2జీ/3జీ సిమ్ వినియోగిస్తున్న వారి సేవలకు అంతరాయం ఏర్పడుతోందని, ఈ ఇబ్బందిని తొలగించడానికి ఉచితంగా 4జీ సిమ్‌ను అందిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ పీజీఎం వై.రవీంద్రనాథ్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 3 । ఆగస్టు । 2024



సీపీని కలిసిన నూతన ఏసీపీలు

విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు బదిలీపై వచ్చిన ఏసీపీలు కె.దామోదర్, ఎం.రాజారావు శుక్రవారం సీపీ రాజశేఖర బాబును మర్యాదపూర్వకంగా కలిశారు



తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, తల్లిపాలకు మించిన ఔషధం మరొకటి లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. ▶IIలో



పలువురు సీఐల బదిలీ

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)లను బదిలీ చేస్తూ సీపీ రాజశేఖరబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ▶IIలో

న్యూస్‌రీల్

స్వర్ణతాపడం పనులకు విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు అనంతపురానికి చెందిన భక్తులు శుక్రవారం విరాళాన్ని అందజేశారు. అనంతపురానికి చెందిన బి.క్రియాన్ష్ లోకిరెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ.1,01,116 విరాళాన్ని అంజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. దాతలను ఈవో కేఎస్ రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.

చాంపియన్‌గా విజయవాడ ఆర్‌పీఎఫ్ జట్టు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ఇంటర్ డివిజనల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజయవాడ ఆర్‌పీఎఫ్ జట్టు వరుసగా నాలుగో సారి టైటిల్ సాధించింది. గత నెల 29 నుంచి 31 వరకు దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్ ఇంటర్ డివిజనల్ వాలీబాల్ టోర్నమెంట్ గుంతకల్లు డివిజన్‌లో జరిగాయి. 31న జరిగిన ఫైనల్‌లో గుంతకల్లు డివిజన్‌తో పోటీపడ్డ విజయవాడ డివిజన్ 25–19, 25–11, 25–14 ఆధిపత్యంతో వరుసగా నాలుగోసారి చాంపియన్‌షిప్ కై వసం చేసుకుంది. విజయవాడ డివిజన్ సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బీటీ, అసిస్టెంట్ డీఎస్‌సీ మధుసూదనరావు జట్టు సభ్యులను అభినందించారు. జట్టు సమష్టి కృషి, అసాధారణ నైపుణ్యంతో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న వాలీబాల్ జట్టును విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు అపర్ణ మృతి



జగ్గయ్యపేటఅర్బన్: కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యురాలు కొడాలి అపర్ణ(48) శుక్రవారం మృతి చెందారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ప్రముఖ వైద్యులు దివంగత కొడాలి నాగేశ్వరరావు నాల్గో కోడలైన అపర్ణ గత 15 ఏళ్లుగా బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఆపార్టీ రాష్ట్ర నాయకుల మన్ననలు పొందారు. ఈమె భర్త కొడాలి మల్లిఖార్జునరావు కూడా ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆమె ప్రస్తుతం పట్టణ బ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. ఆమె మృతి పట్ల బీజేపీ జిల్లా కోర్ కమిటీ మెంబర్ కీసర రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపాగ శ్రీకాంత్, అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, కో కన్వీనర్ బొడ్డు మల్లికార్జునరావు, పట్టణ అధ్యక్షుడు గోలి రాఘవ సంతాపం వ్యక్తం చేశారు.

అధికారిక పేకాట!



ఉమ్మడి జిల్లాలో మళ్లీ మొదలైన శిబిరాలు

- పెనమలూరు, పామర్రు, గుడివాడ, విజయవాడలో విచ్చలవిడిగా జూదం
- తెలుగుదేశం నాయకుల కనుసన్నల్లోనే దందా
- పట్టించుకోని పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: పేకాట మళ్లీ మొదలైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేకాటపై ఉక్కుపాదం మోపగా, టీడీపీ అధికారంలోకి రాగానే మళ్లీ జూదానికి గేట్లు బార్లా తెరుచుకున్నాయి. అధికార కూటమి నేతలకు వారి చినబాస్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో పేకాట కార్యకలాపాలు ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మాట దేవుడెరుగు, పేకాట క్లబ్‌లు మాత్రం తెరుచుకుని, జూదం జోరుగా సాగుతోంది. ఎన్నికల్లో ఇటీవల గెలిచిన ప్రజా ప్రతినిధులకు రోజుకు లక్ష చొప్పున బేరం కుదిరినట్లు పార్టీ వర్గాల్లోనే చర్చ సాగుతోంది. పోలీసులకు సైతం మామూళ్లు సెట్ చేసినట్లు తెలుస్తోంది.

➡ విజయవాడలోని పలు ప్రముఖ లాడ్జిలలో కూడా ఆట నడుపుతున్నారు. పేకాట శిబిరాల వద్ద నగరంలోని ప్రముఖ టీడీపీ నేత ఆటకు అవసరమయ్యే డబ్బులు సమకూర్చి, స్థానిక నేతల కనుసన్నల్లోనే అంతా జరిగేటట్లు చేస్తున్నారు.

పామర్రులో గొలుసుకట్టుగా..

పామర్రు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పేకాట మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. ప్రధానంగా కాజ, జుజ్జువరం, పలకటూరు ప్రాంతాల్లో ఆర్గనైజింగ్ పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారు. దీంతో పాటు గొలుసుకట్టుగా వెంట్రప్రగడ, దోసపాడు, మర్రివాడ, రిమ్మనపూడి, ఊరుటూరు, కొమ్మమూరు, చాగంటిపాడు, రొయ్యూరు, వల్లూరుపాలెంలో సాగుతోంది. ఈ ఆటలన్నీ ఇటీవల గెలిచిన నేతకు తెలిసే సాగుతున్నాయనే ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. ఈ ఆటకు అక్కడ స్థానిక టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలు ఆర్గనైజర్లుగా మారారు.

➡ పెనమలూరు నియోజకవర్గంలో వణుకూరులోని ఖాళీప్లాట్లు, జనచైతన్య ప్లాట్లలో ఈ ఆట సాగుతోంది. ఇద్దరు టీడీపీ నేతల కనుసన్నల్లో నడుస్తోంది. కంకిపాడులోని పరిసర ప్రాంతాలు కోలవెన్నుల్లో ఆట ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గుంటూరు టు గన్నవరం..

గన్నవరం నియోజకవర్గంలో పేకాట ఆడుకునేందుకు అక్కడ ఇటీవల గెలుపొందిన నేత నుంచి క్లియరెన్స్ వచ్చినట్లు సమాచారం. ఆ నేతకు రోజు రూ.70వేలు ఇచ్చేలా పేకాట నిర్వాహకులతో ఒప్పందం కుదిరినట్లు నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. ప్రధానంగా సూరంపల్లి, నున్న, వీరపనేనిగూడెం, పురుషోత్తపట్నం, ముస్తాబాద ఊరు బయట శివారులో ఉన్న మామిడి తోటలు కేంద్రాలుగా మారాయి. అలాగే సూరంపల్లి, బాపులపాడు ప్రాంతాల్లో పేకాట జోరుగా సాగుతోంది. ఇక్కడికి గుంటూరు, చుట్టు పక్కల నుంచి పెద్ద సంఖ్యలో జూదగాళ్లు వచ్చి ఆట ఆడుతున్నట్లు సమాచారం.

గతంలో ఉక్కుపాదం..

గతంలో పలు కుటుంబాలు ఈ వ్యసనానికి బానిసలై దిక్కుతోచక సర్వం కోల్పోయి ఆత్మహత్యలు చోటు చేసుకున్న పరిస్థితులు ఉన్నాయి. పలు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ పరిస్థితులను చూసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేకాట క్లబ్‌లు, జూద క్రీడలపై కఠినంగా వ్యవహరించింది. ఎక్కడైనా పేకాట జరిగినట్లు వార్తలు వస్తే, అక్కడ సంబంధిత స్థానిక పోలీసు అధికారులపై వేటు వేసింది. దీంతో పేకాట శిబిరాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని చోట్ల పేకాట రీ ఓపెన్ అయ్యింది. దీంతో ప్రజలు అప్పుల బారిన పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. కాల్‌మనీ వ్యాపారానికి ఊతం ఇచ్చేలా ఉన్నాయి.

ఇక్కడ కూడా..

మైలవరం నియోజకవర్గంలోని శివారు ప్రాంతాలు, తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గంలో తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో ఈ పేకాట శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ అధినేతల నుంచే గ్రీన్ సిగ్నల్ ఉండటంతో, ఇక్కడ కింది స్థాయిలో పోలీసులు పేకాట జోలికి వెళ్లేందుకు సాహసించటం లేదు. మామూళ్లు తీసుకొంటూ, ప్రేక్షక పాత్రకు పరిమితం అవుతున్నారు. పలువురు సిబ్బంది స్థానిక టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలతో కుమ్మక్కయ్యారు. దీంతో జిల్లాలో గతంలో 2019కి ముందు పరిస్థితులే నెలకొంటున్నాయి.



సకల శుభాల శ్రావణానికి సంసిద్ధం

5 నుంచి ఇంద్రకీలాద్రిపై శ్రావణ మాసోత్సవాలు

- 16న వరలక్ష్మీదేవిగా దుర్గమ్మ దర్శనం
- 18 నుంచి 3 రోజుల పాటు పవిత్రోత్సవాలు
- 23న సామూహిక వరలక్ష్మీవ్రతాలు
- 26న కృష్ణాష్టమి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సకల శుభాల శ్రావణం ఆసన్నమైంది. ఆగస్టు 5వ తేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. ఈ మాసంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకల నేపథ్యంలో దేవస్థానంలో భక్తుల సౌలభ్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాల తరహాలో లక్ష్మీ గణపతి ప్రాంగణంలో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ దర్శనంలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శ్రావణ మాసం రెండో శుక్రవారమైన ఆగస్టు 16వ తేదీన దుర్గమ్మ వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 16న వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారు వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.

3వ వారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణ మాసం మూడో శుక్రవారమైన ఆగస్టు 23వ తేదీన ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతాల గురించి భక్తుల ఆలయ సమాచార కేంద్రం, మైక్ ప్రచార కేంద్రం, టోల్‌ఫ్రీ నంబర్ కార్యాలయాల్లో ఎంక్వయిరీ చేసుకుంటున్నారు. దరఖాస్తులు ఎప్పటి నుంచి ఇస్తారని, ఎవరిని సంప్రదించాలనే విషయాలను అడిగి తెలుసుకుంటున్నారు.

మూడు రోజులు పవిత్రోత్సవాలు

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శ్రావణ శుద్ధ చతుర్దశి శనివారం 18వ తేదీ నుంచి శ్రావణ బహుళ పాడ్యమి సోమవారం 20వ తేదీ వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉదకశాంతి, 18వ తేదీ ఉదయం తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, అనంతరం స్నపనాభిషేకం, నిత్య అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారితో పాటు మల్లేశ్వర స్వామి వారికి ఇతర ఉపాయాలలో దేవతా మూర్తులకు పవిత్ర మాలాధారణ జరుగుతుంది. ఉదయం 9 గంటల తర్వాతే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన, మహాదాశీర్వచనంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. దుర్గగుడిలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అన్ని ప్రత్యేక్ష, పరోక్ష సేవలను నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. 21వ తేదీ నుంచి దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు జరిగే అన్ని ఆర్జిత సేవలు యథావిధిగా జరుగుతాయి.

26న కృష్ణాష్టమి వేడుకలు

దుర్గమ్మ సన్నిధిలో ఆగస్టు 26వ తేదీన కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. 26వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కృష్ణ భగవానుడికి పూజా కార్యక్రమాలు, అనంతరం లక్ష్మీ గణపతి విగ్రహం ఎదురుగా ఉన్న గోశాల వద్ద గోమాతకు పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు మహామండపం కళావేదికపై దేవస్థాన పురాణ పండితులతో ఉపన్యాసం, సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి

డీఆర్‌ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్)లపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ (డీఆర్‌ఎస్‌సీ) సమావేశం జరిగింది. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, డీసీపీ (లా అండ్ ఆర్డర్) గౌతమి శాలి, డీసీపీ (ట్రాఫిక్) కె.చక్రవర్తి, డిప్యూటీ రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, బ్లాక్ స్పాట్‌లు, రహదారి భద్రత ఉల్లంఘనలపై చర్యలు, హిట్ అండ్ రన్, మోటార్ యాక్సిడెంట్ స్కీమ్–2022, ఐ–రాడ్ అమలు, వీఎంసీ సురక్షిత రవాణా ప్రణాళిక, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలను సమీక్షించారు.

ప్రమాదాలు ఇలా..

జిల్లాలో రహదారి ప్రమాదాల వివరాలను డెప్యూటీ రవాణా కమిషనర్ ఎం.పురేంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 2023లో 1,522 రోడ్డు ప్రమాదాల్లో 373 మరణాలు నమోదయ్యాయన్నారు. అదే విధంగా 2024 (జనవరి–జూన్)లో 694 రోడ్డు ప్రమాదాల్లో 209 మరణాలు నమోదయ్యాయని, వీటిలో జాతీయ రహదారులపై ప్రమాదాల వల్ల 104, రాష్ట్ర హైవేలపై ప్రమాదాల వల్ల 41, ఇతర రహదారులపై ప్రమాదాల వల్ల 64 మరణాలు సంభవించాయని వివరించారు.

సమన్వయంతో పనిచేయాలి..

అనంతరం కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ అధికారులు నిబద్ధతతో, సమన్వయంతో పనిచేసి రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో తనిఖీలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఐ–రాడ్ యాప్‌లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రిజిస్టర్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా విజయవాడలో ట్రాఫిక్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు రియల్‌టైమ్ డేటా విశ్లేషణతో ప్రణాళిక రూపకల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వీఎంసీ అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, డీపీవో ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్, డీసీహెచ్‌ఎస్ బీసీకే నాయక్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ వీకే విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కాలేయాన్ని కాటేసే హెపటైటిస్!

అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమే!

- ఉమ్మడి జిల్లాలో 20 వేల మందికిపైగా బాధితులు
- టీకాతో హెపటైటిస్ బీ నివారణ, సీకి అందుబాటులో మంచి మందులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): హెపటైటిస్.. అంటే కాలేయ వాపు జబ్బు. మనకు తెలియకుండానే శరీరంలోకి వైరస్ ప్రవేశించి, క్రమేణా లివర్‌ను దెబ్బతీసే ప్రాణాంతక హెపటైటిస్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 20 వేల మందికిపైగా హెపటైటిస్ రోగులు ఉన్నట్లు అంచనా. ఇటీవల కాలంలో లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు మన ప్రాంతంలో కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. అందుకు హెపటైటిస్ కారణంగా లివర్ దెబ్బతినడమే ప్రధాన కారణమని వైద్యులు వివరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు హెపటైటిస్ రోగులు క్యూ కడుతున్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌ల వద్దకు వచ్చే వారిలో పదిశాతం మంది హెపటైటిస్‌లతో చికిత్సల కోసం వస్తున్నారు.

బీ, సీలకు చికిత్స..

హెపటైటిస్ బీ వైరస్ సోకకుండా ముందస్తు టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఆరు నెలల వ్యవధిలో మూడో డోసులు టీకాలు వేయించుకోవడం ద్వారా హెపటైటిస్ బీ సోకకుండా పూర్తిగా నివారించవచ్చు. అదే విధంగా హెపటైటిస్ సీకి సంబంధించి ప్రస్తుతం మంచి మందులు తక్కువ ధరలో అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఒకప్పుడు సీ వైరస్‌ను 50 శాతం మేరకు మాత్రమే నియంత్రించగలిగేవారు. ఆధునిక మందులతో 90 నుంచి 100 శాతం నివారించగలుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆల్కాహా లిక్ హెపటైటిస్‌కు సైతం వైద్యుల సలహా మేరకు మందులు వాడటం ద్వారా సత్ఫలితాలు పొందవచ్చు.

లక్షణాలు గుర్తించవచ్చు..

వైరల్ హెపటైటిస్ కారణంగా కామెర్లు వ్యాధి సోకిన వారిలో ఆకలి మందగించడం, మూత్రం పచ్చగా రావడం, వికారం, వాంతులు వంటివి ఉంటాయి. ఆ లక్షణాలు కనిపించిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి. కళ్లు పచ్చగా అవడం, శరీరంపై దురదలు రావడం, విరోచనం తెల్లగా అవడం జరుగుతుంది.

హెపటైటిస్ నివారించదగినదే..



హెపటైటిస్ వైరస్ నివారించదగినదే. ముందస్తుగా హెపటైటిస్ బీ టీకా వేయించుకోవడం ద్వారా వ్యాధి రాకుండా చూడవచ్చు. హెపటైటిస్ సీకి సంబంధించి మంచి మందులు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ధరతో లభించే మందులతో 90 నుంచి 100శాతం పూర్తిగా నివారించగలుగుతున్నాం. ఆల్కాహాల్ తాగడం వల్ల హెపటైటిస్ బారిన పడుతున్న వారు మా వద్దకు వస్తున్నారు. కుటుంబంలో ఒకరికి హెపటైటిస్ బీ పాజిటివ్ వచ్చినప్పుడు కుటుంబ సభ్యులంతా పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ సూరే పవన్‌కుమార్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, విజయవాడ

హెపటైటిస్ అంటే..

ఇది కాలేయానికి సంబంధించిన వైరస్. దీని కారణంగా కాలేయానికి వాపు వస్తుంది. దీనిలో అనేకరకాలున్నప్పటికీ హెపటైటిస్ ఏ, బీ, సీ, ఇ వైరస్‌లు మన ప్రాంతంలో అధికంగా సోకుతున్నాయి. వాటిలో కలుషిత ఆహారంలో ఉండే ఫీకో వైరస్ కారణంగా ఏ, ఇ వైరస్‌లు సోకుతాయి. వీటిని సకాలంలో సరైన చికిత్స పొందడం ద్వారా సులువుగా నివారించవచ్చు. ఇక హెపటైటిస్ బీ, సీలకు సంబంధించి నిపుణులైన వైద్యుల వద్ద చికిత్స పొందాల్సిన అవసరం ఉంటుంది. వాటిని అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఆల్కాహాల్ వల్ల కలిగే హెపటైటిస్ కేసులు అధికంగా చూస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

హెపటైటిస్ సోకడానికి కారణాలు..

కలుషిత నీరు, ఆహారం కారణంగా హెపటైటిస్ ఏ, ఇ, వైరస్‌లు సోకుతాయి. వాటి ఫలితంగా పిత్తాశయంలో పసర చేరి కామెర్లు వచ్చే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆల్కాహాల్ తాగడం, వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు, పసర మందులు, నాటు మందులు వాడటం, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్ వంటివి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. కాగా రక్త మార్పిడి, సిరంజీలు ఇద్దరు, ముగ్గురు వాడటం, పసరబొట్టు వేయించుకునే వారికి కూడా హెపటైటిస్ వచ్చే అవకాశం ఉంది

సారె తెచ్చి.. మనసారా కొలిచి..



దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేస్తున్న భద్రాచలం ఈవో రమాదేవి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం పలువురు భక్తులు కుటుంబ సమేతంగా, భక్త బృందాలు, ఆధ్యాత్మిక బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. అనంత్ డైమండ్స్ (ఏఎస్‌ఆర్) బృందానికి చెందిన 50 మంది, వైజాగ్‌కు చెందిన వల్లూరి మహేష్ బృందానికి చెందిన 30 మంది, హైదరాబాద్‌కు చెందిన వెంకట నారాయణ బృందానికి చెందిన 26 మంది, విజయవాడ శ్రీలక్ష్మీనగర్ కాలనీకి చెందిన 50 మంది బృందం, రాజరాజేశ్వరిపేటకు చెందిన కె.సునీత బృందానికి చెందిన 30 మందితో పాటు నగరంలోని వివిధ కాలనీలు, అపార్టుమెంట్లు, ఉమ్మడి కుటుంబాలకు చెందిన మరో 30 బృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేసి అమ్మవారి కుంకుమను ప్రసాదంగా అందజేశారు.

దుర్గమ్మకు భద్రాద్రి రాముల వారి సారె

భద్రాచలం రాములవారి దేవస్థానం నుంచి శుక్రవారం ఆషాఢ సారె వచ్చింది. అమ్మవారికి సారె సమర్పించేందుకు భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి వారి దేవస్థాన ఈవో ఎల్. రమాదేవి ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ ఏఈవో ఎస్. రమేష్ బాబుస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పట్టుచీర, పూజా సామగ్రిని, పసుపు, కుంకుమను అర్చకులకు అందజేశారు. అనంతరం ఆమెకు దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలను బహూకరించారు.

జాతీయ స్థాయికి ఏడు ప్రాజెక్ట్‌లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వంలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ అటల్ మారథాన్ పేరుతో ఏటా నిర్వహించే సైన్స్ ప్రాజెక్ట్‌ల పోటీలకు జిల్లా నుంచి ఏడు ప్రాజెక్ట్‌లు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో వేలాది ప్రాజెక్ట్‌లు పోటీకి రాగా అందులో 500 ప్రాజెక్ట్‌లను అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఎంపిక చేసిందని ఆయన పేర్కొన్నారు. అందులో 35 ప్రాజెక్ట్‌లు ఏపీ నుంచి ఎంపిక కాగా.. వాటిలో ఏడు ఎన్టీఆర్ జిల్లావి ఉన్నాయని వివరించారు. ఎంపికై న వాటిలో ఏపీ బాలయోగి గురుకులం నుంచి ఐదు, ప్రభుత్వ ఉర్దూ పాఠశాల నిడమానూరు నుంచి ఒకటి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్ (బాయ్స్) నుంచి ఒకటి చొప్పున మొత్తం ఏడు ప్రాజెక్ట్‌లు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సైన్ అధికారి హుస్సేన్‌తోపాటు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

9న వ్యవసాయరంగ పరిరక్షణ కోరుతూ నిరసనలు

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలని, వారి దోపిడీని అరికట్టి వ్యవసాయాన్ని పరిరక్షించాలని మాజీ మంత్రి, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు రైతులకు పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన క్విట్ ఇండియా రోజున బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

తిరుపతమ్మవారి ఆలయ ఈవోగా లీలాకుమార్

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయ ఈవోగా జీవీడీఎస్ లీలాకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ శ్రీకనకదుర్గమ్మవారి ఆలయ డెప్యూటీ ఈవోగా ఉన్న లీలాకుమార్ అమ్మవారి ఆలయానికి ఎఫ్ఏసీగా అమ్మవారి సన్నిధిలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో కె.రమేష్‌నాయుడును జీఏడీకి రిపోర్ట్ చేయమన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. లీలాకుమార్ గతంలో కూడా కొంతకాలం అమ్మవారి ఆలయ ఈవోగా పనిచేశారు.

కూలింగ్ కెనాల్లో వ్యక్తి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. కాలువ గేట్-2 వద్ద మృతదేహాన్ని గుర్తించిన సంస్థ అధికారులు పోలీస్‌లకు శుక్రవారం సాయంత్రం సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వయస్సు 55-60 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎత్తు 5.6 అడుగులు, తెలుపు నలుపు రంగు జుట్టుతో బట్టతల కలిగి ఉన్నాడన్నారు. తెలుపు ఆకుపచ్చ రంగుల డిజైన్ కలిగిన హాఫ్‌హ్యాండ్ షర్ట్, నలుపు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27084, 93906 81266 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని సీఐ ఎం.సత్యన్నారాయణ కోరారు.

కాలువ కట్టలే...వారికి నోట్ల కట్టలు

- గోసాలలో బందరు కాలువ కట్ట ఆక్రమణ
- శృతిమించిపోతున్న టీడీపీ నేతల దందా
- చేతులు మారుతున్న రూ.లక్షలు
- చోద్యం చూస్తున్న అధికారులు

కాదేదీ ఆక్రమణలకనర్హం అన్నట్టు టీడీపీ నేతలు ఏకంగా బందరు కాలువ కట్టనే ఆక్రమించేస్తున్నారు. మనదే రాజ్యం... అడ్డుకునేదెవ్వడు...అన్న చందాన అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారు. కేకు ముక్కలు కోసి పంచిపెడుతున్నట్టుగా... పట్టపగలే యథేచ్ఛగా జేసీబీలతో కాలువ కట్టను చదును చేసేస్తున్నారు. ముక్కలు ముక్కలుగా చేసి హద్దులు పాతి సెంటు రూ.6 లక్షల చొప్పున విక్రయించేస్తున్నారు. లక్షలకు లక్షలు జేబుల్లోకి నెట్టేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కళ్లుండీ చూడలేని గుడ్డివాళ్లలా వ్యవహరిస్తుండడాన్ని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

పెనమలూరు: కృష్ణా జిల్లా రైతులకు సాగునీరు అందించే బందరు కాలువ కట్టపై టీడీపీ నేతల కళ్లు పడ్డాయి. రైతుల నోట్లో మట్టి కొట్టడానికి కాలువ కట్టను ఆక్రమించుకునే పనిలో పడ్డారు. రూ.లక్షల సొమ్ములు చేతులు మారిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం...వివరాల్లోకి వెళితే గోసాల వైకుంఠపురం ప్రాంతంలో బందరు కాలువ కట్ట ఉంది. దాదాపు రెండు ఎకరాల కాలువ కట్టను ఎవరూ ఆక్రమించకుండా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాలువ కట్టలు ఆక్రమిస్తే సాగు చేసే రైతులకు ఇబ్బందులు కలుగుతాయని గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నేతలు బందరు కాలువ కట్టపై కన్ను వేశారు. కాలువ కట్టను ఆక్రమించి సెంటు రూ.6 లక్షలకు విక్రయించే పనిలో ఉన్నారు. టీడీపీ నేతలు కాలువ కట్టలు ఆక్రమించి హద్దులు పెట్టుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని దిగమింగటానికి సిద్ధంగా ఉన్నారు.

జేసీబీతో రంగంలోకి దిగిన టీడీపీ నేతలు

..వైకుంఠపురంలో నీటిపారుదల శాఖకు సంబంధించి అత్యంత విలువైన బందరు కాలువ కట్టను ఆక్రమించుకోవటానికి శుక్రవారం జేసీబీతో సహా టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. కొంత ప్రాంతం పిచ్చి మొక్కలు తొలగించి చదును చేశారు. హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. సెంటు స్థలానికి రూ.6 లక్షల చొప్పున బేరం కుదుర్చుకున్నారని సమాచారం. నేడో రేపో కాలువ కట్ట స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి ఇళ్లు నిర్మించుకోవాలని సన్నాహాలు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వంతెన వద్ద రెండు బడ్డీ కొట్లు పెట్టించారు. వంతెన మలుపు వద్ద పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదంగా ఉన్నా టీడీపీ నేతలు వారి అనుచరులతో బడ్డీ కొట్లు పెట్టించినా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో మరో అడుగు ముందుకు వేసి ఇప్పుడు ఏకంగా రెండెకరాల బందరు కాలువ కట్టను ముక్కలు ముక్కలుగా చేసి సెంటు రూ.6 లక్షల చొప్పున అమ్మటానికి ప్రణాళిక సిద్ధం చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



గోసాలలో జేసీబీతో చదును చేసిన నీటిపారుదల శాఖ స్థలం. (ఇన్‌సెట్‌లో) టీడీపీ నేతలు ఆక్రమించి పరదాలు కట్టిన కాలువ కట్ట స్థలం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

..టీడీపీ నేతలు కాలువ కట్టను ఆక్రమించటంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చాలా కాలం నుంచి ఇక్కడే ఉంటున్నామని తాము కూడా ఆక్రమించుకుంటామని సరిహద్దు పుల్లలు పాతారు. అయితే నీటి పారుదల శాఖ అధికారులు వచ్చి స్థానికులు వేసిన పుల్లలు తొలగించారు. అయితే ఎమ్మెల్యే తాలూకా అని చెప్పుకుంటూ కొందరు ఆక్రమించి పరదాలు కట్టినా వాటిని మాత్రం అధికారులు తొలగించలేదు. అధికారులు వారి ఆక్రమణలు తొలగించకపోతే తాము కూడా బందరు కాలువను ఆక్రమించుకుంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా మొద్దు నిద్రలో ఉన్న అధికారులు ఏమాత్రం స్పందించటం లేదు. కాలువ కట్టను దారాదత్తం చేసి టీడీపీ నేతల దందాకు వదిలేస్తే చూస్తూ ఊరుకోమని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితి కనబడుతోంది.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

గుణదల(విజయవాడతూర్పు): శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, తల్లిపాలకు మించిన ఔషధం మరొకటి లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా క్రీస్తురాజపురం అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు పాలివ్వటం వలన తల్లుల శారీరక సౌందర్యం తగ్గుతుందనే భావనను విడిచిపెట్టాలని సూచించారు. తల్లిపాల ద్వారా బిడ్డలకు కలిగే ప్రయోజనాల దృష్ట్యా తల్లులు చనుబాలు తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. గర్భస్థ శిశువుల ఎదుగుదలకు తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 1475 అంగన్వాడీల ద్వారా 10,251 మంది గర్భిణులకు, 7,125 మంది బాలింతలకు, 50,633 చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందజేసి అంగన్వాడీ కేంద్ర నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ సీడీపీఓ జి.మంగమ్మ, సూపర్‌వైజర్ రెహానా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, డాక్టర్ మాధురి, సోషల్ వర్కర్ నిస్సార్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై ఆగంతకుడి దాడి

బంగారం, సెల్‌ఫోన్ చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి మూడు కాసుల బంగారం గొలుసు, సెల్‌ఫోన్ చోరీ చేసిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, సేకరించిన వివరాల ప్రకారం కేఎల్ రావు నగర్ సిండికేట్ బ్యాంక్ కాలనీలో చీమకుర్తి సంధ్య(67) నివాసం ఉంటున్నారు. ఆమె భర్త వల్లభాయి పటేల్ సిండికేట్ బ్యాంక్ మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. వారికి వివాహాలు కావడంతో విడిగా ఉంటున్నారు. కరోనా సెకండ్ వేవ్ సమయంలో భర్త మృతి చెందగా, అప్పటి నుంచి సంధ్య ఒంటరిగానే ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఆకు కూరలు అమ్మే వ్యక్తి వచ్చాడు. ఆకుకూరలు కొనుగోలు చేసి డబ్బులు తెచ్చేందుకు ఆమె వంట గదిలోకి వెళ్లగా, వెనుక నుంచి ఓ వ్యక్తి లోపలకు వచ్చి ఆమె రెండు చేతులు పట్టుకుని ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. కొంత సమయం తర్వాత మెలకువ రాగా, తన మెడలోని మూడు కాసుల బంగారపు చైను, సెల్‌ఫోన్‌ను కనిపించకపోవడంతో ఆగంతకుడు దాడి చేసి వాటిని చోరీ చేసినట్లు గుర్తించింది. అనంతరం మేడపై రెండో అంతస్తులో ఉన్న కోటేశ్వరమ్మకు, తన రెండో కుమార్తె మిధునకు ఫోన్‌లో జరిగిన ఘటన గురించి వివరించింది. సమాచారం అందుకున్న కొత్తపేట సీఐ గణేష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడి వేలిముద్రలు, ఆనవాళ్ల కోసం వంట గదిని పరిశీలించారు. సంఘటనా స్థలాన్ని లా అండ్ ఆర్డర్-2 డీసీపీ హరికృష్ణ, ఏసీపీ మురళీకృష్ణారెడ్డి తదితరులు పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు నమోదు చేసుకుని కేసు నమోదు చేశారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ హరికృష్ణ, తదితరులు

10,11 తేదీల్లో కృష్ణాజిల్లా స్థాయి చెస్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్: కృష్ణాజిల్లా అండర్-9, 13 బాలబాలికల చదరంగం పోటీలను ఈ నెల 10, 11 తేదీల్లో మచిలీపట్నంలో నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్ తెలిపారు. అండర్-13 పోటీలను 10వ తేదీన, అండర్-9 పోటీలు 11న నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఆరు గంటల లోపు 81254 44413, 70130 98522, 97007 75220 నంబర్లను సంప్రదించి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని, అండర్-9 జట్టుకు ఎంపికైన క్రీడాకారులు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు, అండర్-13 జట్టుకు ఎంపికై న క్రీడాకారులు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ సమీపంలో నివసిస్తున్న మైనర్ బాలిక(17) ఇంటర్ వరకూ చదివి ఇంటి వద్దే ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన సస్పెక్ట్ షీటర్ నెలపట్ల ప్రేమ్‌కుమార్ ప్రేమ పేరుతో వెంటపడేవాడు. ఈ క్రమంలో బాలికను ప్రేమ్‌కుమార్ గురువారం రాత్రి గుణదలలోని అతని బంధువుల ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలువురు సీఐలకు స్థానచలనం

కోనేరు సెంటర్: ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల పరిధిలో భారీగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ)ను బదిలీ చేస్తూ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పనిచేస్తున్న 41 మంది సీఐలకు స్థానచలనం కలిగింది.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎస్.వెంకటనారాయణ	డీపీటీసీ, మచిలీపట్నం	గన్నవరం ట్రాఫిక్-2
ఏఎల్ఎస్ రవికుమార్	గన్నవరం ట్రాఫిక్-2	వీఆర్, ఏలూరు రేంజ్
జి.మురళీకృష్ణ	వీఆర్, ఏలూరు రేంజ్	కంకిపాడు
వి.శ్రీనివాసరావు	కంకిపాడు	వీఆర్, ఏలూరు రేంజ్
టీవీవీ రామారావు	పెనుమలూరు	ఉయ్యూరు టౌన్
ఎండీ హమీద్ బాషా	ఉయ్యూరు టౌన్	వీఆర్, ఏలూరు రేంజ్
ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు	పీసీఆర్, మచిలీపట్నం	గుడివాడ రూరల్
కె.యేసుబాబు	గుడివాడ రూరల్	వీఆర్, ఏలూరు రేంజ్
వి.పెద్దిరాజు	గన్నవరం ట్రాఫిక్	గుడివాడ టూటౌన్
ఎం.నాగదుర్గారావు	గుడివాడ టూటౌన్	వీఆర్, ఏలూరు రేంజ్

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో...

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీఐలను బదిలీ చేస్తూ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న అనేకమందికి పోస్టింగ్ ఇచ్చారు. ఆయా స్టేషన్లలో పనిచేస్తున్న పలువురిని ఏలూరు రేంజికి సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. వేకెన్సీ రిజర్వు(వీఆర్)లో ఉన్న సీఐ వై.రవికుమార్‌ను ఐదో ట్రాఫిక్ స్టేషన్‌కు, వి.పవన్‌కిషోర్‌ను పటమట, సి.హెచ్.ప్రకాష్‌ను మాచవరం, పి.కృష్ణమోహన్‌ను నున్నస్టేషన్‌కు, బి.బి.రవికుమార్‌ను టాస్క్‌ఫోర్స్‌కు, పి.సత్యానందంను సీఎస్‌బీకి, కె.వి.కృష్ణకుమార్‌ను సీసీఆర్‌బీకి, ఎ.చంద్రశేఖర్‌ను టాస్క్‌ఫోర్స్, ఐడీ సువర్ణరాజును మూడో ట్రాఫిక్‌స్టేషన్‌కు, బి.బాలమురళీకృష్ణను ఐదో ట్రాఫిక్ స్టేషన్‌కు, అబ్దుల్ సలాంను సీసీఎస్‌కు, కె.సతీష్‌ను సీఎస్‌బీకి, పి.శ్రీనివాసరావును సీసీఎస్‌కి, బి.సత్యనారాయణను పీసీఆర్‌కి, వి.జానకీరామయ్యను సైబర్ సెల్‌కి, పి.ఎం.రామకృష్ణను సీఎస్‌బీకి, కె.వాసవిని మహిళ స్టేషన్‌కు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వి.కోటేశ్వరరావును నాలుగో ట్రాఫిక్‌స్టేషన్‌నుంచి సీఎస్‌బీకి, షేక్ అహ్మద్‌అలీని మూడో ట్రాఫిక్‌స్టేషన్ నుంచి సీసీఎస్‌కు, ఎస్.వి.వి.లక్ష్మీనారాయణను పీసీఆర్ నుంచి సీసీఎస్‌కు, పి.సత్యశ్రీనివాస్‌ను సీసీఆర్‌బీ నుంచి సీఎంఎస్‌కు, కె.కిషోర్‌బాబును మైలవరం నుంచి మూడో ట్రాఫిక్‌స్టేషన్‌కు ఎన్.మురళీకృష్ణను టాస్క్‌ఫోర్స్ నుంచి సీసీఎస్‌కు, యు.రామారావును పీసీఆర్ నుంచి నాలుగో ట్రాఫిక్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్.దుర్గాప్రసాద్‌ను నున్నస్టేషన్ నుంచి రెండో ట్రాఫిక్‌స్టేషన్‌కు, ఎల్.గౌరినాయుడును పోలీస్ కమిషనరేట్ నుంచి సోషల్ మీడియా సెల్‌కు, సి.హెచ్.నాగశ్రీనివాస్‌ను సోషల్‌మీడియా సెల్ నుంచి సైబర్‌సెల్‌కి, కె.శివాజీని సైబర్‌సెల్ నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు, జి.గురుప్రకాష్‌ను అజిత్‌సింగ్‌నగర్ నుంచి వన్‌టౌన్‌కు, ఎం.సత్యనారాయణను ఇబ్రహీంపట్నం నుంచి గవర్నర్‌పేటకు కె.ఉమామహేశ్వరరావును సీఎస్‌బీ నుంచి భవానీపురం స్టేషన్‌కు బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.ఎస్.ఎస్.వి.నాగరాజు, సీసీఎస్ సీఐలు జి.శంకర్‌నాయక్, టి.చంద్రశేఖర్, సీఎస్‌బీ సీఐ ఐ.వి.నాగేంద్రకుమార్, మహిళా స్టేషన్ సీఐ ఎండీ అహ్మదున్నీసా, మాచవరం సీఐ బి.గుణరామ్‌లను వేకెన్సీ రిజర్వ్(వీఆర్)కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 16మంది సీఐలను ఏలూరు రేంజికి సరెండర్ చేశారు. ఏలూరు రేంజికి సరెండర్ చేసిన వారిలో ఎం.కృపానందం(ఐదో ట్రాఫిక్), జి.దుర్గారావు(నాలుగవ ట్రాఫిక్), డి.కె.ఎన్.మోహన్‌రెడ్డి(పటమట) నున్న రాజు(ఐదో ట్రాఫిక్), ఆర్.సురేష్‌రెడ్డి(సీఎస్‌బీ), ఆర్.విజయ్‌కుమార్(మూడో ట్రాఫిక్), ఎస్.పరమేశ్వర్(సీసీఎస్), డి.కాశీవిశ్వనాథ్(సీఎస్‌బీ), ఎ.శ్రీనివాసరావు(సీసీఎస్), టి.గణేష్(టుటౌన్), షేక్ అబ్దుల్‌నబీ(తిరువూరు), బి.వెంకటేశ్వరరావు(వన్‌టౌన్),షెహరున్నీసాబేగం(కమిషనరేట్),వై.రాంబాబు(సీసీఎస్), డి.దుర్గాశేఖర్‌రెడ్డి (వన్‌టౌన్), డి.వి.రమణ (గవర్నర్‌పేట) ఉన్నారు.

సెంట్రల్ జోన్ క్రికెట్‌లో పరుగుల వరద



మూలపాడు(ఇబ్రహీంపట్నం): కృష్ణా, ప్రకాశం జిల్లా జట్ల మధ్య మూలపాడు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న సెంట్రల్ జోన్ సీనియర్ మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లో రెండోరోజు శుక్రవారం పరుగుల వరద పారింది. కృష్ణా, ప్రకాశం జిల్లా జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో మొదటిరోజు తొలి ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 348/4తో కృష్ణా జట్టు బ్యాటింగ్ ప్రారంభించింది. తొలిరోజు 167 పరుగులు చేసి నాటవుట్‌గా నిలిచిన వై.సందీప్ రెండవ రోజు కూడా వీరవిహారం చేసి బౌలర్లు, ఫీల్డర్లకు చుక్కలు చూపించాడు. 471 బంతులు ఎదుర్కొని 58 ఫోర్లు, 8 సిక్సలతో మొత్తం 405 పరుగులు చేసి నాటవుట్‌గా నిలిచాడు. సందీప్ విధ్వంసకర బ్యాటింగ్‌తో కృష్ణా జట్టు 156.4 ఓవర్లలో 9 వికెట్లకు 715 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రకాశం జట్టు ముందుంచింది. ప్రణీత్ 72, విశ్వనాథ్ 64 పర్వాలేదనిపించారు. ప్రకాశం జట్టులో వేణు 3 వికెట్లు, బాలాజీ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జిల్లా జట్టు 8 ఓవర్లు ఎదుర్కొని ఒక వికెట్ కోల్పోయి 37 పరుగులు చేసింది.

ఆటో బోల్తా పడి కార్పెంటర్ దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): అతివేగంగా వెళ్తున్న ఆటో బోల్తా కొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో నివాసం ఉంటున్న దేవిరెడ్డి నాగేశ్వరరావు(51) వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య రమణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న అతని తోడల్లుడు మల్లాడి అంజయ్య ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇద్దరూ కలిసి ఆటోలో బెంజిసర్కిల్ వైపునకు వెళ్లారు. అంజయ్య ఆటో నడుపుతుండగా నాగేశ్వరరావు అతని పక్కన కూర్చున్నాడు. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో రాణిగారితోటలోని గుడ్ మార్నింగ్ హోటల్ ఎదురుగా ఫీడర్ రోడ్డులోకి ఆటో దిగుతుండగా ఆటో వేగానికి డ్రైవర్ పక్కనే కూర్చున్న నాగేశ్వరరావు కింద పడిపోయాడు. ఆ వెంటనే ఆటో అతని మీద పడింది. చుట్టుపక్కల వారు అప్రమత్తమై వెంటనే ఆటోను పైకి లేపారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నాగేశ్వరరావును పరీక్షించి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అంజయ్యను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ జగదీశ్వరరావు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మద్యం మత్తులో అతివేగంగా ర్యాష్ డ్రైవింగ్ చేయడం వలనే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీతమ్మ వారి పాదాలు ఎదురుగా కృష్ణానది నీటిలో మృతదేహం తేలుతున్నట్లు శుక్రవారం ఉదయం 11 గంటలకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నది నుంచి బయటకు తీశారు. మృతదేహం గుర్తు తెలియని యువకుడిది అని, ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. ఒంటి మీద కేవలం నలుపు రంగు డ్రాయర్ మాత్రమే ధరించి ఉన్నాడని, సుమారు 25 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గానీ, 94920 28570 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి సహకరించండి



పటమట(విజయవాడతూర్పు):డివిజన్లలో సమస్యల పరిష్కారానికి అధికారులు కార్పొరేటర్లకు సహకారం అందించాలని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యం తెలిపారు. శుక్రవారం ఆయన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను కలిశారు. తమ డివిజన్లలో ఉన్న సమస్యలపై, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేయటానికి తాను కౌన్సిల్ సభ్యులకు సహకరిస్తామని పేర్కొన్నారు.

5 నుంచి సిద్ధార్థలో ప్లాస్మా ఎగ్జిబిషన్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసర్చ్ (అణు శక్తి విభాగం) సంయుక్తంగా ఈ నెల 5 నుంచి 9 తేది వరకు ఐదు రోజుల విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ప్లాస్మా ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ అకాడమీ సలహాదారుడు ప్రొఫెసర్ కెఎల్.మోహన్‌రావు చెప్పారు. ప్లాస్మా ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా 32 ప్లాస్మా నమూనాలతో కూడిన ప్రదర్శన నగరంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం. రమేష్, డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కళాకారుల శ్రమ వెలకట్టలేనిది



లబ్బీపేట(విజయవాడతూర్పు): మన కళాకారులు నేసిన ప్రతిదారం సాంప్రదాయం, నైపుణ్యం, అంకితభావాన్ని చెబుతుందని, చేనేత కళాకారుల శ్రమ వెలకట్టలేనిదని మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఎంజీరోడ్డులోని శ్రీ శేషసాయి కళ్యాణ మండపంలోని సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం అనురాధ మాట్లాడుతూ తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. చేనేత కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనలో 20 రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు నేసిన వస్త్రాలను ప్రదర్శించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా బి.సుగుణ నియమితులయ్యారు. ఆమె శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గొల్లపూడిలో ఆర్‌అండ్‌ఆర్ నుంచి బదిలీపై రూరల్ మండలానికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో తహసీల్దారు సమావేశం నిర్వహించారు. గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన పి.జాహ్నవి కంచికచర్ల మండలానికి బదిలీ అయ్యారు.

హోంగార్డ్ కుటుంబాలకు ఆర్థిక చేయూత



విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్ హోంగార్డ్స్ యూనిట్ నందు విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన యాగంటి కోటేశ్వరరావు, మోహనరావు కుటుంబాలకు కమిషనరేట్‌లో పని చేస్తున్న తోటి హోంగార్డులు బాసటగా నిలిచారు. మృతుల కుటుంబాల ఆర్థిక ఆసరాకు హోంగార్డ్‌లు అందరూ కలిసి వారి ఒక్క రోజు వేతనాన్ని సమకూర్చారు. ఈ నగదు చెక్కులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా కమిషనరేట్‌లో కోటేశ్వరరావు భార్య నాగలక్ష్మికి, మోహనరావు భార్య ప్రమీళకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున అందించారు.

శాకంబరీదేవీగా నాగమానసాదేవి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు.





జగన్మాతా.. కాపాడమ్మా..

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివస్తున్నారు. భక్త, భజన, ఆధ్యాత్మిక బృందాలు శుక్రవారం ఇంద్రకీలాద్రికి చేరుకొని దుర్గమ్మకు సారె సమర్పించారు. కొందరు మహిళలు మెట్ల పూజ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. జగన్మాతా...మమ్మల్ని కాపాడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకుంటున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో కొండంతా పండుగ వాతావరణం నెలకొంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







నేడు 220 కేవీ లైన్‌ల ఆధునికీకరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుణదలలోని ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ ఉపకేంద్రం, వీటీపీఎస్ మధ్య ఉన్న లైన్‌లు ఆధునికీకరణలో భాగంగా కొన్ని మార్పులు చేయాల్సి ఉన్నందున ఆ పనులు శనివారం నిర్వహించనున్నట్లు గుణదల ఓ అండ్ ఎం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యం. ఈశ్వరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా వీటీపీఎస్-గుణదల 220 కేవీ లైనులో (ఒక సర్క్యూట్) విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. దాని వలన సాధారణంగా ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కానీ అత్యవసర పరిస్థితి ఏర్పడితే మాత్రం సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చునని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలని కోరారు.

5న పేరంటాలమ్మ శ్రావణమాస పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 5 నుంచి శ్రావణ మాస విశేష పూజలు ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా నిర్వహించే పూజలు సెప్టెంబరు 3 వరకూ జరుగుతాయన్నారు. ఈ నెల రోజులు పరోక్షముగా పూజలు జరుగుతాయని, మాసాంతరం అమ్మవారి ప్రత్యేక ప్రసాదం, కుంకుమ, అక్షింతలు భక్తులకు అందజేస్తామన్నారు.

రివర్ ఫ్రంట్ పార్కు పరిశీలన



రివర్‌ఫ్రంట్ పార్కును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



స్టేడియంలో క్రీడాకారులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు):కృష్ణానది వెంబడి నిర్మించిన రిటైనింగ్ వాల్ దగ్గర, వర్షం నీరు, వాడుక నీరు బయటకు వెళ్లే దారి లేక మురుగునీరుగా మారుతోందని అక్కడ నివసిస్తున్న ప్రజలు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రకు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు తమ సమస్యలను వివరించారు. మురుగునీరు పోయేందుకు శాశ్వత పరిష్కారంగా డ్రెయిన్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన రివర్ ఫ్రంట్ పార్కులో ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆయన రామలింగేశ్వర నగర్ ఎస్టీపీని పరిశీలించారు. వాటర్ ట్రీట్మెంట్‌లో జరుగుతున్న ప్రాసెస్‌ని చూశారు. ఆధునికీకరణలో భాగంగా పనులన్నీ త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఈఈలు వెంకటేశ్వరరెడ్డి, జి.సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

మెడల్స్ వచ్చేలా కోచింగ్ ఇవ్వండి

నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన స్టేడియాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఒలింపిక్స్‌లో విజయాలు సాధించేలా కోచింగ్ ఇవ్వాలని, క్రీడాకారులకు సకల సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. దండమూడి రాజగోపాలచారి ఇండోర్ స్టేడియంను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న కోచ్‌ల నుంచి పలు అంశాల గురించి మాట్లాడారు. స్టేడియాల్లో క్రీడాకారులకు క్రీడా నైపుణ్యం పెంచేందుకు అవసరమైన వసతులను కల్పించాలని, మరమ్మతులు త్వరతిగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ పర్యటనలో డీఎఫ్ఓ - డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ డి.మాల్యాద్రి, ఎస్ఎఫ్ఓ యం.రాజా, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, పాల్గొన్నారు.

● అధినేతతో ఆత్మీయ భేటీ



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు కలిశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పింగళి వెంకయ్య జీవితం స్ఫూర్తిదాయకం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతిని విజయవాడ రైల్వే డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం పీఈ ఎడ్విన్ రైల్వేస్టేషన్ సమీపంలోని పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవితం నుంచి నేటి తరం ఎంతో విలువైన పాఠాలు నేర్చుకోవచ్చని తెలిపారు. అమితమైన దేశభక్తితో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని నిస్వార్థమైన సేవలు అందించారని కొనియాడారు. జాతీయ పతాకం రూపకల్పనలో ఎంతో దూరదృష్టితో సర్వమతాల సమ్మేళనం, సత్యం, అహింస అనే చిహ్నలతో అందరి నుంచి ప్రశంసలు పొందారని కొనియాడారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో దేశ సమైక్యత కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయోద్యమంలో పింగళి పాత్ర చిరస్మరణీయం

విజయవాడ కల్చరల్: జాతీయ ఉద్యమంలో పింగళి వెంకయ్య పాత్ర చిరస్మరణీయమైనదని అంతర్జాతీయ వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఏపీ నటీనట వృత్తి కళాకారుల సంఘం, పింగళి వెంకయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం బాపూ మ్యూజియంలోని పింగళి వెంకయ్య విగ్రహం వద్ద 148వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు పింగళి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.



పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఏడీఆర్ఎం ఎడ్విన్

హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ తెలుగు వారి కీర్తి పతాకాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు పింగళి వెంకయ్య అని అభివర్ణించారు. మహాత్మా గాంధీ అనుచరునిగా జాతీయ జెండాకు రూపకల్పన చేశారన్నారు. నగరంలోని విక్టోరియా మ్యూజియంలోనే జాతీయ జెండా ఆవిర్భావం జరిగిందని తెలిపారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గాయత్రి దేవి, వెంకయ్య కోడలు సుశీలమ్మ మాట్లాడుతూ పింగళి జీవితం ఆదర్శప్రాయమన్నారు. వేముల ఛారిటీస్ కోఆర్డినేటర్ చలమయ్య, విక్టోరియా మ్యూజియం సిబ్బంది, ఏపీ ఎన్‌జీవో సభ్యుడు రాంబాబు పాల్గొన్నారు.

ఆకాశవాణి కేంద్రంలో జయంతి వేడుకలు

విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో శుక్రవారం జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలోని పింగళి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీడీజీ సోమేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరం యువత పింగళి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పింగళి జీవిత విశేషాలు, మహాత్మా గాంధీతో ఉన్న అనుబంధం వివరించారు. కార్యక్రమ విభాగ అధిపతి బీ వెంకటేశ్వర్లు, ఏఓ సూర్య నారాయణ, కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చుండూరి మాణిక్యాలరావు తదితరులున్నారు.



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా, గాయత్రి, సుశీల తదితరులు



ఆకాశవాణి కేంద్రంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

కమిటీ కుర్రోళ్లు అందరినీ ఆకట్టుకుంటుంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 9న విడుదల కానున్న కమిటీ కుర్రోళ్లు చిత్రం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని ఆ చిత్ర నిర్మాత కొణిదెల నిహారిక అన్నారు. ఈ చిత్రాన్ని 90లో కిడ్స్ భావోద్వేగాలను తెలుపుతూ దర్శకుడు యదు వంశీ చిత్రీకరించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీక్షించి తమను ఆదరించాలని కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆ సినిమా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్మాత నిహారిక మాట్లాడారు. ఈ సినిమాతో 20 మంది కొత్త కుర్రోళ్లకు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారని చెప్పారు. ఈ సినిమా ట్రైలర్ అందరినీ ఆకట్టుకున్నట్లు పేర్కొన్నారు. కమిటీ కుర్రోళ్లు కోసం మూడేళ్లుగా పనిచేస్తూనే ఉన్నట్లు తెలిపారు. డైరెక్టర్ యదు వంశీ మాట్లాడుతూ విలేజ్‌లో కొంత మంది చిన్నప్పటి నుంచి టీనేజ్, యువకులుగా మారే స్థాయి వరకూ వివిధ దశల్లో వారి మధ్య చోటుచేసుకున్న సంఘటన నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నటీ, నటులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నటి నిహారిక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సినీనటి, నిర్మాత నిహారిక శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న చిత్ర నిర్మాత నిహారిక, పక్కన దర్శకుడు యదు వంశీ తదితరులు



నిహారికకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామరావు

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నిహారికను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

రేపు వాస్క్యులర్ వాక్‌థాన్

నగరంలో తొలిసారిగా నిర్వహిస్తున్న వైనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ వాస్క్యులర్ డేను పురస్కరించుకుని వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 4న విజయవాడలో వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ మాకినేని కిరణ్ తెలిపారు. రక్తనాళాల జబ్బులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గవర్నర్‌పేటలోని ప్రజావైద్యశాలలో వాక్‌థాన్‌కు సంబంధించిన టీషర్ట్‌ను అసోసియేషన్ సభ్యులు డాక్టర్‌శివకృష్ణ, డాక్టర్ రత్నశ్రీలతో కలిసి డాక్టర్ మాకినేని కిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న దేశ వ్యాప్తంగా వాస్క్యులర్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా 36 నగరాల్లో వాక్‌థాన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వాక్‌థాన్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రారంభమై ఏలూరు రోడ్డు మీదగా తిరిగి స్టేడియంకు చేరుకుంటుందని చెప్పారు. ఈ వాక్‌థాన్‌ను ఆరోగ్యశ్రీ డైరెక్టర్ లక్ష్మీషా ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్‌హెచ్ఎం ధ్యానచంద్ పాల్గొననున్నట్లు తెలిపారు.



వాక్‌థాన్ టీషర్ట్స్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ మాకినేని కిరణ్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ రత్నశ్రీ తదితరులు

చేనేత హస్తకళా ప్రదర్శన

గాంధీనగర్: ఆషాఢ, శ్రావణ మాసాలను పురస్కరించుకుని బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ప్రారంభించారు. ప్రదర్శన, అమ్మకాలు సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పోచంపల్లి, నారాయణ్‌పేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారీ, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంత్ వర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధనీ సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్ అందుబాటులో ఉన్నాయి.

వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ

కృష్ణలంక(విజయవాడతూర్పు):ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన డివిజన్‌లోని పలు వీధుల్లో పర్యటించారు. పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులతో కలిసి మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దగ్గరుండి సైడు కాలువల్లో ఏఎల్‌వో (యాంటీ లార్వా ఆపరేషన్) స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి పరిసరాల్లో డ్రమ్ములు, టైర్లు, కొబ్బరి బోండాలు, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. రోజుల తరబడి జ్వరంతో బాధపడుతుంటే ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి

గ్రామ స్థితిగతులపై అవగాహన



కంకిపాడు: గ్రామ స్థితిగతులను సమగ్రంగా వివరిస్తూ వ్యవసాయ విద్యార్థులు గ్రామ పటాన్ని ప్రదర్శించారు. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామానికి గ్రామీణ పనులు అవగాహన–అనుభవ కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన కేవీఎల్ యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు శుక్రవారం గ్రామ స్థితిగతులను వివరిస్తూ పటాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని భూ కమతాలు, ప్రధాన కార్యాలయాలు, సంస్థలు, వ్యవసాయ దిగుబడులు, సాగులో ఎదుర్కొన్న ఇబ్బందులు, గ్రామానికి అనుబంధంగా ఉన్న గ్రామాల జాబితా, చెరుకు దిగుబడులు గణాంకాల సమీక్షను వివరిస్తూ పటాన్ని రూపొందించారు. గ్రామంలోని పరిస్థితులను అన్నింటినీ రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు వి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, వి.మహేష్, జి.హర్షసాయి, ఎం.నాగమహేంద్ర రెడ్డి, ఎం.జనార్దన్‌రెడ్డి, డి.సాకేత్, షేక్ షాకిర్ అక్రం, ఎం.కృష్ణప్రసాద్, యు.సాయిరాం, సయ్యద్ సొహైల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



మొగల్రాజపురం: విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ బ్యాంకు ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను అందజేస్తున్నామని విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న శారదా కళాశాల ఆవరణలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.31.85 లక్షలను (ఈ ఏడాదిలో) ఉపకార వేతనాలుగా అందచేస్తున్నామన్నారు. పదో తరగతి విద్యార్థిని ఎస్. మోక్షిత వెంకట సాయి, పి.సాయిశ్రీ , ఇంటర్‌లో ఆత్ర ఫాతిమా, గుణశేఖర్, ఆర్.గీత శ్రీవల్లిలకు రూ.33 వేల విలువైన చెక్కులు, మెరిట్ సర్టిఫికెట్లను బ్యాంకు పాలకవర్గ సభ్యులు అజయ్, బి.రామచంద్ర రావు, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ.రావు, జోనల్ మేనేజర్ సి.సుబ్రహ్మణ్యం అందించారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 3-8-2024



మహిళా పాఠకులూ...
మీ బెస్ట్ ఫ్రెండ్‌తో ఫొటో పంపండి

మీ చిన్ననాటి, కాలేజీ నాటి బెస్ట్ ఫ్రెండ్‌తో అప్పట్లో మీరు దిగిన ఫొటోను, మీ స్నేహాన్ని, ఏదేని తీపి జ్ఞాపకాన్ని నాలుగు మాటల్లో వివరిస్తూ ఈ వాట్సప్ నంబర్ / మెయిల్‌కు పంపండి. ఎంపికైన వాటిని ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఆదివారం వచ్చే ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్ పేజీలో ప్రచురిస్తాం.

బెస్ట్ ఫ్రెండ్ వాట్సప్ నంబర్: 90523 95740
మెయిల్ : sakshifamily3@gmail.com



వివియానా రాబిన్‌సన్

- అస్తుల కోసం కాదు ఒలింపిక్స్‌కు వెళ్లడానికి డబ్బు పొదుపు చేసే రాబిన్‌సన్ కథ
- సూపర్ ఫ్యాన్

ఒలింపిక్స్ ఇంటిపేరయింది

మనసు ఉంటే మార్గమే కాదు 'మనీ' కూడా ఉంటుంది.

'అదెలా!' అని ఆశ్చర్యపడితే...

వివియానా రాబిన్‌సన్ గురించి తెలుసుకోవాల్సిందే.

'ఒలింపిక్స్' అనే మాట వినబడగానే ఆమె ఒళ్లు పులకించిపోతుంది.

ప్రపంచ సంగ్రామ క్రీడను టీవీలో కాదు ప్రత్యక్షంగా చూడాలనేది ఆమె కల. అలా కల కని ఊరుకోలేదు. ఒక్కసారి కాదు ఏడు సార్లు ఒలింపిక్స్ వెళ్లింది... అలా అని ఆమె సంపన్నురాలేం కాదు. చాలా సామాన్యురాలు.

ఒలింపిక్స్‌పై ఆసక్తి రాబిన్‌సన్‌కు 1984 ఒలింపిక్స్ సమయంలో మొదలైంది. ఆమె తల్లి 'యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా'లో అథ్లెట్‌లకు ట్రాన్స్‌లేటర్‌గా ఉండేది. తల్లి నోటి నుంచి ఒలింపిక్స్‌కు సంబంధించి ఎన్నో విషయాలు, విశేషాలు వినేది. ఆ ఆసక్తి రాబిన్‌సన్‌ను అట్లాంటా ఒలింపిక్స్‌కు వెళ్లేలా చేసింది.

'ఇప్పటిలా అప్పట్లో అథ్లెట్స్‌కు హైసెక్యూరిటీ ఉండేది కాదు. దీంతో ఎంతోమంది అథ్లెట్స్‌తో మాట్లాడే అవకాశం దొరికేది. కాని ఇప్పుడు సమీపంలోకి కూడా వెళ్లే పరిస్థితి లేదు' అని ఆరోజులను గుర్తు చేసుకుంటుంది రాబిన్‌సన్.

లాస్ ఏంజెల్స్, అట్లాంటా, సిడ్నీ, ఏథెన్స్, లండన్, రియో డి జెనీరోలతో పాటు తాజాగా ప్యారిస్ ఒలిపింక్స్‌కు కూడా వెళ్లింది.

స్థలం కొనడానికో, ఇల్లు కొనడానికో, భవిష్యత్ అవసరాల కోసమో సాధారణంగా డబ్బు పొదుపు చేస్తారు. కాని రాబిన్‌సన్ మాత్రం ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని డబ్బు పొదుపు చేస్తుంది. రోజుకు రెండు ఉద్యోగాలు చేసింది. ప్రస్తుత ప్యారిస్ ఒలింపిక్స్ కోసం కూడా ఎప్పటినుంచో పొదుపు మంత్రం పాటించింది.

ఒలింపిక్ థీమ్‌డ్ ట్రాక్‌సూట్‌తో ప్యారిస్‌లో టూరిస్టులు, వాలెంటీర్లకు ప్రత్యేక ఆకర్షణగా మారింది రాబిన్‌సన్. ఎంతో మంది ఆమెతో కలిసి సెల్ఫీలు దిగుతున్నారు. కొందరు ఆమె పాపులర్ టిక్‌టాక్ వీడియోల గురించి మాట్లాడుతుంటారు.

'సాధారణ దుస్తుల్లో కంటే ఇలాంటి దుస్తుల్లో కనిపించడం వల్ల నాతో మాట్లాడటానికి ఉత్సాహం చూపుతారు' అంటుంది తన ప్రత్యేక వేషధారణ గురించి చెబుతూ.

ఒలింపిక్స్ పుణ్యమా అని ప్రఖ్యాత అథ్లెట్లతో పాటు టామ్ క్రూజ్, లేడీ గాగా లాంటి సెలబ్రిటీ ఆర్టిస్టులతో కూడా మాట్లాడే అవకాశం వచ్చింది.

ఒలింపిక్స్ డైరీస్

> ఒక్కసారి ఒలింపిక్స్‌కు వెళ్లొస్తేనే ఆ అనుభవం 'ఆహా ఓహో' అనిపిస్తుంది. అలాంటిది ఏడుసార్లు వెళ్లడం అంటే అంతులేని అనుభూతి. అలాంటి అనుభూతిని సొంతం చేసుకుంది రాబిన్‌సన్. అథ్లెట్లకు లక్ష్యం మాత్రమే. వాలెంటీర్‌లకు వారు చేస్తున్న పని మాత్రమే కనిపిస్తుంది. అయితే ప్రేక్షకులుగా వెళ్లాలనుకునే వారికి మాత్రం 360 డిగ్రీల కోణంలో ఒలింపిక్స్ అనుభూతి సొంతం అవుతుంది. ఏడు ఒలింపిక్‌ల జ్ఞాపకాల సంపదను వృథా చేయవద్దు అంటున్నారు రాబిన్‌సన్ స్నేహితులు. సామాన్య ప్రేక్షకురాలిగా తాను చూసిన అనుభవాలను గ్రంథస్థం చేస్తే అదొక విలువైన గ్రంథం అవుతుంది. డైరీలలో దాగి ఉన్న ఆమె ఒలింపిక్ అనుభవాలు ఏదో ఒకరోజు పుస్తకరూపం దాల్చుతాయని ఖాయంగా చెప్పవచ్చు.

ఆరంభంలో ఉన్న ఉత్సాహం ఆ తరువాత ఉండకపోవచ్చు. అయితే 66 సంవత్సరాల వయసులోనూ రాబిన్‌సన్‌కు ఒలిపింక్స్‌పై ఆసక్తి తగ్గలేదు.

'డబ్బును పొదుపు చేస్తూ నేను బతికి ఉన్నంత వరకు ఒలింపిక్స్‌కు వెళుతూనే ఉంటాను' అంటుంది మెరిసే కళ్లతో రాబిన్‌సన్. అయితే నెక్స్ట్ ఒలింపిక్స్ కోసం ఆర్థికరీత్యా రాబిన్‌సన్ అంతగా కష్టపడక్కర్లేదు. ఎందుకంటే తన హోమ్‌టౌన్ లాస్ ఏంజెల్స్‌లోనే అవి జరగనున్నాయి.

వివియానా రాబిన్‌సన్ పేరుతో ఎంతోమంది ప్రొఫెసర్‌లు, రచయితలు, రకరకాల వృత్తుల వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో 'ఒలింపిక్స్' అనేది రాబిన్‌సన్ ఇంటి పేరు అయింది. ఆటల ప్రేమికులు, గూగుల్ లాంటి సెర్చ్ ఇంజిన్‌లకు వివియానా రాబిన్‌సన్ అనే కంటే 'ఒలింపిక్స్ రాబిన్‌సన్' అంటేనే సుపరిచితం.

రేపు ఫ్రెండ్‌షిప్ డే

'పక్కింట్లో సుజాత నాతో కాలేజీకొచ్చేది ఇప్పుడు ఎక్కడుందో'
'డిగ్రీ లాస్ట్ ఎగ్జామ్‌లో చూశాను సంధ్యను. మళ్లీ కాంటాక్ట్ లేదు'
'పెళ్లయ్యాక రెండుమూడుసార్లు మాట్లాడింది మాలతి. చూసి ఎన్నాళ్లయ్యిందో'
స్త్రీల మధ్య ఏర్పడే గాఢమైన స్నేహాలు ఎప్పుడో ఒకసారి తెగిపోవడమే జరుగుతుంది.
ఫ్రెండ్‌షిప్ డే నాడు స్త్రీలు తమ ఆత్మీయ స్నేహితురాళ్లను తలుచుకోవడమే తప్ప కలుసుకునే వీలెక్కడ?
కాని నాటి జ్ఞాపకాలు ఎంతో మధురమైనవి కదా.

ఎన్నాళ్లయ్యింది నిన్ను చూసి



ప్రతీకాత్మక చిత్రం

చిన్నప్పుడు ఆడపిల్లలు జట్టు కడతారు. అరుగుల మీద ఆటలాడతారు. స్కూల్ నుంచి రాగానే గబగబా స్నానాలు ముగించి కూడబలుక్కుని ట్యూషన్లకు నడుస్తారు. ఆదివారం వస్తే కలిసి పూలు కోసుకుంటారు. రేడియోలో పాటలు... దూరదర్శన్‌లో చిత్రహార్‌లు ...స్నేహితురాలి కుటుంబంతో సినిమాకు వెళ్లడం లేదా తన కుటుంబంతో స్నేహితురాలిని తీసుకెళ్లడం... ఒకరిని విడిచి మరొకరు ఉండలేనంత కబుర్లు.. రహస్యాలు... వెంటబెట్టుకెళ్లి చేసే బట్టల సెలక్షన్‌లు... జామెట్రీ బాక్స్‌లో దాచిన చిరుతిండ్ల పంపకాలు... ఇవన్నీ గొప్ప ఆనందాలు... శాశ్వతం అనిపిస్తాయి. కాని కుదరదు. చాలామందికి ఆ స్నేహం అసంపూర్ణమే.

వివాహం ఒక పునరావాసం

పెళ్లయ్యాక స్త్రీ భర్త ఇంటికి చేరుతుంది. భర్తది అదే ఇల్లు. పెళ్లికి ముందు పెళ్లి తర్వాత కూడా. కాని అమ్మాయికి పెళ్లికి ముందు ఒక ఇల్లు. పెళ్లి తర్వాత ఒక ఇల్లు. పుట్టింటి వాళ్లు తమ కూతురి స్నేహాలను ప్రోత్సహిస్తారు. ఆమె స్నేహితురాళ్లను తమ ఇంటి ఆడపిల్లల్లా చూస్తారు. వారికి ఎప్పుడూ స్వాగతం ఉంటుంది. కాని పెళ్లి అమ్మాయిని 'పరాయి ఇంటి'కి చేరుస్తుంది. ఆ పరాయి ఇంట్లోకి పెళ్లికూతురి స్నేహితురాలు స్వతంత్రించి వెళ్లలేదు. అందుకు భర్త అనుమతి అత్తామామల అనుమతి కావాలి. అది అంత సులభం కాదు.

కుటుంబమే ముఖ్యం

స్త్రీ ఇంటి పట్టున ఉన్నా, ఉద్యోగం చేస్తున్నా కుటుంబం మొదటి ప్రాధాన్యం అవుతుంది. పిల్లలు పుట్టాక స్త్రీ అన్నీ ప్రాధాన్యాలనూ వెనక్కు నెట్టి పిల్లల బాధ్యత ప్రథమంగా తీసుకుంటుంది. ఆమెకు సమయం చిక్కదు. ఆమె తన స్నేహితురాళ్లతో ఫోన్ మాట్లాడటం ఒకోసారి అభ్యంతరకరం కూడా కావచ్చు. 'ఎన్నో చెప్పుకోవాలని ఉంటుంది. కాని ఎప్పుడు చెప్పుకోవడం. ఎన్నోసార్లు కలవాలని ఉంటుంది. కాని ఎలా కలవడం?'

అతడిలా ప్రయాణం కట్టడం

భర్తకు విసుగు కలిగితే తన స్నేహితులను తీసుకొని అలా ఒక టూర్‌కు వెళతాడు. భార్య అలా తన స్నేహితురాళ్లతో వెళ్లలేదు. సామాజిక భద్రత సంగతి ఒక కారణమే అయినా అసలు అలాంటి వీలు కూడా ఉండదు చాలాసార్లు. తన స్నేహితులు వస్తే భార్యను పరిచయం చేసి వారికి టీలు కాఫీలు భోజనాలు భార్య చేత ఏర్పాటు చేయించే భర్త 'నీ స్నేహితురాళ్లను నువ్వూ ఆహ్వానించుకోవచ్చు' అని అనడం చాలా తక్కువగా జరుగుతుంది. విచిత్రమేమంటే మధ్య వయసు దాటాకే స్త్రీలు తమ పాత స్నేహితురాళ్లను కలిసే అనుమతి పొందుతారు. లేదా పిల్లల ద్వారా స్నేహాన్ని పునరుద్ధరించుకుంటారు.

స్నేహం అవసరం

ప్రతి మనిషికీ స్నేహం అవసరం. భర్త, పిల్లలు, బంధువులు ఎందరు ఉన్నా ప్రతి స్త్రీకి తన చిన్ననాటి, కాలేజీ నాటి, ఊరి స్నేహితురాళ్లు తప్పక అవసరమే. వారితో పంచుకునే విషయాలు. వారి ద్వారా పొందే ఓదార్పు, వారి నుంచి పొందే సలహాలు, వెళ్లబోసుకోవడాలు... ఇవన్నీ స్త్రీలు అలసిపోకుండా చూస్తాయి. కాని దురదృష్టవశాత్తు మన దేశంలో స్నేహమంటే పురుషుల స్నేహమే. స్నేహగాథలన్నీ వారివే.

కుటుంబంలో ఎంతో సంతోషంగా ఉండే స్త్రీ కూడా తన పాత స్నేహితురాలు కనిపిస్తే నవ్వే నవ్వు, కార్చే ఆనందబాష్పాలు పూర్తిగా ప్రత్యేకం. ఆ నవ్వు ఆనంద బాష్పాలు వారికి దక్కాలని ఈ ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా కోరుకుందాం.

చెవి రింగులతో ర్యాష్ వస్తోందా?



కొందరికి చెవి రింగులు లేదా దుద్దులు సరిపడక చెవి తమ్మెలకు ర్యాష్ రావచ్చు. కృత్రిమ ఆభరణాలలోని నికెల్ కారణంగా కొందరిలో ఈ ర్యాషెస్ వస్తాయి. ఫలితంగా దురద, ఎర్రబారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఈ దశలో నిర్లక్ష్యం చేస్తే గాయం మరింత రేగి, రక్తస్రావమయ్యే అవకాశాలు ఎక్కువ. ఈ సమస్యను 'అలర్జిక్ కాంటాక్ట్ డర్మటైటిస్ టు నికెల్' అంటారు. ఈ కింది సూచనలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. ● నికెల్‌తో అలర్జీ ఉన్నవారు ఆ లోహంతో తయారైన రింగులు, దిద్దుల వంటి కృత్రిమ ఆభరణాలు ధరించడం సరికాదు. ● ఫ్యూసిడిక్ యాసిడ్ లాంటి తక్కువ మోతాదు కార్టికోస్టెరాయిడ్ ఉన్న యాంటీబయాటిక్ కాంబినేషన్‌తో లభించే క్రీములను గాయం ఉన్న చోట రోజుకు రెండు సార్లు చొప్పున కనీసం 10 రోజులు రాస్తే త్వరగా తగ్గుతుంది. అప్పటికీ తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి.

సినిమా

ఇక షురూ



ప్రభాస్

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది. 'ఫౌజి' టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుందని, ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాగూర్, పాకిస్తాన్ నటి సజల్ అలీని అనుకుంటున్నారనీ ప్రచారం జరుగుతోంది. ఈ నెల మూడో వారంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుందని, ఆ వెంటనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలిసింది. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారని, మూడు పాటల పని కూడా పూర్తయిందని ఆ మధ్య హను రాఘవపూడి చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది.

గుండె ఒట్టు పెట్టుకున్నాదే...



రవితేజ
భాగ్యశ్రీ బోర్సె

'అల్లరిగా అల్లికగా అల్లేసిందే నన్నే...' అంటూ మొదలవుతుంది 'మిస్టర్ బచ్చన్' సినిమాలోని రొమాంటిక్ సాంగ్ 'జిక్కీ'. రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రంలో భాగ్య శ్రీ బోర్సె కథానాయిక. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమాలోని 'జిక్కీ....' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''నిన్ను చూసి గుండె ఒట్టు పెట్టుకున్నదే... గట్టుదాటి గట్టిగానే కొట్టుకున్నదే... పట్టుపట్టి పిల్లా చెయ్యి పట్టుకున్నదే...', 'నా మనసే నీకే చిక్కి... దిగనందే మబ్బుల్ ఎక్కి... నీ బొమ్మే చెక్కి... రోజూ నిన్నే పూజించానే జిక్కీ...' అనే లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ స్వరకల్పనలో వనమాలి సాహిత్యం అందించిన ఈ పాటను కార్తీక్, రమ్య బెహరా పాడారు.

ఉగాదికి వస్తున్నా



విజయ్ దేవరకొండ

ఉగాదికి థియేటర్స్‌లో కలుద్దాం అంటున్నారు విజయ్ దేవరకొండ. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ దేవరకొండ కెరీర్‌లో 12వ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమా ఇటీవల శ్రీలంకలో ఓ భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, మూవీని వచ్చే ఏడాది మార్చి 28న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఉగాది సందర్భంగా ఈ చిత్రం విడుదలను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ''ఇప్పటివరకు 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ నెలలోనే టైటిల్‌ను, త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోందని, ఇందులో విజయ్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారనీ టాక్. ఈ సినిమాకు కెమెరా: గిరీష్ గంగాధరన్, జోమోన్ టి. జాన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

మా నిర్ణయంలో మార్పు లేదు
- తమిళ నిర్మాతల మండలి

తమిళ నిర్మాతల మండలి, నడిగర్ సంఘం (దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం) మధ్య వివాదం ముదురుతోందా? అంటే అవుననే అనిపిస్తోంది. ఇటీవల తమిళ నిర్మాతల మండలి, డిస్ట్రిబ్యూటర్ల సంఘం, థియేటర్ల సంఘం నిర్వాహకులు సమావేశమై నటీనటుల పారితోషికాలు, పెరిగిపోతున్న నిర్మాణ వ్యయం, నటీనటులు ముందుగా ఒప్పుకున్న చిత్రాలు పూర్తి చేశాకే కొత్త చిత్రాలను అంగీకరించాలని, నటుడు ధనుష్ చాలా చిత్రాలకు అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఆయనతో కొత్తగా చిత్రాలు చేసే నిర్మాతలు ముందుగా నిర్మాతల మండలితో చర్చించాలని, ఈ సమస్యలన్నీ పరిష్కారమయ్యే వరకూ నవంబర్ నెల ఒకటో తేదీ నుంచి షూటింగ్‌లను రద్దు చేస్తున్నట్లు తీర్మానాలు చేశారు. నిర్మాతల మండలి చేసిన ఈ తీర్మానాలు తమకు సమ్మతం కాదని, వెనక్కి తీసుకోవాలని దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ పై స్పందిస్తూ తమిళ నిర్మాతల మండలి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నటుడు ధనుష్‌పై ఎలాంటి ఫిర్యాదు లేదని దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం పేర్కొనడం అవాస్తవమని నిర్మాతల మండలి పేర్కొంది. ఏడాదిన్నర క్రితమే నిర్మాతల మండలి సర్వసభ్య సమావేశంలో నిర్మాతలకు నష్టం కలిగించిన ఐదుగురు నటుల గురించి తీర్మానం చేసి, దాన్ని నడిగర్ సంఘానికి పంపామని తెలిపింది. అయితే దానిపై ఆ సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించింది. ఈ కారణంగానే నిర్మాతల మండలి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని, తమ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేయడంతో పాటు తమకు నడిగర్ సంఘం సహకరిస్తుందని భావిస్తున్నామని పేర్కొంది. దీనిపై నడిగర్ సంఘం ఎలా స్పందిస్తుందో చూడాలి.

– సాక్షి, చెన్నై

లవ్ స్కోర్ ఎంత?



కృతీ శెట్టి

లవ్ స్కోర్ ఎంత ఉందో చెక్ చేసుకుంటున్నారు కృతీ శెట్టి. మరి... స్కోర్ ఎంత అంటే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'లో చూడాలంటున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే... 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. విఘ్నేష్ శివన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్, విఘ్నేష్ భార్య నయనతార ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని ప్రదీప్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. తాజాగా కృతీ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చూస్తుంటే 2035 సెప్టెంబరు 9న ఓ హై ఎండ్ టెక్నాలజీ మొబైల్ ఫోన్‌లో కృతీ శెట్టి లవ్ స్కోర్‌ను చెక్ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. దీన్నిబట్టి భవిష్యత్‌లో సోషల్ మీడియా ప్రభావం, యువతీ యువకుల తీరు, మానవీయ సంబంధాలు వంటి అంశాలను ఈ చిత్రంలో దర్శకుడు విఘ్నేష్ ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది.

వినోదం... భావోద్వేగం



తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటించనున్న కొత్త చిత్రం ప్రకటన వచ్చింది. వంశీరెడ్డి దొండపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని బూసం జగన్‌మోహన్ రెడ్డి, వేణు ఊడుగుల నిర్మించనున్నారు. శ్రీనివాస్ గౌడ్ (తరుణ్ భాస్కర్) అనే పాత్ర అతని భార్య శ్రీలత నుంచి విడాకులు తీసుకున్నట్లు సూచించే స్టాంప్ పేపర్‌తో ఈ మూవీని ప్రకటించారు మేకర్స్. ''వినోదం, భావోద్వేగంతో అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ప్రేక్షకులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కొత్త నటీనటులకు చాన్స్ ఇచ్చేందుకు కాస్టింగ్ కాల్‌ని అనౌన్స్ చేశాం'' అని చిత్రబృందం పేర్కొంది.

దర్శకుడు అజయ్ శాస్త్రి కన్నుమూత



'నేను మీకు తెలుసా?' సినిమాతో దర్శకుడిగా మారిన అజయ్ శాస్త్రి (50) కన్నుమూశారు. ఈ సినిమాలో హీరోగా నటించిన మంచు మనోజ్ దర్శకుడు అజయ్ శాస్త్రి మృతి గురించి 'ఎక్స్'లో పేర్కొన్నారు. ''నేను మీకు తెలుసా?' సినిమా కెప్టెన్, నా స్నేహితుడు అజయ్ శాస్త్రి ఇక లేరని తెలియజేయడానికి చాలా బాధగా ఉంది. త్వరగా వెళ్లిపోయావ్... అజయ్. ఆ పరమశివుడు అతని కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలి. ఓం శాంతి' అంటూ చాలా భావోద్వేగంగా 'ఎక్స్'లో షేర్ చేశారు మనోజ్. హైదరాబాద్‌లో పుట్టి పెరిగారు అజయ్. జూలై 26, 1974లో అజయ్ జన్మించారు. సినిమాలపై ఆసక్తితో ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. దర్శకుడు కృష్ణవంశీ తెరకెక్కించిన 'రాఖీ', 'డేంజర్' సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. షార్ట్ ఫిల్మ్స్, యాడ్ ఫిల్మ్స్ చేశారు. ర్యాక్‌బ్యాండ్స్‌లో లీడ్ సింగర్‌గానూ పాటలు పాడారు. మంచు మనోజ్‌తో అజయ్ దర్శకత్వం వహించిన 'నేను మీకు తెలుసా?' సినిమా 2008లో విడుదలైంది. ఈ సినిమా దర్శకుడిగా అజయ్‌కి మంచి పేరు తెచ్చిపెట్టింది. అయితే ఆ తర్వాత ఆయన మరో సినిమాకు దర్శకత్వం వహించలేదు. ఇక అజయ్ శాస్త్రి మృతి పట్ల పలువురు తెలుగు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.


కామెడీ...



నందిని, అనిల్

వాటుపల్లి అనిల్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బుక్కా ఫకీర్'. యుక్తా మూవీస్ పతాకంపై రూపొందిన ఈ మూవీలో నందిని హీరోయిన్. ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రిలీజ్ చేసి, మాట్లాడుతూ – ''ట్రైలర్ చూస్తుంటే ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు హారర్ నేపథ్యంలో సినిమా సాగుతుందని తెలుస్తోంది'' అన్నారు.

యాక్షన్ విక్రమ్



ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర హీరోగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'విక్రమ్ కే దాస్'. బాలు పోలిచెర్ల దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఉపేంద్ర కెరీర్‌లోని ఈ 8వ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. ''యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న మూవీయే అయినప్పటికీ సంగీతానికి ప్రాముఖ్యత ఉంది. సంగీత దర్శకుడు పృథ్వీ మంచి ట్యూన్స్ ఇస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. అలాగే ఉపేంద్ర కెరీర్‌లో రెండో మూవీగా రూపొందిన 'కంచర్ల' త్వరలో విడుదల కానుంది.

సర్దార్‌కి జోడీగా...



మాళవికా మోహనన్

కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్దార్' (2022) సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ హిట్ కాంబినేషన్‌లోనే 'సర్దార్ 2' రూపొందుతోంది. ఈ మూవీలో కార్తీకి జోడీగా మాళవికా మోహనన్ నటిస్తున్నట్లు శుక్రవారం మేకర్స్ ప్రకటించారు. ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''సర్దార్' తమిళ, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్‌గా రూపొందిస్తున్న 'సర్దార్ 2' షూటింగ్ చెన్నైలో ప్రారంభమైంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య ఓ పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది.